ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

epaper.vaartha.com WWW.VAARTHA.COM

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

9-10-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 250 పేజీలు: 10+4 వెల: 6.50



సిఐసి జ్ఞానేశ్‌కు 42 మంది మాజీ జడ్జిల మద్దతు 5

డా.ముదిగొండ శివప్రసాద్ కన్నుమూత 7


## విలక్షణ నటుడు నానాపటేకర్ కన్నుమూత



### 3 సార్లు జాతీయ అవార్డులు, పద్మశ్రీ అందుకున్న నటుడు

### రాష్ట్రపతి సహా పలువురు ప్రముఖుల సంతాపం

**పనాజి, అక్టోబరు 8:** భారతీయ సినీ పరిశ్రమలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. విలక్షణ నటనకు చిరునామాగా నిలిచిన ప్రముఖ నటుడు నానా పటేకర్ (75)గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. >>2

## కెనడా రచయిత్రికి సాహిత్య నోబెల్



### సరికొత్త ప్రక్రియల సృష్టికర్తగా అన్నే కార్సన్‌కు అత్యున్నత పురస్కారం

**స్టాక్‌హోమ్, అక్టోబరు 8:** ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారాలను వరుసగా ప్రకటిస్తున్న రాయల్ స్వీడిష్ అకాడమీ.. గురువారం సాహిత్య రంగంలో అవార్డును ప్రకటించింది. కెనడాకు చెందిన రచయిత్రి, కవయిత్రి కూడా అయిన 76 ఏళ్ల ఆన్ కార్సన్ ఈ అవార్డును సొంతం చేసుకున్నారు. సమకాలీన కవిత్వం, గద్య రచనలలో >>2



# గాంధీ సాక్షిగా.. మహాధర్నా

## లంచ్ మీటింగ్ కాగానే ఢిల్లీ రాజ్‌ఘాట్‌వద్ద 'ఇండి'నేతల భారీ ఆందోళన

గురువారం న్యూఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద ఆందోళనలో ఖర్గే, రాహుల్, ప్రియాంక తదితరులు

### జ్ఞానేశ్, మోడీ, అమిత్‌షా రాజీనామాకు డిమాండ్

### నేడు రాష్ట్రపతితో కూటమి నేతల భేటీ

### బృందంలో ఖర్గే, రాహుల్, అఖిలేష్, మమత ప్రభృతులు

**న్యూఢిల్లీ, అక్టోబరు 8:** ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పట్ల నిరసన తెలుపుతూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా డిమాండ్‌పై మూడో రోజు ఆందోళనకు కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి సిద్ధమైంది. ఇక శుక్రవారం రాష్ట్రపతిని కలిసేందుకు కూడా నిర్ణయించారు. రాష్ట్రపతి భవన్‌కు మార్చ్ గా వెళ్లాలనినిర్ణయించారు. ఇందుకోసం ఇప్పటికే రాష్ట్రపతి భవన్‌కు 15 మందితోకూడిన లేఖను జతచేస్తే పదిమందికి అనుమతి లభించిందని సమాచారం. తొలి రోజు ఢిల్లీలోని ఎన్నికల కార్యాలయం, రెండో రోజు జంతర్ మంతర్ వద్ద నిరసనకు దిగిన రాహుల్ గాంధీ అండ్ కో, గురువారం మరోసారి నిరసనలకు సిద్ధమయ్యారు. సాగర్ రత్నలో ఇండియా కూటమి నేతలు లంచ్ మీటింగ్ చేసిన తర్వాత జంతర్ మంతర్ వద్ద నిరసరకు వెళ్లారు. అదేతరహాలో గురువారం కూడా ఇదే తరహాలో బస్సుల్లో >>2

## మోడీ దిగిపోవాలి

### లేకుంటే ప్రజలే దింపుతారు..

### జనాభా 140 కోట్లు దాటితే 13 కోట్ల ఓట్ల గల్లంతు ఎలా?

### ఇడి, ఐటి, సిబిఐ బిజెపి సర్కార్‌ను రక్షించలేవు

### ఢిల్లీ నిరసన ప్రదర్శనలో సిఎం రేవంత్



రాజ్‌ఘాట్ నిరసనలో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు8:** ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకుని దొడ్డిదారిన అధికారాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తే ప్రజలు తిరుగుబాటుచేస్తారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఈడీ, ఆదాయపు >>2



గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన లోక్‌భవన్ ముట్టడిలో పాల్గొన్న మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం, అడ్లూరి, వాకిటి, అజారుద్దీన్, పిసిసి చీఫ్ మహేష్ తదితరులు

## ఛలో లోక్‌భవన్ ఉద్రిక్తం

### జ్ఞానేశ్‌ను తొలగించేదాకా విశ్రమించబోమన్న కాంగ్రెస్ నేతలు

### పిసిసి చీఫ్ మహేష్ గౌడ్, పలువురు మంత్రుల అరెస్టు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), అక్టోబరు 8, ప్రభాతవార్త:** ఓటరు జాబితా సవరణలో అక్రమాలు, అర్హులైన ఓటర్ల తొలగింపును నిరసిస్తూ కాంగ్రెస్ చేపట్టిన 'చలో లోక్‌భవన్' ముట్టడి కార్యక్రమం గురువారం ఉద్రిక్తంగా మారింది. సీఈసీ జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా ఆందోళన నిర్వహించారు. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి లోక్‌భవన్ వరకు భారీ ర్యాలీగా తరలివెళ్లిన నాయకులను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి >>2

## ఓట్ల దరఖాస్తులు 5 లక్షలు!



### ఎన్‌ఆర్‌ఐల నుంచి 6 వేలు పైనే..

### నవంబరు 5 దాకా దరఖాస్తుల పరిష్కారం

### తుదిజాబితా 9న విడుదల: ఎస్ఇఒ

**హైదరాబాద్,అక్టోబరు8,ప్రభాతవార్త:** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా కొత్త ఓటు కోసం భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా 4,88,417 ఫామ్6 దరఖాస్తులు అందినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. అలాగే విదేశాల్లో నివసిస్తున్న భారతీయుల నుంచి 6,270 ఫామ్-6ఏ దరఖాస్తులు వచ్చాయి. ఓటర్ల వివరాల్లో మార్పులు, చిరునామా సవరణలు వంటి అంశాల కోసం 5,04,782 ఫామ్8 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ఇదే సమయంలో ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపుపై అభ్యంతరాలు, తొలగింపు అభ్యర్థనల కోసం ఫామ్ 7లు కూడా వేల సంఖ్యలో వచ్చాయి. ఫామ్7 ద్వారా ఇప్పటికే ఉన్న ఓటరు పేరును తొలగించాలన్న అభ్యంతరాలు, తొలగింపు అభ్యర్థనను దాఖలు చేయవచ్చు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా దాఖలైన క్లెయిమ్‌లు, అభ్యంతరాల గడువు ఈనెల 7వ తేదీతో ముగిసింది. వచ్చిన దరఖాస్తులు, అభ్యంతరాలను పరిశీలించి నవంబర్ 5వ తేదీ వరకు పరిష్కరించనున్నారు. ఆ తర్వాత నవంబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఎన్నికల జాబితా సవరణకు సంబంధించిన ఈ షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ముందుగానే ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా 4,88,417 ఫారం6లు, ఎన్ఆర్ఐల నుంచి 6,270, ఓటు తొలగింపు కోసం 24,323 ఫారం-7లు, వివరాల మార్పు కోసం 5,04,782 ఫారం-8లు వచ్చినట్లు రాష్ట్ర ఎన్నికల కార్యాలయం తెలిపింది. హైదరాబాద్ జిల్లాలో ఓటు తొలగింపు కోసం అందించే ఫారం7ల బోగస్ పత్రాల కట్టలు లభ్యమవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపింది. అయితే గురువారం రాష్ట్ర ఎన్నికల కార్యాలయం (ఎస్ఈవో) రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన ఫారం-7లపై స్పష్టతనిచ్చింది. ఇందులో భాగంగా హైదరాబాద్ జిల్లా పరిధిలోని 15 నియోజకవర్గాల నుంచి 6,335 ఫారం-7లు వచ్చినట్లు ఎస్ఈవో ప్రకటించింది. ముషీరాబాద్ నియోజకవర్గంలో 151 ఫారం7లుగా రాగా, అందులో 87 తొలగించినట్లు తెలిపింది. గోషామహల్‌లో 222 ఫారం7లకు గానూ 87 తొలగించినట్లు ఎన్నికల కార్యాలయం స్పష్టం చేసింది. హైదరాబాద్ జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో కలిపి మొత్తం 6,335 ఫారం7లు అందగా, ఇప్పటి వరకు 2,066 తొలగించారు. మరోవైపు రాష్ట్రంలో కొత్తగా ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన ఫారం6లు అత్యధికంగా హైదరాబాద్ జిల్లా నుంచే వచ్చినట్లు ఎస్ఈవో వెల్లడించింది. ఈ జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో కొత్త ఓటు కోసం మొత్తంగా 1,93,135 దరఖాస్తులు రాగా, అందులో ఇప్పటివరకు 29,226 అప్లికేషన్లను ఆమోదించింది. హైదరాబాద్ జిల్లా నుంచి 4,127 >>2



### భారత్ ఐటి కంపెనీలకు

## ట్రంప్ సర్కార్ భారీ షాక్

### శాశ్వత కార్మిక ధ్రువీకరణ పథకం రద్దు

**వాషింగ్టన్, అక్టోబరు 8:** అమెరికాలోని ప్రముఖ ఐటీ కంపెనీలకు ట్రంప్ ప్రభుత్వం భారీ షాక్ ఇచ్చింది. భారతీయ ఐటీ కంపెనీలైన ఇన్ఫోసిస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, విప్రో, హెచ్‌సీఎల్ సహా పలు దిగ్గజ సంస్థలను విదేశీ ఉద్యోగులకు శాశ్వత నివాస హోదా (గ్రీన్ కార్డ్) కల్పించే ప్రక్రియలో ఉపయోగించే కార్యక్రమం నుంచి అమెరికా కార్మిక >>2

## జిఎస్టీ మరింత సరళం

### పన్ను అధికారులకు అరెస్టు అధికారం కట్

### ప్రాసిక్యూషన్ పరిమితి రూ.5 కోట్లకు పెంపు

### కౌన్సిల్ కీలక నిర్ణయాలు



జీఎస్టీ కౌన్సిల్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్

**న్యూఢిల్లీ, అక్టోబరు 8:** వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వ్యవస్థలో కీలక మార్పులకు జీఎస్టీ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. పన్ను అధికారులకు ఉన్న అరెస్ట్ చేసే అధికారాన్ని తొలగించడంతో పాటు, ప్రాసిక్యూషన్‌కు సంబంధించిన పరిమితిని రూ.1 కోటి నుంచి రూ.5 కోట్లకు పెంచినట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం వెల్లడించింది. చిన్న స్థాయి విక్రేతలకు ఈకామర్స్ ప్లాట్‌ఫామ్‌లపై వ్యాపారం నిర్వహించేందుకు నిబంధనలను కూడా కౌన్సిల్ సులభతరం చేసింది. 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో జీఎస్టీ రేట్లలో ఎలాంటి మార్పులు చేయలేదు. జీఎస్టీ రేట్ల నిర్మాణం ఇప్పటికే స్థిరపడింది. అందువల్ల పన్ను వ్యవస్థ రోజువారీగా ఎలా పనిచేస్తుందనే అంశంపై కౌన్సిల్ దృష్టి సారించిందని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇకపై జీఎస్టీ రేట్లలో మార్పులు సంవత్సరానికి ఒకసారి మాత్రమే చేపట్టే విధానాన్ని అనుసరించనున్నట్లు పేర్కొంది. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) క్లెయిమ్‌ల విషయంలో నిజాయితీగా వ్యవహరించే కొనుగోలుదారుల ప్రయోజనాలను కాపాడేందుకు అధికారుల కమిటీని ఏర్పాటు చేయాలని 57వ జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయించింది. సరైన ఇన్‌వాయిస్ కలిగి ఉండి, వస్తువులను స్వీకరించి, సరఫరాదారుడికి పూర్తి మొత్తాన్ని చెల్లించిన నిజమైన కొనుగోలుదారుడికి రక్షణ కల్పించే విధానాన్ని ఈ కమిటీ పరిశీలించనుంది. ఈ అంశంపై కమిటీ 3 నెలల్లో అధ్యయనం పూర్తి చేయనుంది. అనంతరం తదుపరి జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో దీనిపై ప్రతిపాదనను ప్రవేశపెట్టనున్నారు. >>2


పన్ను మోసాలపై కఠిన చర్యలు: డి.సిఎం భట్టి 7




## ఉక్రెయిన్ బస్సులపై రష్యా దాడులు

### 2 బస్సులకు తీవ్ర నష్టం

### 33 మంది మృతి, 18 మందికి గాయాలు

**క్రమటోర్స్క(ఉక్రెయిన్), అక్టోబరు 8:** తూర్పు ఉక్రెయిన్‌లోని క్రమటోర్స్క్ నగరంలో గురువారం ఉదయం జరిగిన దాడిలో రెండు ప్రయాణికుల బస్సులు దెబ్బతిన్నాయి. ఈ ఘటనలో 33 మంది మృతి చెందగా, మరో 18 మంది గాయపడ్డారు. డొనెట్స్క్ ప్రాంత ప్రాసిక్యూటర్ కార్యాలయం ప్రకారం మృతుల సంఖ్య 30కి చేరింది. గవర్నర్ >>2

## మళ్లీ మండుతోంది!



### గణనీయంగా పెరిగిన ఉష్ణోగ్రతలు

### అత్యధికంగా ఆదిలాబాద్‌లో $37^{0}$

**హైదరాబాద్, అక్టోబరు 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎండల తీవ్రత మళ్లీ పెరుగుతున్నది. నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ప్రారంభం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. పగటిపూట ఎండల మంటలు, రాత్రివేళల్లో ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇవాళ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో గరిష్ఠంగా 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డు కాగా, భద్రాచలం, మహబూబ్‌నగర్‌లలో 36.2 డిగ్రీలు, హైదరాబాద్‌లో 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించిది. రుతుపవనాల నిష్క్రమణ ప్రభావంవల్లే వాతావరణంలో ఈ మార్పులు చోటుచేసుకున్నాయని అధికారులు స్పష్టంచేశారు. రాష్ట్రం నుంచి నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. గురువారం ఉత్తర, మధ్య తెలంగాణ ప్రాంతాల నుంచి రుతుపవనాలు వెనుదిరిగాయని, శుక్రవారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా ఇవి పూర్తిగా నిష్క్రమిస్తాయని వాతావరణ అధికారులు చెప్పారు. రుతుపవనాల తిరోగమనం ప్రభావంతో రానున్న కొద్దిరోజుల పాటు ఎండల తీవ్రత కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మరోపక్క అక్టోబర్ మాసానికి అసాధారణమైన వేడి, తేమతో కూడిన వాతావరణం హైదరాబాద్ వాసులను వేధిస్తూనే ఉంది. గురువారం నైరుతి రుతుపవనాలు మరింత వెనక్కి తగ్గినట్లు వాతావరణ శాఖ నమోదు చేసింది. గురువారం మధ్యాహ్నం హైదరాబాద్ వ్యాప్తంగా ఉష్ణోగ్రత 35 డిగ్రీల సెల్సియస్‌గా కొనసాగగా, తెలంగాణలోని పలు జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు 37 >>2

### నాలుగు నెలల్లో 25% ధర పెరిగిన సన్న బియ్యం



## బియ్యమో! రామచంద్రా!

### ఇలాగే పెరిగితే కిలో రూ. 100 దాటే ప్రమాదం

### ఎఫ్‌సిఐకి కామన్‌వెరైటీగా ఇస్తే 728కోట్లు నష్టం

### మార్కెట్‌కు విడుదల చేయడమే మేలు

**హైదరాబాద్, అక్టోబరు 8,ప్రభాతవార్త:** భారతదేశవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంతో వానాకాలం వరిసాగు తగ్గడం, మరోవైపు యాసంగిలో కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉండటంతో బియ్యం ధరలు నిరంతరంగా పెరుగుతున్నాయి. గత నాలుగు నెలలుగా పెరుగుతున్న బియ్యం ధరలను నియంత్రించడానికి తెలంగాణ ప్రభుత్వం సన్నాలను కామన్ రకంగా మార్చుచేసి భారత ఆహార సంస్థకు అందించడాన్ని విరమించుకొని రాష్ట్రమార్కెట్‌లో విడుదలచేస్తే ఎగువ మధ్య తరగతి ఉన్నతవర్గాలకు ఊరట కలిగి అవకాశం ఉంది. సన్నాలుకామన్ వెరైటీగా నోటిఫై చేయడం వల్ల ప్రభుత్వంకు జరిగే రూ.728కోట్ల నష్టం కూడా నివారణ చేసుకొనే అవకాశం ఉంది. ప్రస్తుతం కిలోబియ్యం 83 రూపాయలు చేరాయి. మరోవైపు సన్నాలు అధికంగా పండించే ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాలో వానాకాలంలో దిగుబడైన ధాన్యంను తమిళనాడు, మహారాష్ట్రా, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ నుంచి వ్యాపారులు వచ్చి రైతులతోనే నేరుగా క్వింటాల్‌కు మూడున్నరవేలు పెట్టి కొనుగోలు చేసుకోవడానికి ఒప్పొందం చేసుకొంటున్నారు. తెలంగాణలో మేలు రకం బియ్యం కొరత ఏర్పడి ధరలకు రెక్కలు వచ్చే ప్రమాదం మరింత ఎక్కువగా ఉంది. సన్నబియ్యం ధరలు నాలుగునెలల్లోనే 25శాతం >>2



గురువారం పాట్నాలో నిర్వహించిన లోక్‌భవన్ ముట్టడిలో బారికేడ్ల పైనుంచి దాటుతున్న ఆర్జేడీ నాయకుడు తేజస్వి యాదవ్

## ప్రేక్షక హృదయాల్లో పటేకర్ చెరగని ముద్ర: సిఎం రేవంత్

**హైదరాబాద్,అక్టోబరు8,ప్రభాతవార్త:** ప్రముఖ సినీ నటుడు, దర్శకుడు నానా పటేకర్ ఆకస్మిక మరణం పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. హిందీ, మరాఠీ సినిమాల్లో తన విలక్షణమైన నటన, శక్తివంతమైన సంభాషణా శైలి, సహజమైన అభినయంతో నానా పటేకర్ ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు. నటుడిగా మాత్రమే కాకుండా దర్శకుడిగా, రంగస్థల కళాకారుడిగా కూడా ఆయన సినీ రంగానికి విశిష్టమైన సేవలందించారని గుర్తుచేస్తూ నానా పటేకర్ మరణంతో భారతీయ సినీ ప్రపంచం ఒక విలక్షణమైన ప్రతిభను కోల్పోయిందని అన్నారు. నానా పటేకర్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు, ప్రగాఢ సానుభూతిని, తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు.

## కెనడా రచయిత్రికి సాహిత్య నోబెల్

>> అత్యంత విశిష్టమైన రచయిత్రిగా పేరున్న కార్సన్‌కు ఈ ఏడాది నోబెల్ సాహిత్య పురస్కారం ప్రకటించారు. ఈ మేరకు స్వీడన్ రాజధాని స్టాక్‌హోమ్‌లో రాయల్ స్వీడిష్ అకాడమీ కీలక ప్రకటన చేసింది. ఈ అవార్డు ప్రకటన సమయంలో కార్సన్ ఐస్‌లాండ్‌లో ఉన్నారు. దీంతో ఆమెకు ఈ ప్రతిష్టాత్మక పురస్కారం ప్రకటించినట్లు నోబెల్ కమిటీ ఫోన్ చేసి చెప్పింది. ఈ పురస్కారం అందుకున్న ఆ క్షణాన్ని గుర్తుచేసుకుంటూ తాను ఐస్‌లాండ్‌లో గాలి శబ్దాన్ని వింటూ ఉన్నానని కార్సన్ తెలిపారు. కవిత్వం, గద్యం, ప్రాచీన సాహిత్యం, అనువాదం వంటి వివిధ ప్రక్రియల మధ్య సంచరించే తన రచనలకు కార్సన్ ప్రసిద్ధి చెందారు. ఆమె రచనలు సమకాలీన ఇతివృత్తాలను అన్వేషిస్తూనే, తరచుగా ప్రాచీన గ్రీకు సాహిత్యం నుండి ప్రేరణ పొందుతాయి. అనే కార్సన్ అత్యంత ప్రసిద్ధ రచనలలో ఆటోబయోగ్రఫీ ఆఫ్ రెడ్, ది బ్యూటీ ఆఫ్ ది హస్బెండ్, రాంగ్ నార్మా ఉన్నాయి. ఆమె సాఫో, యూరిపిడిస్ రచనలతో సహా ప్రాచీన గ్రీకు రచనలను కూడా అనువదించారు. కార్సన్ తన వృత్తి జీవితంలో అనేక ప్రధాన సాహిత్య పురస్కారాలను అందుకున్నారు. మెక్‌గిల్, ప్రిన్స్‌టన్, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బర్కిలీ వంటి విశ్వవిద్యాలయాలలో క్లాసిక్స్, సాహిత్యాన్ని బోధించారు.

## మళ్లీ మండుతోంది!

>> డిగ్రీల సెల్సియస్‌కు చేరువయ్యాయి. ఇదిలా ఉండగా, తెలంగాణ అభివృద్ధి ప్రణాళికా సంఘం సేకరించిన సమాచారం ప్రకారం, గత 24 గంటల్లో హైదరాబాద్‌లో నమోదైన అత్యధిక పగటి ఉష్ణోగ్రత సంతోష్‌నగర్ మరియు చింతల్‌లో 35.3 డిగ్రీల సెల్సియస్‌గా, ఆ తర్వాత మల్కాజ్‌గిరి మరియు సరూర్‌నగర్‌లో 35.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. కాగా గురువారం జారీ చేసిన వాతావరణ అప్‌డేట్‌లో, జార్ఖండ్ మరియు ఛత్తీస్‌గఢ్‌లతో పాటు మహారాష్ట్రలోని మిగిలిన ప్రాంతాలు, గోవా, కర్ణాటక, తెలంగాణ మరియు ఒడిశాలోని కొన్ని ప్రాంతాల నుండి నైరుతి రుతుపవనాలు మరింతగా ఉపసంహరించుకున్నాయని భారత వాతావరణ శాఖ హైదరాబాద్ పేర్కొంది.

## ఓట్ల దరఖాస్తులు 5 లక్షలు!

>> ఎన్ఆర్ఐలు కూడా కొత్త ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు ఎస్ఈవో వెల్లడించింది. దీంతో పాటు జిల్లా పరిధిలో అడ్రస్, ఇతర వివరాల మార్పు కోసం 1,44,495 దరఖాస్తులు (ఫారం-8)వచ్చినట్లు తెలిపింది. ఇక రంగారెడ్డి జిల్లాలో 74,375 ఫారం6లు, 2,223 ఫారం-7లు, 68,002 ఫారం-8లు అందాయి. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలో కొత్త ఓటు కోసం 64,167, ఎన్ఆర్ఐల నుంచి 561, ఓటు తొలగింపు కోసం 1,749, వివరాల మార్పు కోసం 65,376 అప్లికేషన్లు వచ్చినట్లు రాష్ట్ర ఎన్నికల కార్యాలయం వెల్లడించింది. తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత తుది ఓటర్ల జాబితాలో ఓటర్ల సంఖ్య గణనీయంగా మారే అవకాశం ఉందని తాజా రిపోర్టులు సూచిస్తున్నాయి. ఇప్పటికే కోట్లాది మంది ఓటర్ల వివరాలను పరిశీలించి తుది జాబితాలో చేర్చేందుకు అధికారులు ప్రక్రియ కొనసాగిస్తున్నారు. నవంబర్ 9వ తేదీన వెలువడే తుది జాబితాతో రాష్ట్రంలోని ఓటర్ల సంఖ్యపై స్పష్టత రానుంది. కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నవారు, తమ వివరాల్లో మార్పులు కోరినవారు తుది జాబితా ప్రచురణ తర్వాత.. తమ పేరు, వివరాలు ఓటర్ల జాబితాలో సరిగ్గా నమోదయ్యాయో లేదో పరిశీలించుకోవడం కీలకమని ఎన్నికల సంఘం అధికారులు పేర్కొంటున్నారు.

## జిఎస్టీ మరింత సరళం

>> జీఎస్టీ చట్టం కింద ప్రాసిక్యూషన్‌కు సంబంధించిన పరిమితిని రూ.1 కోటి నుంచి రూ.5 కోట్లకు పెంచాలని కౌన్సిల్ నిర్ణయించింది. అదే సమయంలో కనీస శిక్ష నిబంధనను తొలగించింది. కేసును బట్టి జరిమానా, జైలు శిక్ష లేదా రెండింటిలో ఏది విధించాలనే నిర్ణయాన్ని న్యాయస్థానాల విచక్షణకు వదిలింది.

ఏదైనా ఉల్లంఘనకు ప్రత్యేకంగా జరిమానా నిర్దేశించని సందర్భాల్లో వర్తించే సాధారణ జరిమానాను కూడా తగ్గించారు. ప్రస్తుతం ఉన్న రూ.25,000 నుంచి ఈ జరిమానాను రూ.10,000కు తగ్గించినట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది.

## ఉక్రెయిన్ బస్సులపై రష్యా దాడులు

>> కార్యాలయం కూడా ఇదే సంఖ్యను ధృవీకరించింది. ఘటన నేపథ్యంలో నగరంలో ప్రజా రవాణా సేవలను తాత్కాలికంగా నిలిపివేశారు. ఘటనాస్థలానికి సంబంధించిన ఫొటోల్లో శిథిలాల మధ్య మృతదేహాలు, కాలిపోయిన బస్సు అవశేషాలు కనిపించాయి. ఇది యుద్ధం వల్ల జరిగిన మరో సాధారణ పరిణామం కాదు. రష్యా సైన్యం చేతిలో ప్రాణాలు కోల్పోయిన మనుషులని డొనెట్స్క్ గవర్నర్ వాడిమ్ ఫిలాష్కిన్ టెలిగ్రామ్‌లో పేర్కొన్నారు.

క్రమటోర్స్క్ డొనెట్స్క్ ప్రాంతంలోని ముందువరుసకు సమీపంలో ఉంది. ఉక్రెయిన్ రక్షణ వ్యవస్థలో కీలక ప్రాంతాల్లో ఇది కూడా ఒకటి. ఇటీవల క్రమటోర్స్క్‌తో పాటు ఇతర నగరాలపై రష్యా డ్రోన్లు, గైడెడ్ బాంబులతో దాడులను తీవ్రతరం చేసినట్లు స్థానిక అధికారులు చెబుతున్నారు.

## నానాపటేకర్ కన్నుమూత

>> గోవాలోని తన నివాసంలో ఆయనకు తీవ్రమైన గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో తెల్లవారు జామున 5:20 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచినట్లు ఆసుపత్రి వర్గాలు ధ్రువీకరించాయి. ఆసుపత్రికి తీసుకొచ్చిన తర్వాత దాదాపు 45 నిమిషాల పాటు వైద్యులు ఆయనను బతికించేందుకు తీవ్రంగా ప్రయత్నించారని, అయినప్పటికీ వారి ప్రయత్నాలు ఫలించలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆయన మరణవార్తతో చిత్ర పరిశ్రమ దిగ్భ్రాంతికి గురైంది. 1978లో గమన్ చిత్రంతో బాలీవుడ్‌లో అడుగుపెట్టిన నానా పటేకర్, తన విలక్షణమైన నటన, డైలాగ్ డెలివరీతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. పరిందా, అబ్‌తక్‌ఛప్పన్, యశ్వంత్, వజూద్ వంటి చిత్రాలతో ఆయన నటనకు దేశ వ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా 2000 తర్వాత శక్తి: ది పవర్, అపహరణ్, టాక్సీ నెం 9211 వంటి సినిమాల్లో ఆయన నటన విమర్శకుల మన్నలు పొందింది. ఒకవైపు సీరియస్ పాత్రలతో అలరిస్తూనే, మరోవైపు కామెడీతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించారు. వెల్కమ్ (2007), వెల్కమ్ బ్యాక్ (2015) చిత్రాలలో ఆయన పోషించిన ఉదయ్ శెట్టి పాత్ర ఎప్పటికీ గుర్తుండిపోతుంది. రాజ్‌నీతి చిత్రంలో ఆయన నటనకు ఫిలింఫేర్ అవార్డుకు నామినేట్ అయ్యారు. తన అద్భుత నట ప్రస్థానంలో మూడు జాతీయ అవార్డులను అందుకున్నారు. 2016లో మరాఠీ చిత్రం నటసామ్రాట్‌లో ప్రదర్శించిన అసమాన నటనకు గాను ఆయన ఫిలింఫేర్ ఉత్తమ నటుడి పురస్కారాన్ని గెలుచుకున్నారు. నటుడిగానే కాకుండా యశ్వంత్, వజూద్, ఆంచ్ వంటి చిత్రాల్లో నేపథ్య గాయకుడిగా కూడా తన ప్రతిభను చాటుకున్నారు. నానా పటేకర్ మృతితో భారతీయ సినిమా ఓ గొప్ప నటుడిని కోల్పోయిందని పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. 1951 జనవరి ఒకటోతేదీ జన్మించిన పాటేకర్ అసలు పేరు విశ్వనాథ్ పాటేకర్. 2013లో కేంద్ర ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ పురాస్కరంతో సత్కరించింది. రైతుల కష్టాలను చూసి చలించిపోయిన ఆయన నామ్ ఫౌండేషన్ స్థాపించి వేలాది రైతు కుటుంబాలకు అండగా నిలిచారు. నానా పటేకర్ మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం ఆయన అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు ప్రకటించింది. పుణె సమీపంలోని ఖడక్‌వాస్లాలో ఉన్న ఆయన ఫామ్‌హౌస్‌లో అంతిమ సంస్కారాలు జరగనున్నాయి.

## వారం - వర్జ్యం

**09-10-2026, శుక్రవారం,**
**శ్రీ పరాభవ నామ సంవత్సరం,**
**భాద్రపద మాసం, దక్షిణాయణం,**
**వర్ష ఋతువు, కృష్ణపక్షం, హస్తకార్తె,**
తి. చతుర్దశి రా.9.39,
న. ఉత్తరఫల్గుణి రా.9.22,
వ.తె .5.54 -ఉ.7.32,
దు.ఉ.8.20-ఉ.9.07,2)మ.12.18- మ.1.05,
రాహు.ఉ10.30-మ.12.00,శుభ. స. లేదు.

## వార్తాఫలం

**మేషం :** చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. సంఘసేవాకార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**వృషభం :** ప్రముఖులతో కలిసి కష్టసుఖాలు పంచుకుంటారు. దూరప్రయాణాలు లాభిస్తాయి. అవకాశాలు లభిస్తాయి.

**మిథునం :** మీరంటే గిట్టని వారు మిమ్మల్ని ఇరుకున పెట్టే ప్రయత్నాలు సాగిస్తారు. అయితే ఆ ప్రయత్నాలేవీ ఫలించవు.

**కర్కాటకం :** మిత్రులతో ఏర్పడి కలహాలు తీరి ఊరట చెందుతారు. ప్రయాణాలలో తొందరపాటువద్దు. ఉల్లాసంగా గడుపుతారు.

**సింహం :** దైవ సందర్శనం చేసుకుంటారు. దీర్ఘకాలిక సమస్యలు తీరి ప్రశాంతత పొందుతారు. పాత బాకీలు వసూలవుతాయి.

**కన్య :** వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు. పనులలో జాప్యం జరిగినా చివరికి పూర్తి చేస్తారు.

**తుల :** కొత్త మిత్రులు పరిచయమై నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. విద్యార్థులు పరీక్షలలో విజయం సాధిస్తారు.

**వృశ్చికం :** భాగస్వామ్య వ్యాపారాలలో ఎదురైనా ఆటుపోట్లు కొంత వరకు తీరుతాయి. శ్రమ మీద ఫలితం వేరొకరిది.

**ధనుస్సు :** ఉద్యోగాలలో ప్రోత్సాహం లభిస్తుంది. పూర్వమిత్రులను కలిసి ఉల్లాసంగా గడుపుతారు. ఆర్థిక అభివృద్ధి సాధిస్తారు.

**మకరం :** ఋణాలు తీరి ప్రశాంతత పొందుతారు. ఊహించని ఆహ్వానాలు శుభవార్తలు అందుకుంటారు.

**కుంభం :** మహోన్నత వ్యక్తులుగా మీరు భావించిన వారి అసలు స్వరూపం తెలిసి వస్తుంది. శుభవార్తలు అందుకుంటారు.

**మీనం:** పెట్టుబడులు ప్రధాన ప్రస్తావనాంశాలవుతాయి. రహస్య ప్రయాణాలను, చర్చలను సాగిస్తారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# గాంధీ సాక్షిగా.. మహాధర్నా

>> రాజ్‌ఘాట్‌కు బయలుదేరారు. గురువారం ఢిల్లీలోని కన్నాట్‌ప్లేస్‌లో ఉన్న మోయెట్స్ రెస్టారెంట్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇండియా కూటమి నేతలకు లంచ్ ఏర్పాటు చేశారు. లంచ్ తర్వాత విపక్ష నేతలు రాజ్‌ఘాట్‌కు వెళ్లి సిఇసి జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కొనసాగించారు. ముందురోజు జరిగిన పరిణామాలను దృష్టిలో ఉంచుకుని ఢిల్లీ పోలీసులు సెంట్రల్ ఢిల్లీలో, ముఖ్యంగా ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయంలో భద్రతను పెంచారు. ఇదే కాకుండా, జ్ఞానేష్ కుమార్ ఢిల్లీ నివాసం, ఎన్నికల సంఘం కార్యాలయం, ఆయన వ్యక్తిగత భద్రత కోసం అదనపు బలగాలను మోహరించారు. రెండోరోజు నిరసనలకు సంబంధించి ఢిల్లీ పోలీసులు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పోలీసులపై దాడి చేయడం, ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించడం వంటి ఆరోపణలపై కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. పలువురు కాంగ్రెస్ నేతలు, నిరసనల్లో పాల్గొన్న కార్యకర్తల పేర్లు కూడా ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారు. ఆకాశవాణి భవన్‌లోకి అనుమతి లేకుండా ప్రవేశించారే ఆరోపణలపై రాహుల్, ప్రియాంకాలపై ఇప్పటికే కేసు నమోదైంది. శుక్రవారం మరో వ్యూహంతో ఇండియా కూటమి నేతలు ముందుకు వెళ్తున్నారు. కూటమి ఎంపీలు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ కానున్నారు. ఇప్పటికే రాష్ట్రపతితో భేటీకి వీరికి అపాయింట్మెంట్ లభించింది. ఎన్నికల సంఘంపై ఫిర్యాదు చేసేందుకు 15 మంది ఎంపీలతో కూడిన ప్రతినిధి బృందం అపాయింట్మెంట్ కోరగా, రాష్ట్రపతి భవన్ 10 మంది ఎంపీల బృందానికి అనుమతినిచ్చింది. రాష్ట్రపతిని కలిసే బృందంలోలోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ తదితరులు ఉంటారని కూటమి నేతలుప్రకటించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై ఇండియా కూటమిఆందోళనలో భాగంగా విపక్ష ఎంపీలు రాష్ట్రపతి భవన్ వైపు మార్చ్ నిర్వహించేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సమావేశం కోసం 10 మంది సభ్యులతో కూడిన ప్రతినిధి బృందాన్ని పంపాలన్న షరతుకు ప్రతిపక్ష పార్టీలు అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈసమావేశానికి సంబంధించి రాష్ట్రపతి కార్యాలయం నుంచి ఇంకా అధికారిక స్పందన రావాల్సి ఉంది. ప్రతిపాదిత ప్రతినిధి బృందం ఉన్నప్పటికీ, కూటమికి చెందిన ఎంపీలందరూ శుక్రవారం రాష్ట్రపతి భవన్ వైపు చేపట్టే నిరసన మార్చ్‌లో పాల్గొనాలని నిర్ణయించారు. ఎన్నికల సంఘం నుంచి జవాబుదారీతనం కోరుతూ, సిఇసి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి నేతలు తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తున్నారు. ఢిల్లీలో గురువారం కూడా ప్రతిపక్ష ఎంపీలు నిరసన కొనసాగించారు. జంతర్ మంతర్ వద్ద తమ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించకుండా అధికారులు అడ్డుకుంటున్నారని కూటమి నేతలు ఆరోపించారు. రాష్ట్రపతితో ప్రతిపాదిత సమావేశంలో కూటమి నేతలు తమ డిమాండ్లను ప్రధానంగా ప్రస్తావించనున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో శుక్రవారం తమ నిరసన కార్యక్రమాన్ని కూడా కొనసాగించనున్నారు. ఓటర్ల జాబితాలపై చేపట్టిన సర్ ప్రక్రియపై ఎన్నికల సంఘంపై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో సిఇసి జ్ఞానేశ్ కుమార్‌పై ప్రతిపక్షాల ఆందోళనలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే.





గురువారం హైదరాబాద్‌లో లోక్‌భవన్ ముట్టడిలో మంత్రులను అదుపులోకి తీసుకొని తరలిస్తున్న పోలీసులు

## మోడీ దిగిపోవాలి

>> పన్ను శాఖ, సీబీఐ దాడులు ఇకపై బీజేపీ ప్రభుత్వాన్ని ఏమాత్రం రక్షించలేవన్నారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెంటనే భర్తరఫ్ చేయాలని సీఎం డిమాండ్ చేశారు. అలా చేయకుంటే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన గద్దెను ఖాళీ చేయాలని, లేకపోతే ప్రజలే ఆయనను గద్దె దించుతారని సీఎం అన్నారు. ఓటు బచావో, దేశ్ బచావో ఉద్యమంలో భాగంగా విపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గె, కాంగ్రెస్ సీనియర్ నేతలు ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, ఇండియా కూటమి నేతలు గురువారం మహాత్మా గాంధీ సమాధి రాజ్‌ఘాట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. రాజ్‌ఘాట్ వద్ద నివాళుల అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు, ఓటు బచావో, దేశ్ బచావో ఉద్యమం కాంగ్రెస్ పార్టీ పోరాటం కోసమో, ఇండియా కూటమి కోసమో కాదని, దేశంలోని సామాన్యుల హక్కుల పరిరక్షణ ఉద్యమమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 2014 ఎన్నికల నాటికి దేశంలో 81 కోట్ల మంది ఓటర్లు ఉంటే, 2019 నాటికి ఆ సంఖ్య 91 కోట్లకు చేరిందని సీఎం గుర్తుచేశారు. 2024 నాటికి 97 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని సీఎం తెలిపారు. దేశ జనాభా 140 కోట్లకు చేరుకుందని, ఓటర్ల సంఖ్య మరింతగా పెరగాల్సింది పోయి ఏకంగా 13 కోట్ల ఓట్ల గల్లంతు అయ్యాయని, అవి ఎలా తగ్గిపోయాయో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు తెలియజేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్, భగత్ సింగ్ వంటి వారు ప్రాణాలకు తెగించి పోరాడారని, స్వాతంత్ర్యం తెచ్చారని సీఎం అన్నారు. సంపన్నులు, పేదలు తేడా లేకుండా డాక్టర్ అంబేడ్కర్ ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించారన్నారు. ఇప్పటి వరకు సర్ ఎన్నిసార్లు జరిగినా పేదల ఓట్లకు ముప్పు కలగలేదని సీఎం అన్నారు. ఇప్పుడు మాత్రం రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అణగారిన వర్గాల నుంచి గుంజుకునేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఈసీ జ్ఞానేష్ కుమార్ ప్రయత్నిస్తున్నారని సీఎం ఆరోపించారు. ఎన్నికల సంఘం తప్పులను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నేతలపై పోలీసులతో దాడులు చేయించడం, ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన నేతలను ఎన్నికల సంఘం కలవకపోవడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని సీఎం మండిపడ్డారు. కులం, మతం, ప్రాంతం, భాషల పేరుతో దేశ ప్రజలను విభజించి బీజేపీ అధికారంలోకి వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. దేశ ప్రజలను ఓటు ఉన్నవాళ్లు, ఓటు లేనివాళ్లుగా, రెండు వర్గాలుగా విభజిస్తున్నారని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీకి అనుకూలంగా ఉన్న వాళ్లు ఒకవైపు, వ్యతిరేకంగా ఉన్న పేదలు మరో వైపు అన్నట్లుగా మోదీ, జ్ఞానేష్ కుమార్ పరిస్థితులను మార్చారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీకి వ్యతిరేకంగా తీర్పునిచ్చే దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, మైనారిటీ ఓట్లను లక్ష్యంగా చేసుకొని వాటిని తొలగిస్తున్నారని సీఎం ఆరోపించారు.

## బియ్యమో! రామచంద్రా!

>> వరకు పెరిగాయి. ఇరువైఐదు కిలో జేఎస్ఆర్ ప్రీమియంకోలం రూ.83.50, జేఎస్ఆర్ రా రైస్ రూ.74.85, లలిత సోనామసూరి రూ.71.33, కర్నూలు సోనామసూరి రూ.70, హెచ్ఎంటీ రారైస్ రూ.69గా ఉంది. కిరాణా దుకాణాల్లో హెచ్ఎంటీ రారైస్ రూ.78 చొప్పున విక్రయిస్తున్నారు. పక్షం రోజుల క్రితం ఈ ధర రూ. 70 ఉండేది ఇంకా వీటి ధరలు పెరిగే అవకాశం ఉంది. కొంత మంది వినియోగదారులు బియ్యం ధర పెట్రోల్ ధరవలే వందకు పైగా పెరుగుతుందా అని భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. భారత ఆహార సంస్థ సన్నరకం ధాన్యం గ్రేడ్ ఏ గుర్తించడానికి నిరాకరించడంతో తెలంగాణ పౌరసరఫరాలశాఖ క్వింటాల్‌కు రూ.520 నష్టం జరుగుతున్నా కామన్ వెరైటీగా ప్రకటించింది. తెలంగాణ ప్రభుత్వం సన్నాలను కామన్ వెరైటీగా గతంలో చేసిన ప్రకటనను విరమించుకొని ఎఫ్‌సిఐకి కస్టమ్ మిల్లింగ్ కింద బియ్యం ఇవ్వకుండా మార్కెట్‌లో విడుదల చేస్తే పెరుగుతున్న బియ్యం ధరలను నియంత్రించడానికి వీలవుతోంది. వైట్‌రేషన్ కార్డులేని మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి ఉన్నత వర్గాల వారికి కిలోకు 41రూపాయల చొప్పున సన్నాలను మరాడించి విక్రయించడానికి విధాన పరమైన నిర్ణయం తీసుకొంటే కరువుకాలంలో ఇది ఎంతగానో ఉపయోగపడమే కాకుండా ప్రభుత్వం లాభనష్టరహితంగా విక్రయించడానికి వీలవుతోంది. ఖరీఫ్2025-26 సంవత్సరం 38లక్షల మెట్రిక్ టన్నుల సన్నధాన్యం రైతుల నుంచి తెలంగాణ ప్రభుత్వరంగ సంస్థ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ కొనుగోలు చేసింది. ఇందులో 24లక్షల మెట్రిక్ టన్నులు చౌకధరల దుకాణాల ద్వారా రేషన్‌కార్డు లబ్దిదారులకు పంపిణీ చేయడానికి సరిపోతాయి. మిగితా 14లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంకు చెందిన బియ్యంను కస్టమ్ మిల్డ్ రైస్ గా ఎఫ్‌సిఐకి అప్పగించాలని తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నించినప్పటికి ఎఫ్‌సిఐ మాత్రం సన్నాలు గ్రేడ్ ఏ పొడవు వెడల్పు నిష్పత్తిగా లేవని వాటిని కామన్ రకంగానే చూస్తామని తీసుకోవడానికి తిరస్కరించింది. బియ్యం పొడవు 6.1ఎం.ఎం.వెడల్పు 2.0నుంచి 2.5 ఎం.ఎం ఉన్న వాటిని మాత్రమే గ్రేడ్ ఎగా గుర్తిస్తామని ఖరాఖండిగా తేల్చి చెప్పింది. దీనితో బిపిటి, సాంబామసురి, జెజిఎల్ వంటి సన్నాలను కామన్ రకంగా ప్రకటన చేస్తూ ఆగస్టు 24 మెమో నెంబర్ 2261/సిఎస్ఐ-సిసిఎస్/2026 పేరుతో ఉత్తర్వులు జారీచేశారు.

మెదక్, కరీంనగర్, మంచిర్యాల జిల్లాల కలెక్టర్లు 2025-26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన గ్రేడ్ ఎ ధాన్యాన్ని కామన్ కేటగిరీగా మార్చాలని అభ్యర్థించారు. రైస్ మిల్లర్లు గ్రేడ్ ఎ మరియు కామన్ కేటగిరీల మధ్య ఉన్న వ్యత్యాస ధరను చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నారు. నిజామాబాద్ జిల్లా కలెక్టర్ తెలిపిన ప్రకారం, రైస్ మిల్లర్లు 2025-26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన గ్రేడ్ ఎ సన్నరకం ధాన్యాన్ని కామన్ వెరైటీగా మార్చేందుకు అంగీకరించారు. ప్రభుత్వం నిర్ణయించిన వ్యత్యాస మొత్తాన్ని చెల్లించడానికి కూడా సిద్ధంగా ఉన్నారు. తద్వారా సిఎంఆర్ కార్యకలాపాలు సజావుగా కొనసాగేందుకు అవకాశం ఉంటుంది. సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.520/ అదనపు ప్రయోజనం (రూ.500/ బోనస్ ప్రోత్సాహకం + రూ.20/ గ్రేడ్ వ్యత్యాసం) రూ. 728కోట్ల కొనుగోలు నష్టం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందనీ మెమోలో పేర్కొంది ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, తెలంగాణ స్టేట్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ లిమిటెడ్ అదనంగా ఉన్న సన్నబియ్యాన్ని ఎఫ్‌సిఐ రా బాయిల్డ్ రూపంలో లేదా బాయిల్డ్ రూపంలో అందజేయడానికి అనుమతించబడింది. ఎఫ్‌సిఐ గ్రేడ్ఎ కేటగిరీకి చెందిన బాయిల్డ్ సన్నబియ్యాన్ని స్వీకరించదు కాబట్టి, మిల్లర్లు దానిని కామన్ కేటగిరీ కింద ఎఫ్‌సిఐ అందజేయాలనే గత నిర్ణయంపై పునరాలోచన చేసి ఆ బియ్యంను మధ్య, ఎగువమధ్య, ఉన్నతవర్గాలకు కిలోకు 41రూపాయల చొప్పున విక్రయించాలని సామాన్యులు కోరుకొంటున్నారు. ఎఫ్‌సిఐకి 3300కు క్వింటాల్ బియ్యం విక్రయించే కంటే తెలంగాణమార్కెట్‌లో విడుదల చేయడం ప్రభుత్వంకు ప్రజలకు లాభకరంగా ఉంటుంది.

## ఛలో లోక్‌భవన్ ఉద్రిక్తం

>> శ్రీనివాస్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వాకిటి శ్రీహరి, మహమ్మద్ అజారుద్దీన్, ఎమ్మెల్యేలు నవీన్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ విజయారెడ్డి తదితరులను పోలీసులు అరెస్టు చేసి పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులను కూడా అరెస్టు చేసి బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నేతలు, మంత్రులు నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పినట్లు ఎన్నికల వ్యవస్థ వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా వ్యవహరించాల్సి ఉండగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేస్తోందని విమర్శించారు. కోట్లాది ఓట్లను తొలగించి బీజేపీకి లబ్ధి చేకూర్చే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఓట్ల తొలగింపు రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతమని, జ్ఞానేశ్వర్ కుమార్‌ను పదవి నుంచి తొలగించే వరకు కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఓటర్ల హక్కులను హరిస్తున్న బీజేపీ కుట్రలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు, అర్హులైన ఓటర్ల తొలగింపుపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోందన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, గిరిజనులు, మైనారిటీలు, బలహీన వర్గాల ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. రాహుల్‌గాంధీ నాయకత్వంలో ఇండియా కూటమి ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడుతోందని పొన్నం ప్రభాకర్ అన్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీతో పాటు ఇండియా కూటమి ఎంపీల అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని, దాని స్వతంత్రతను కాపాడాలని డిమాండ్ చేశారు. ఓటు బచావో.. దేశ్ బచావో నినాదంతో ప్రజల్లోకి వెళ్తామని, ఓటును కాపాడుకుని రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు తెలంగాణ ప్రజలు ఉద్యమంలో భాగస్వాములు కావాలని మంత్రులు పిలుపునిచ్చారు.

## ట్రంప్ సర్కార్ భారీ షాక్

>> శాఖ సస్పెండ్ చేసింది. ఈ కంపెనీలు నిబంధనలను దుర్వినియోగం చేశాయన్న ఆరోపణల నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నట్లు కథనాలు వస్తున్నాయి. ఈ జాబితాలో కాగ్నిజెంట్, క్యాప్‌జెమినీతో పాటు మైక్రోసాఫ్ట్, అడోబ్ సంస్థలు కూడా ఉన్నట్లు అమెరికా కార్మిక శాఖ వెల్లడించింది. పలు ఫెడరల్ దర్యాప్తులు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అమెరికా కార్మిక శాఖ కార్యదర్శి కీత్ సోండర్లింగ్ తెలిపారు. ఈ చర్యలపై సంబంధిత కంపెనీల నుంచి పూర్తి వివరణలు ఇంకా వెలువడలేదు. అమెరికాలో విదేశీ ఉద్యోగులకు గ్రీన్ కార్డ్ స్పాన్సర్ చేయాలనుకునే యజమానులకు పర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్‌ప్రోగ్రామ్ పెర్మ్ కీలకమైన ప్రక్రియ. ఒక ఉద్యోగానికి అర్హులైన అమెరికా కార్మికులు అందుబాటులో లేరని నిర్దిష్ట నిబంధనల ప్రకారం నిర్ధారించిన తర్వాత, విదేశీ ఉద్యోగి కోసం శాశ్వత కార్మిక ధ్రువీకరణ పొందేందుకు ఇది ఉపయోగపడుతుంది. ఈ ప్రక్రియను కంపెనీలు దుర్వినియోగం చేస్తున్నాయన్న ఆరోపణలపై అమెరికా కార్మిక శాఖ దృష్టి సారించింది. విదేశీ ఉద్యోగులను నియమించుకునే సమయంలో అమెరికా కార్మికుల అవకాశాలు, వేతనాలపై ప్రభావం పడకుండా చూడాలన్నది తమ చర్యల ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు. మైక్రోసాఫ్ట్‌పై అమెరికా కార్మిక శాఖ కార్యదర్శి కీత్ సోండర్లింగ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అమెరికాలో ఈ వ్యవస్థను దుర్వినియోగం చేసిన సంస్థల్లో మైక్రోసాఫ్ట్‌ను మించిన కంపెనీ లేదని ఆరోపించారు. అయితే ఇవి అధికారుల ఆరోపణలు మాత్రమే. దర్యాప్తుల తుది ఫలితాలు, సంబంధిత సంస్థల వివరణలు వెలువడిన తర్వాతే ఈ ఆరోపణలపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా మైక్రోసాఫ్ట్ వ్యవహారాన్ని ప్రస్తావించారు. 2025లో ఆ సంస్థ సుమారు 6,000 మంది అమెరికా ఉద్యోగులను తొలగించిందని, అదే సమయంలో అర్హులైన అమెరికా ఉద్యోగులు అందుబాటులో లేరని ధ్రువీకరించి 6,000కు పైగా హెచ్1బి వీసాలకు ఆమోదం పొందిందని పేర్కొన్నారు. అంతేకాకుండా అమెరికా ఉద్యోగులను తొలగించిన కొన్ని ఉద్యోగాలకే సంబంధించి దాదాపు 1,000 పెర్మ్ దరఖాస్తులు దాఖలయ్యాయని వాన్స్ ఆరోపించారు. హెచ్1బివీసా విధానం ఉద్దేశం అమెరికాలో అందుబాటులో లేని ప్రత్యేక నైపుణ్యాలు కలిగిన విదేశీ నిపుణులను నియమించుకునేందుకు కంపెనీలకు అవకాశం కల్పించడమేనని చెప్పారు. అయితే ఈ విధానంలో అక్రమాలు పెరిగిపోయాయని విమర్శించారు.



ఒడిశాలోని పరదీప్ తీరంలో గురువారం ఇండియన్ కోస్ట్ గార్డ్ నిర్వహించిన సముద్ర శోధన, రక్షణ విన్యాసం దృశ్యం

# నకిలీ వైమానికదళ అధికారి అరెస్ట్

## ఇన్‌స్టాగ్రామ్‌లో యువతులకు వల

**హైదరాబాద్ (బేగంపేట), అక్టోబరు 8,ప్రభాతవార్త:** భారత వైమానిక దళ (ఎయిర్‌ఫోర్స్) అధికారి వేష ధారణలో మిలటరీ ఏరియాలో చక్కర్లు కొడు తూ ఫొటోలు దిగుతున్న ఓ యువకుడిని అధికా రులు గుర్తించి పోలీసు లకు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. బీహార్‌కు చెందిన నితేశ్ కుమార్ పాల్ (22) నేరేడ్‌మెట్ ఆర్కేపురం బ్రిడ్జి సమీపంలో ఉంటూ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. బుధవా రం మధ్యాహ్నం బేగంపేట్ పరేడ్ గ్రౌండ్స్‌లోని వీఎస్ఎస్ గ్రౌండ్ వద్ద ఫ్లయింగ్ లెఫ్టినెంట్ ర్యాంకు యూనిఫాం ధరించి అనుమా నాస్పదంగా తిరుగుతూ ఫొటోలు దిగుతున్న అతడిని మిలటరీ సిబ్బంది గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతడు ఎయిర్‌ఫోర్స్ అధికారి కాదని, నకిలీ గుర్తింపుతో తిరుగుతున్నాడని తేలడంతో బేగంపేట పోలీసులకు అప్పగించారు. తాను ఎయిర్‌ఫోర్స్ అధికారినంటూ సోషల్ మీడియా వేదికగా యువతులకు వల వేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టులు పెట్టి యువతులను బురిడీ కొట్టించేందుకే పరేడ్ గ్రౌండ్‌లో ఫొటోలు దిగేందుకు వచ్చినట్లు గుర్తించారు. నిందితుడిపై కేసు నమోదు చేసిన పోలీసులు అతడు ఎప్పటి నుంచి ఈ తరహా మోసాలకు పాల్పడుతున్నాడు, ఎవరెవరిని మోసం చేశాడు అనే కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు.



నకిలీ వైమానికదళ అధికారి నితేశ్‌కుమార్‌పాల్

# ఎరుపెక్కుతున్న ప్రపంచం!




## మరింత బలపడిన ఎల్‌నినో

## వాతావరణంపై తీవ్రప్రభావం

## 2027 ఫిబ్రవరి వరకు కొనసాగే అవకాశం

## డబ్ల్యుఎంఒ నిపుణుల హెచ్చరిక

**న్యూఢిల్లీ, అక్టోబరు 8:** ప్రపంచాన్ని 'ఎల్ నిన్లో' వణికిస్తోంది. ప్రపంచ వాతా వరణంపై ఎల్ నినో తన పంజా విసిరేందుకు సిద్ధమైందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ యేడాది ఏర్పడిన ఎల్ నినో 1950 తర్వాత నమోదైన అత్యంత బలమైన వాతావరణ దృగ్విషయంగా మారే అవకాశం ఉందని ఐక్యరాజ్యసమితి వాతావరణ సంస్థ 'ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యుఎంఒ) హెచ్చరించింది. మానవ నిర్మిత వాతావరణ మార్పుల ప్రభావాలను ఎల్ నినో మరింత తీవ్రతరం చేస్తుందని తెలిపింది. పసిఫిక్ మహాసముద్రం తనలో నిక్షిప్తమైన భారీ మొత్తంలో వేడిని విడుదల చేయడంతో, భూగోళంలోని చాలా పెద్ద ప్రాంతం అసాధారణంగా వేడి పరిస్థితులను ఎదుర్కొంటుందని నిపుణులు చెబుతున్నారు. ఉష్ణమండల పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడుతున్న ఎల్ నినో సరళిని వర్ణించడానికి విశేషణాలకు కొదవే లేదు. దీని వలన ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో తీవ్రమైన పరిణామాలు సంభవించవచ్చని అంచనా వేస్తున్నారు. ఇప్పటివరకు, అందుబాటులో ఉన్న సమాచారం ఈ అంచనాలను బలపరుస్తూనే ఉంది. ఈ శరదృతువులో ఉష్ణమండల పసిఫిక్‌లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి పెరిగాయి. ఇది ఈ సరళి మరింత బలపడుతోందనడానికి సంకేతం. ఎల్ నినో ప్రభావంతో ప్రపంచ వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో సాధారణం కన్నా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవ కాశ ఉంది. డబ్ల్యుఎంఒ అంచ నా ప్రకారం అక్టోబరు - డిసెంబరు మధ్య కాలంలో ఎల్ నినోకు కేంద్రంగా ఉన్న మధ్య, తూర్పు ఉష్ణ మండల పసిఫిక్ ప్రాంతం లోని సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా సుమారు 3.7 డిగ్రీల వరకు అధికంగా ఉండే అవకాశం ఉంది. వాతావరణ శాస్త్రవేత్త ర్యాన్ మావ్ మొత్తం గ్రహం యొక్క వాతావరణ పటాన్ని పోస్ట్ చేస్తూ, భూమి దాదాపు పూర్తిగా ఎరుపు రంగులో ఉందని పేర్కొన్నారు. "అమెరికా మినహా మిగతా అన్ని చోట్లా భూగోళం వేడెక్కడంతో, ఎల్ నినో శీతాకాలంలోకి కూడా 'గరిష్ట శక్తి'తో కొనసాగుతోంది" అని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. ఎల్ నినో 2027 ఫిబ్రవరి వరకు కొనసాగుతుందన్న డబ్ల్యుఎంఒ అంచనాతో ఆయన ఏకీభవించారు. మరో వాతావరణ శాస్త్రవేత్త జీక్ హౌస్‌ఫాదర్ ట్వీట్ చేస్తూ, "ఈ యేడాది ఎల్ నినో అపరిచిత జలాల్లోకి తన ఆరోహణను కొనసాగిస్తోంది. ఎల్ నినో3.4 ప్రాంతంలోని అసాధారణతలు ఇప్పుడు సాధారణం కంటే 3.4 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా ఉన్నాయి. ఇది రికార్డుల్లో నమోదైన మునుపెన్నడూ లేని ఎల్ నినో సంఘటన కంటే ఎక్కువ. "వాతావరణ నిపుణుడు లియోన్ సైమన్స్ ఈ వాతావరణ దృగ్విషయాన్ని "సూపర్‌డూపర్ ఎల్ నినో" అని అభివర్ణించారు. 2026 చివరి నెలల్లో ప్రపంచంలోని చాలా ప్రాంతాలలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఎక్కువగా ఉందని ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యుఎంఒ) తన అంచనాలో పేర్కొంది. ఎల్ నినో దృగ్విషయానికి కేంద్ర బిందువైన మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్ ప్రాంతంలో, అక్టోబరు నుండి డిసెంబరు వరకు సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రికార్డు స్థాయిలో 3.7 డిగ్రీల సెల్సియస్ (6.7 డిగ్రీల ఫారెన్‌హీట్) అధికంగా నమోదయ్యే అవకాశం ఉందని కూడా తెలిపింది. ఎల్ నినో అనేది సహజంగా సంభవించే ఎల్ నినోసదరన్ ఆసిలేషన్ చక్రంలోని వెచ్చని దశ. ఇది ప్రపంచవ్యాప్తంగా వాతావరణాన్ని ప్రభావితం చేసే ఒక వాతావరణ నమూనా. ఇది సాధారణంగా ప్రతి రెండు నుండి ఏడు సంవత్సరాలకు ఒకసారి సంభవిస్తుంది. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరిగి, పెద్ద ప్రాంతాలలో వర్షపాత సరళికి అంతరాయం కలుగుతుంది. అంటే కొన్ని ప్రాంతాలలో కరువు, మరికొన్ని ప్రాంతాలలో భారీ వర్షాలు కురుస్తాయి. యూనివర్సిటీ ఆఫ్ చికాగోకు చెందిన 'క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్' పరిశోధకులు గత నెలలో ఒక అంచనాను వెలువరించారు. దీని ప్రకారం, ఈ యేడాది సంభవించే "సూపర్ ఎల్ నిన్లో" కారణంగా జూన్ నుండి ఫిబ్రవరి 2027 వరకు ప్రపంచవ్యాప్తంగా 4,51,000 వరకు అదనపు మరణాలు సంభవించే అవకాశం ఉంది.

# రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.8,157.49 కోట్లు

## గతం కంటే 21.75 శాతం వృద్ధి

**హైదరాబాద్, అక్టోబరు 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఖజానాకు వివిధ శాఖల ద్వారా క్రమేపీ ఆదాయం పెరుగుతోంది. ఇందులో భాగంగా స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో గణనీయమైన వృద్ధి సాధించింది. ఈ 2026-27 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు నమోదైన లావాదేవీలు, ఆదాయాన్ని గత ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 21.75 శాతం అదనంగా పెరిగింది. ఆర్థిక శాఖ వర్గాల వివరాలు ప్రకారం ఆదాయ పరంగా చూస్తే గత ఆర్థిక సంవత్సరంలో మొదటి ఆరు నెలల వ్యవధిలో రూ.6,699.96 కోట్లు కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో రూ.8,157.49 కోట్ల ఆదాయానికి పెరుగుదల నమోదైంది. గత సంవత్సరంతో పోల్చితే రూ.1,457.53 కోట్ల మేర అదనపు ఆదాయం సమకూరింది. ఇందులో ప్రధానంగా వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్ల ద్వారా గత ఏడాది రూ.5,878.81 కోట్ల ఆదాయం రాగా, ఈ ఏడాది అది రూ.7,047 కోట్లకు పెరిగింది. ఈ లెక్కన సుమారు రూ.1,168.84 కోట్లు అదనపు ఆదాయం లభించింది. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల ద్వారా గత సంవత్సరం ఇదే కాలానికి రూ.821.15 కోట్లు వస్తే ఈ ఏడాది రూ.1,138.66 కోట్లు రావడం విశేషం. ఏప్రిల్‌లో రూ.1,242.90 కోట్లు, మేలో రూ.1,521.11 కోట్లు, జూన్‌లో రూ.1,211.60 కోట్లు, జూలైలో రూ.1,414.81 కోట్లు, అగస్టులో రూ.1,261.70 కోట్లు, సెప్టెంబరు నెలలో రూ. 1,288.46 కోట్లు మేర రిజిస్ట్రేషన్లు, స్టాంపుల ద్వారా రాష్ట్ర ఖజానాకు ఆదాయం సమకూరింది. అదే విధంగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబరు మధ్య 9,33,471 దస్తావేజులు రిజిస్ట్రేషన్ కాగా, ప్రస్తుత 2026-27లో ఇదే ఆరు నెలల వ్యవధిలో 9,49,496 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి. గత ఏడాదితో పోల్చితే అదనంగా 16,025 లావాదేవీలు పెరిగాయి.



గురువారం సచివాలయంలో బతుకమ్మ పోస్టర్‌ను ఆవిష్కరించిన ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి సంజయ్‌జాజు

# టిజిఒ మహిళా విభాగం బతుకమ్మ పోస్టర్‌ను ఆవిష్కరించిన సిఎస్ సంజయ్‌జాజు

**హైదరాబాద్, అక్టోబరు 8, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్ర దాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించేందుకు తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టిజిఒ) మహిళా విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా టీజీఓ మహిళా విభాగం రూపొందించిన బతుకమ్మ పోస్టర్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సంజయ్ జాజు గురువారం సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చిందని పేర్కొన్నారు. తెలంగాణ ఆడపడుచుల సాంస్కృతిక ఐక్యతకు, ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి బతుకమ్మ ఒక గొప్ప ప్రతీక అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాలతో, సాంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఉద్యోగినులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. టీజీఓ. మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు మరియు వారి కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు. మహిళా ఉద్యోగులలో సాంస్కృతిక చైతన్యం, ఐక్యత, సోదరభావం పెంపొం దించడంతోపాటు తెలంగాణ సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల జీవన విధానంలో అంతర్భాగమని, పూలతో బతుక మ్మను పేర్చి, ప్రకృతిని ఆరాధిస్తూ, సమిష్టిగా పాటలు పాడుతూ నిర్వహించే ఈ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చిందని టీజీఓ మహిళా విభాగం నాయకులు పేర్కొన్నారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో టీజీఓ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏలూరి శ్రీనివాస్ రావు, జనరల్ సెక్రటరీ బి. శ్యామ్, మహిళా విభాగం విమెన్ చైర్పర్సన్ డా జి దీపారెడ్డి, కన్వీనర్ జే సుజాత వివిధ శాఖలకు చెందిన మహిళా గెజిటెడ్ అధికారులు, ఉద్యోగినులు తదితరులు పాల్గొన్నారు.

# టిటిడి ట్రస్ట్‌లకు రూ.20 లక్షలు విరాళం



**తిరుమల, అక్టోబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ధార్మికసంస్థ టిటిడి నిర్వహిస్తున్న పలు పథకాలు, ట్రస్ట్‌లకు దాతలు తమవంతుగా విరాళాలందిస్తున్నారు. గురువారం ఉదయం తెలంగాణ హైదరాబాద్‌కు చెందిన కొడాలి మారుతి శేషతల్ప సాయి టిటిడి బర్డ్ ట్రస్టుకు రూ.10,00,116లు విరాళంగా అందించారు. అలాగే అమెరికాకు చెందిన ఎన్ఆర్ఐ నల్లపాటి గిరిధర్ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.10,00,116లు విరాళమిచ్చారు. దాతలు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టిటిడి అదనపు ఇఒ సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డిడిలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు నన్నపనేని సదాశివరావు, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఇఒ భాస్కర్ పాల్గొన్నారు.

# భారత్ వాయుసేన వీర యోధులకు సిఎం రేవంత్ శుభాకాంక్షలు

**హైదరాబాద్,అక్టోబరు8,ప్రభాతవార్త:** ఆకాశమే హద్దుగా దేశ రక్షణ కోసం అహర్నిశలు విధులు నిర్వర్తిస్తున్న భారత వాయుసేన వీర యోధులకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దేశ సేవలో అంకితభావంతో వైమానిక దళం ప్రదర్శిస్తున్న ధైర్యసాహసాలు ప్రతి పౌరుడినీ గర్వపడేలా చేస్తున్నాయని పేర్కొన్నారు.దేశం కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన అమరవీరుల సేవలను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. వారి ధైర్యం, దేశభక్తి, త్యాగస్ఫూర్తి మనందరికీ ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని, వారి త్యాగాలు దేశ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు.

# తెలంగాణలో డెయిరీ రంగానికి బిగ్ బూస్ట్

## దేశంలో 75 వేల కొత్త పాడి సహకార సంఘాలు

## రాష్ట్రంలో 1,525 సంఘాలకు గ్రీన్‌సిగ్నల్

## శ్వేత విప్లవంలో భాగంగా కేంద్రం కీలక నిర్ణయం

**హైదరాబాద్, అక్టోబరు 8, ప్రభాతవార్త:**తెలంగాణలో డెయిరీ రంగానికి బిగ్ బూస్ట్ రానుంది. శ్వేత విప్లవం ద్వారా పాడి పరిశ్రమను అభివృద్ధి చేయ డానికి, మహిళా సాధికారతను పెంచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుం టున్నారు. రాష్ట్రంలో డెయిరీ రంగాన్ని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో పాడి సంఘాలను విస్తరింపచేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్రంలో కొత్తగా పాడి సహకార సంఘాలను ఏర్పాటు చేయ నుంది. శ్వేత విప్లవంలో భాగంగా దేశవ్యాప్తంగా 2029 నాటికి కొత్తగా 75 వేల పాడి సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని కేంద్రం వీక నిర్ణ యం తీసుకుంది. ఇందులో భాగంగా రాష్ట్రానికి 1,525 కొత్త పాడి సహకార సంఘాలను కేటా యించింది. సహకార రంగం బలోపేతం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతులకు మరిన్ని అవకాశాలు కల్పించడంతో పాటు, పాట ఉత్పత్తి, సేకరణ, ప్రాసెసింగ్ వ్యవస్థలను విస్తరించేందుకు పలు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నేషనల్ కోపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌సిడిసి) ద్వారా తెలంగాణకు గత 12 ఏళ్లలో మొత్తం 1.16 లక్షల కోట్లను మంజూరు చేయగా, ఈ నిధులతో రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి ఖర్చు చేసినట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు వెల్లడించారు. మరోపక్క రాష్ట్రంలోని మెదక్ జిల్లా తూప్రాన్‌లోని ఊర్జా ఇండస్ట్రియల్ పార్కులో రూ.400 కోట్ల వ్యయంతో సబార్ డెయిరీ (అమూల్) మెగా ఇంటిగ్రేటెడ్ డెయిరీ ప్లాంట్‌కు ఇటీవలే శంకుస్థాపన చేశారు. ఈ ప్లాంట్ ద్వారా రోజుకు 5 లక్షల లీటర్ల పాలను ప్రాసెస్ చేయనున్నారు. దీని ద్వారా నేరుగా, పరోక్షంగా 10 వేల మందికి పైగా పాడి రైతులకు, స్థానిక యువతకు మరియు మహిళలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా. మహిళా సంఘాల సభ్యులు పాడి పరిశ్రమలో భాగస్వా ములు కావడం ద్వారా ఆర్థికంగా బలపడేందుకు బ్యాంకుల ద్వారా రూ.20 లక్షల వరకు రుణాలు అందించేలా ప్రోత్సహిస్తున్నట్లు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ అధికారులు వెల్లడించారు.

# ట్రంప్ బంగారు విగ్రహం!

## యూరోపియన్ పార్లమెంటులో ఏర్పాటు



**స్ట్రాస్‌బర్గ్, అక్టోబరు 8:** ఫ్రాన్స్‌లోని స్ట్రాస్‌బర్గ్‌లో ఉన్న యూరోపియన్ పార్లమెంట్ భవనంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నగ్న విగ్రహం ఏర్పాటు కావడం చర్చనీయాంశంగా మారింది. ది ఆరెంజ్ ఫ్లేగ్ అనే పేరుతో ఏర్పాటు చేసిన ఈ విగ్రహాన్ని చూసేందుకు సందర్శకులు ఆసక్తి చూపుతున్నారు. పూర్తిగా బంగారు పూతతో మెరిసిపోతున్న ఈ శిల్పం, ట్రంప్‌పై ఒక వ్యంగ్యాస్త్రంగా నిలుస్తోంది. డెన్మార్క్‌కు చెందిన ప్రముఖ శిల్పి జెన్స్ గాల్‌షియోట్ ఈ విగ్రహాన్ని రూపొందించారు. సుమారు 8.5 అడుగుల (2.6 మీటర్లు) ఎత్తు ఉన్న ఈ రాగి శిల్పానికి 23 క్యారెట్ల బంగారు పూత పూశారు. ఈ విగ్రహంలో ట్రంప్ నగ్నంగా, బలహీనంగా ఉన్న ఒక వ్యక్తి భుజాలపై కూర్చుని ఉంటారు. ఆయన ఒక చేతిలో గోల్ఫ్ క్లబ్, మరో చేతిలో న్యాయదేవత పట్టుకునే త్రాసును పట్టుకుని కనిపిస్తారు. ఈ శిల్పాన్ని కింగ్ ఆఫ్ ఇన్‌జస్టిస్ (అన్యాయానికి రాజు) అని కూడా పిలుస్తున్నారు. ఈ విగ్రహం పీఠంపై ఒక ఆసక్తికరమైన సందేశం రాసి ఉంది. నేను ఒక వ్యక్తి వీపుపై కూర్చున్నాను. నా బరువుతో అతను కుంగిపోతున్నాడు. అతనికి సహాయం చేయడానికి నేను ఏదైనా చేస్తాను. కానీ అతని వీపు పైనుంచి దిగడం తప్ప అనే వాక్యాలు ఈ శిల్పం ఉద్దేశాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఇది ఒక రాజకీయ వ్యంగ్యాస్త్రమని శిల్పి గాల్‌షియోట్ వివరించారు. డానిష్ ఎంఈపీ పెర్ క్లాసెన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఒక చిన్న ప్రదర్శనలో ఈ విగ్రహాన్ని ప్రధాన ఆకర్షణగా నిలిపారు. పార్లమెంట్‌లోని విన్‌స్టన్ చర్చిల్ భవనంలో ఈ ప్రదర్శన జరుగుతోంది. సందర్శకుల కోసం ఈ విగ్రహం చిన్న ప్రతిరూపాలను కూడా పంపిణీ చేశారు. కొన్ని రోజుల ప్రదర్శన తర్వాత ఈ శిల్పాన్ని ఇక్కడి నుంచి తొలగించనున్నారు. శిల్పి గాల్‌షియోట్ గతంలో కూడా పలు అంతర్జాతీయ వేదికలపై ఇలాంటి వివాదాస్పద కళాఖండాలను ప్రదర్శనకు ఉంచారు.

# జూ.ఎన్టీఆర్ అభిమానులపై సిపి సజ్జనార్ ఆగ్రహం!

## సోషల్ మీడియాలో వైరల్ అయిన ఫొటో ఎఐ సృష్టించిన ఫేక్ అని స్పష్టీకరణ

## నిజానిజాలు తెలుసుకోకుండా కంటెంట్‌ను ఫార్వర్డ్ చేయవద్దని నెటిజన్లకు విజ్ఞప్తి

## చట్టపరంగా కఠినచర్యలు తప్పవని హెచ్చరిక

**హైదరాబాద్, అక్టోబరు 8, ప్రభాత వార్త:** జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల తీరుపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తన ఫొటోను మార్ఫింగ్ చేసి, ఒక ఫేక్ చిత్రాన్ని సోషల్ మీడియాలో ప్రచారం చేయడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ విషయాన్ని నేరుగా నటుడు జూనియర్ ఎన్టీఆర్ దృష్టికి తీసుకెళ్తూ ఆయన అధికారిక 'ఎక్స్' ఖాతాను ట్యాగ్ చేయడం గమనార్హం. ఇటీవల 'చుట్టమల్లే' పాట వివాదానికి సంబంధించి ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు 'సౌత్ డిజిటల్ మీడియా' అనే ఎక్స్ ఖాతాలో ఒక పోస్ట్ ప్రత్యక్షమైంది. దీనికి జత చేసిన ఫొటోలో, ఒక వ్యక్తికి ముసుగు వేసి ఉండగా, ఆయన పక్కన పోలీసులు, కొందరు ఎన్టీఆర్ అభిమానులు ఉన్నట్లు కనిపించింది. ఈ ఫొటోలో కమిషనర్ సజ్జనార్ చిత్రం కూడా ఉంది. ఇది కొద్దిసేపట్లోనే వైరల్ కావడంతో సజ్జనార్ స్పందించారు. వైరల్ అవుతున్న ఆ ఫొటో నిజమైనది కాదని, అది పూర్తిగా ఏఐతో సృష్టించిన డీప్‌ఫేక్ చిత్రమని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి ఫేక్ కంటెంట్‌ను చూసి మోసపోవద్దని, వాస్తవాలను నిర్ధారించుకోకుండా ఫార్వర్డ్ చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆన్‌లైన్‌లో కనిపించే ప్రతీదాన్ని గుడ్డిగా నమ్మవద్దని సూచించారు. ఈ ఫేక్ ఫొటోను కొందరు ఎన్టీఆర్ అభిమానులే ప్రచారంలోకి తెచ్చినట్లు గుర్తించిన సజ్జనార్.. "మీ అభిమానుల్లో కొందరు నా ఫొటోను ఈ విధంగా దుర్వినియోగం చేస్తున్న అంశాన్ని దయచేసి గమనించండి" అంటూ జూనియర్ ఎన్టీఆర్‌ను ట్యాగ్ చేస్తూ కోరారు. సైబర్ నేరాలు, డీప్‌ఫేక్‌లపై నిరంతరం ప్రజలను అప్రమత్తం చేసే సజ్జనార్ స్వయంగా ఇలాంటి ఫేక్ ప్రచారానికి గురికావడం సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. ఏఐని ఆయుధంగా వాడుతూ తప్పుడు ప్రచారం చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ హెచ్చరించారు.



## రోజుకు 3 లక్షల మంది భక్తులకు

# అన్నప్రసాదం

### ● 15.8 టన్నుల బియ్యంతో నిత్యం మహాయజ్ఞంలా కొనసాగుతున్న అన్నప్రసాద సేవ

**తిరుమల, అక్టోబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో ఆకలితో ఉన్న భక్తుడికి అన్నం అందించడమే లక్ష్యంగా టిటిడి అన్నప్రసాదం విభాగం 24గంటలూ నిరంతరంగా పనిచేస్తోంది. సాధారణ రోజుల్లో సుమారు 1.80 లక్షల నుండి 1.90 లక్షల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరిస్తుండగా, రద్దీ రోజులు, వారాంతాల్లో ఈ సంఖ్య 3 లక్షలకు మించుతోంది. పానీయాలు, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం కలిపి రోజుకు దాదాపు 3 లక్షల సర్వింగ్స్ భక్తులకు అందుతున్నాయి. రోజుకు 15.8 టన్నుల బియ్యం వినియోగం. లక్షలాది మంది భక్తులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు టిటిడి ప్రతిరోజూ భారీ స్థాయిలో ముడి పదార్థాలను వినియోగిస్తోంది. రోజుకు సుమారు 15,788 కిలోల బియ్యం, 3,110 కిలోల సన్‌ఫ్లవర్ ఆయిల్, 2,861 కిలోల కందిపప్పు, 2,832 కిలోల సుజీ రవ్వ, 2,825 కిలోల గోధుమ రవ్వ, 1,729 కిలోల మినపప్పు, 1,436 కిలోల ఉప్పు, 1,276 కిలోల బెల్లం, 497 కిలోల చింతపండు వినియోగిస్తున్నారు. అదేవిధంగా రోజుకు సుమారు 4,375 కొబ్బరికాయలు, 430 కిలోల చక్కెర, 309 కిలోల ఎండు మిర్చి, 209 కిలోల ధనియాలు తదితర ముడి పదార్థాలను ఉపయోగిస్తున్నారు. 2026 జనవరి-సెప్టెంబర్ వరకు 9 కోట్లకు పైగా సర్వింగ్స్ అయ్యాయి. భక్తుల రద్దీకి అనుగుణంగా ఎప్పటికప్పుడు తాజాగా నాణ్యమైన, రుచికరమైన అన్న ప్రసాదాలు తయారు చేస్తూ భక్తులకు పంపిణీ చేయడం జరుగుతోంది. భక్తుల విరాళాలతో నిర్వహించబడుతున్న వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్‌లో ప్రస్తుతం 2,900 కోట్ల రూపాయలకు పైగా ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయి. ఈ నిధులపై వచ్చే ఆదాయంతో లక్షలాది మంది భక్తులకు నిత్యం ఉచితంగా నాణ్యమైన అన్నప్రసాదాన్ని అందిస్తున్నారు. "అన్నదానం మహాదానం" అనే భారతీయ సనాతన సంప్రదాయాన్ని కొనసాగిస్తూ టిటిడి నిర్వహిస్తున్న నిత్య అన్నప్రసాద కార్యక్రమం భక్తుల సేవలో ఒక మహత్తర ఆధ్యాత్మిక సేవగా నిలుస్తోంది.

# భక్తుల కోసం 'గరుడ మ్యాప్ కొత్త యాప్'



**తిరుమల, అక్టోబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో నవరాత్రి బ్రహ్మోత్స వాలు జరగనున్న సమయం లో టిటిడి భక్తుల సౌకర్యార్థం సకల సమాచారం తెలుసుకునేలా నూతన యాప్‌ను రూపొందించింది. ఈ యాప్‌ను బ్రహ్మోత్సవాల వేదికగా ఆవిష్కరించ నున్నారు. సామాన్య భక్తులకు దర్శనం కోసం టిటిడి కొత్తగా సకల సమాచారంతో కొత్త యాప్ అందుబాటులోకి తెచ్చింది. తిరుమలలో పూర్తి సమాచారం అందించేందుకు వీలుగా గరుడ యాప్ తీసుకొచ్చింది. దీని ద్వారా తిరుమలకు వచ్చే భక్తులు ఎవరి సహాయం లేకుండా, వెళ్ళాల్సిన ప్రాంతానికి సులువుగా చేరుకునేలా ఈ మ్యాప్ యాప్ ఉపయోగ పడుతుంది. తిరుమల క్షేత్రానికి సంబంధిం చిన సకల సమాచారంతో ప్రత్యేకంగా ఈ యాప్‌ను రూపొందించారు. భక్తుడు ఏ ప్రాంతానికి వెళ్లాలను కున్నా యాప్‌లో ఆ ప్రదేశం పేరు నమోదు గానీ వాయిస్ కమాండ్ ఇస్తే ఆ ప్రాంతానికి తేలికగా చేరుకోవచ్చు. టిటిడి అందించే అన్ని సేవలు ఇందులో ఉంటాయి. భక్తులు తల నీలాలు ఇవ్వాలనుకుంటే యాప్ లో నమోదు చేసిన వెంటనే తిరుమలలో ఉన్న కల్యాణకట్టలన్నీ యాప్‌లో కనిపిస్తాయి. అక్కడికి చేరుకునే మార్గాలన్నీ డిస్‌ప్లే అవుతాయి. నడిచి వెళితే ఎంత దూరం, వాహనంలో వెళితే ఎంత దూరం, చేరుకోవడానికి పట్టే సమయం కూడా కనిపిస్తుంది. అంతేకాదు తక్షణమే సులువుగా చేరుకునే మార్గాన్ని కూడా సూచిస్తుంది. ఇలా వివిధ రకాల దర్శనాల ప్రవేశాలు, క్యూ కాంప్లెక్స్‌లు, లడ్డూ కేంద్రం, అతిథిగృహాలు, ఫుడ్ కౌంటర్లు, తాగునీటి కేంద్రాలు, వైద్య కేంద్రాలు తదితర విభాగాల పూర్తి సమాచారాన్ని ఈ యాప్ ద్వారా పొందే విధంగా రూపకల్పన చేశారు. ఇప్పటికే టిటిడి యాప్‌తో పాటుగా నందకం యాప్ భక్తుల కు అందు బాటులో ఉంచారు. తాజాగా మరో యాప్ సిద్ధమైంది.

# యువత భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం: శ్యామల

**విజయవాడ, అక్టోబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** కూటమి ప్రభుత్వం యువత భవిష్యత్తుతో చెలగాట మాడుతోందని, రాష్ట్రంలో మాదకద్రవ్యాలను నియంత్రించడంలో పూర్తిగా విఫలమైందని వైసిపి అధికార ప్రతినిధి శ్యామల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల సమయంలో గంజాయిని సమూ లంగా నిర్మూలిస్తామన్న ముఖ్య మంత్రి చంద్రబాబు, నారా లోకేశ్ ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని శ్యామల అన్నారు. "హోంమంత్రి వంగలపూడి అనితకు టివి షోల టిఆర్పీలపై ఉన్న శ్రద్ధ గంజాయి కేసులను అరికట్టడంపై లేదు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో గంజాయి లేకుండా చేస్తానన్న ఆమె సవాల్ ఏమైంది?" అని ఎద్దేవా చేశారు. కూటమి నేతలు ఆడుతున్నది యువత భవిష్యత్తును నాశనం చేసే 'టాక్సిక్ గేమ్స్' అని ఆమె ఆరోపించారు.

**AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్**
(ఒక షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకు)
(CIN : L36911RJ1996PLC011381)
నమోదిత కార్యాలయం: 19-A, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001
అనుబంధం IV (నిబంధన 8(1) చూడండి) స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

ఇది ఇలా ఉండగా, "సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (చట్టం, 2002 (54 ఆఫ్ 2002) దాని క్రింద **AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్)** యొక్క అధీకృత అధికారిగా మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క సెక్షన్ 13 (12) [నియమం 3] తో చదవబడే అధికారాలను వినియోగించుకుంటూ, నోటీసులలో పేర్కొన్న మొత్తాన్ని **రూ.3,47,500/- (రూపాయలు మూడు లక్షల నలభై-ఏడు వేల ఐదు వందలు మాత్రమే)** నోటీసు అందిన తేదీ నుండి 60 రోజుల్లోపు తిరిగి చెల్లించాలని రుణగ్రహీత **రత్లావతు గౌరి (రుణగ్రహీత), రత్లావతు రాములు (సహ-రుణగ్రహీత), రత్లావతు శక్తి (సహ-రుణగ్రహీత), రుణ ఖాతా నం. 2463000014222)**ను కోరుతూ **12-జూన్-26**న డిమాండ్ నోటీసు జారీ చేశారు.

ఇది ఇలా ఉండగా, **ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్,** ఏప్రిల్ 1, 2024 నుండి అమల్లోకి వచ్చేలా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విలీన పథకం ద్వారా **AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్** తో విలీనం చేయబడింది. ఈ విలీన పథకం ద్వారా, పైన పేర్కొన్న రుణ ఖాతా **AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్** కు బదిలీ చేయబడింది. ఇందులో మంజూరు చేయబడిన క్రెడిట్/ఆర్థిక సహాయానికి సంబంధించి మీరందరూ చెల్లించాల్సిన సొమ్ము మొత్తం తనఖా పెట్టిన ఆస్తికి సంబంధించి అంతర్లీన భద్రత మరియు భద్రతా వడ్డీతో సహా కానీ వీటికే పరిమితం కాదు.

రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/తనఖాదారు/హామీదారుడు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, **04వ రోజున అక్టోబర్ 2026 సంవత్సరం** సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూల్ 8తో చదువబడే చట్టం యొక్క సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (4) క్రింద అతనికి/ఆమెకు ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుని, క్రింద వివరించిన ఆస్తిని క్రింద సంతకం చేసిన వ్యక్తి స్వాధీనం చేసుకున్నాడని రుణగ్రహీత/తనఖాదారునికి మరియు ప్రజలకు నోటీసు ఇవ్వబడుతోంది.

ముఖ్యంగా రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/తనఖాదారు/హామీదారు మరియు సాధారణ ప్రజలు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు వ్యవహరించవద్దని ఇందుమూలంగా హెచ్చరిస్తున్నారు మరియు ఆస్తితో జరిగే ఏదైనా లావాదేవీలు **AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్)** యొక్క **రూ.3,47,500/- (రూపాయలు మూడు లక్షల నలభై-ఏడు వేల ఐదు వందలు మాత్రమే) 11-జూన్-26** నాటికి మొత్తానికి మరియు పూర్తి చెల్లింపు వరకు దానిపై వడ్డీ మరియు ఖర్చులకు లోబడి ఉంటాయి.

"సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి పొందడానికి అందుబాటులో ఉన్న సమయానికి, అంటే ఈ సమాచారం నుండి 30 రోజులలోపు, చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8)లోని నిబంధనలను నియమం 8 (6)తో చదవడం ద్వారా రుణగ్రహీత దృష్టికి తీసుకురావడమైనది."

స్థిరాస్తుల యొక్క వివరణ

నాగర్‌కర్నూల్ జిల్లా ఇంటి నెం 1-74లో ఓపెన్ ప్లాట్ విస్తీర్ణం 65 x 31 = 223.88 చదరపు గజాలు Rcc 25 x 25 = 625 చదరపు అడుగుల ఇంటి నిర్మాణం నాగర్‌కర్నూల్ జిల్లాలోని కోడేరు మండలం నాగులపల్లి తండా గ్రామ పంచాయతీ పరిధిలో ఉంది.
తూర్పు: ఆర్ నరసింహ బహిరంగ ప్రదేశం, పశ్చిమం: సిసి రోడ్, ఉత్తరం: నరసింహ ఇల్లు, దక్షిణం: సిసి రోడ్

తేది : 04/అక్టోబర్/2026
ప్రదేశం : నాగర్‌కర్నూలు, తెలంగాణ
అధీకృత అధికారి
AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

వార్త

రాజకీయాలను, నీతిని విడివిడిగా పరిగణించేవారు ఆ రెండింటిలో దేనినీ, ఎన్నటికీ అర్థం చేసుకోలేరు.

- రూసో

# కాలుష్యానికి 'చెక్'!

కాలుష్యానికి రంగు, రుచి, వాసన లేదు. కానీ ఢిల్లీలో కాలుష్యమంటే అలాంటిది ఇలాంటిది కాదు. అక్కడ కాలుష్య మేఘాలు కమ్ముకుంటే ఎవరైనా సరే ఇల్లు దాటి బయటకు రాలేరు. ఒకవేళ వచ్చినా ఎక్కడో ట్రాఫిక్‌లో ఇరుక్కొని అలా కొన్ని రోజుల తర్వాత శ్వాస ఘోషతో మరికొన్ని రోజులు ఇంట్లోనే. ఇలా ఢిల్లీ వాసుల బతుకులు తెల్లవారిపోతుంటాయి. ప్రతి యేటా శీతాకాలంలోతీవ్రమైన వాయుకాలుష్యం నుంచి బయటపడాలంటే ముందస్తు ప్రణాళికల కోసం ఢిల్లీ ప్రభుత్వం ఆపసోపాలు పడుతోంది. ఎలాగైనా కాలుష్యంతో యుద్ధానికే సిద్ధమైంది. గాలి నాణ్యత బాగా పడిపోయిన తర్వాత కన్నా ముందుగానే స్పందించడం మేలనుకుంది. రేపటి నవంబరు 1 నుంచి ఫిబ్రవరి 28వరకు సాగే కాలుష్య సీజన్‌కు ప్రత్యేక ప్రోటోకాల్‌ను రెడీ చేశారు. 'గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్' మార్గదర్శకాలను సవరించి మరింత కఠినతరం చేసేందుకు ముందస్తు ప్రణాళికతో ముందడుగు వేస్తోంది. నిజానికి దాదాపు దశాబ్దానికిపైగా ఢిల్లీ కాలుష్య మహమ్మారి ఢిల్లీ వాసుల్ని ప్రశాంతంగా, ఆరోగ్యంగా బతకనివ్వడం లేదు. అక్కడ విరజిమ్మే కాలుష్యానికి పగలు రాత్రి అంటూ ఉండదు. ఢిల్లీ కాలుష్య కాసారాన్ని అదుపు చేయాలని ఎన్నోసార్లు సుప్రీంకోర్టు కూడా కాలుష్యరహిత ఢిల్లీ కోసం జోక్యం చేసుకుంది. అయినా లాభం లేదు. ప్రతి యేటా జరిగే తంతే ఇప్పుడు కూడా నడుస్తోంది. అయితే ప్రభుత్వం కాస్త ముందస్తుగా మేలుకొంది. అదే ఈసారిమార్పు. మిగిలినది షరామామూలే. కాలుష్య తీవ్రత తగ్గించే చర్యల్ని ప్రభుత్వాలు ప్రకటించాయి. నవంబరు 1 నుంచి పార్కింగ్ చార్జీలు రెట్టింపు వసూలు చేస్తారు. ప్రభుత్వ, ప్రయివేట్ ఉద్యోగులకు వర్క్‌ఫ్రమ్ హోమ్ విధిస్తారు. నిర్మాణాలు కూల్చివేత పనులకు పూర్తి విరామం. ఈ సీజన్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు కేవలం సగం మంది సిబ్బందితోనే ఆఫీసుల్నించి పనిచేయించుకుంటారు. మిగిలిన 50 శాతం మంది ఉద్యోగులు 'ఇంటి నుంచే' వర్క్ ఫ్రమ్ హోమ్ చేయాలి. శీతాకాలంలో ఉష్ణోగ్రతలు పడిపోవడం, ఇరుగు పొరుగు రాష్ట్రాలు పంజాబ్ హర్యానాలలో రైతాంగం పంట వ్యర్థాలను కాల్చడం, వాహన కాలుష్యం, నిర్మాణ రంగ ధూళి, దీపావళి బాణసంచా కాల్చడం వల్ల వ్యాపించే కాలుష్యం పరిసరాల పారిశ్రామిక ఉద్గారాలతో ఢిల్లీ అనగానే గ్యాస్ చాంబర్ గుర్తొస్తుంది. అందుకే ఢిల్లీ వాసులు కాలుష్యమంటే భయపడిపోతుంటారు. దట్టమైన పొగమంచు కారణంగా ప్రజలు శ్వాసకోస వ్యాధులతో పీడింపబడుతున్నారు. అందుకే రాజధాని నగరాన్ని కాలుష్యానికి ఎరవేయకుండా ఈసారైనా కాపాడుకోవాలని ప్రభుత్వాలు ముందస్తు ప్రణాళికను ప్రకటించాయి. ఢిల్లీలో గతంలో వలె ఎక్యూఐ 400 దాటిన తర్వాత ఆదరాబాదరాగా జిపిఎపి ఆంక్షలు విధించే పద్ధతికి బదులు ముందుగానే కఠిన నిబంధనలు అమలు చేసేందుకు కొన్ని ప్రతిపాదనలు చేశారు. రోడ్లపై రద్దీ తగ్గించేందుకు షిఫ్ట్ సిస్టమ్‌ను తప్పనిసరిగా పాటించాలి. ఢిల్లీ వెలుపల రిజిష్టర్ అయిన బిఎస్-4 అంతకన్నా ముందటి పాత పెట్రోల్, డీజిల్ వాహనాలు నగరంలోకి రావడానికి అనుమతించేది లేదు. బిఎస్6, సిఎన్‌జి, ఇవి వాహనాలు మాత్రం నగరంలో తిరగొచ్చు. అక్టోబరు 1నుంచే అన్ని పెట్రోలు బంకుల్లో చలామణి అయ్యేవిధంగా పియుసిసి ధృవీకరణ పత్రం చూపితే తప్ప పెట్రోలు, డీజిల్ కానీ ఇవ్వరు. ఏప్రిల్ 2028 నాటికే కేవలం ఎలక్ట్రిక్ వాహనాలకే రిజిస్ట్రేషన్‌లు పరిమితమవుతాయి. గతంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ దాటిన తర్వాతనే ఆంక్షలు విధించేవి. ముందుగానే నియంత్రణ చర్యలు తీసుకోవడం మూలంగా గాలి నాణ్యత ప్రమాదకర స్థాయికి చేరుకోకుండా నిరోధించవచ్చుననే అంచనా. గాలి కాలుష్యానికి వాహనాల పొగ కీలకం. అందుకే ఇకపై అలాంటి వాహనాలకు రిజిస్ట్రేషన్‌లు కాకూడదు. ఢిల్లీ పరి సరాల్లో ఉండే పంజాబ్, హర్యానా, యు.పి, రాజస్థాన్ రాష్ట్రాల్లో వరి వ్యర్థాలదహనం కట్టడి కాకపోతే ఢిల్లీలో ఎన్ని చర్యలు తీసుకున్నా ప్రయోజనం ఉండదని ప్రభుత్వాలు భావించి వాటిమీద ఆంక్షలు పెడుతున్నాయి. ఆ సీజన్ ఇప్పటికే ప్రారంభమైంది. ఆయా రాష్ట్రాల వ్యవసాయ మంత్రుల సహకారం తీసుకున్నా గతంలో ఫలితం దక్కలేదు. రైతులు సంప్రదాయ విధానాల నుంచి అంత త్వరగా వైదొలగలేరు. పంట వ్యర్థాల కాల్చిన విషయంలో చాలాసార్లు రైతులను మందలించడం, జరిమానాలు వేయడం అయినా రైతులను మార్చలేకపోవడం గత అనుభవాలు. ఈ యేడాది సూపర్ ఎల్‌నినో మూలంగా కాలుష్యం తగ్గే అవకాశముందని భావిస్తున్నారు. దీపావళి నాటికి పంట దహనాలు గరిష్టస్థాయికి చేరుకోగలరని నిపుణుల అంచనా. నిషేధాలన్నీ మరికొన్ని కొత్త సమస్యలు తెస్తాయే తప్ప సమస్య సమూలంగా పరిష్కారం కాదు. కఠినతరం చేయాలనుకున్న అంశాలన్నిటినీ సమన్వయంతో చర్యలు తీసుకుంటే ఎంతో కొంత సానుకూల పరిణామాలు చూడగలం. పారిశ్రామిక కాలుష్యం చెప్పుకోదగింది. ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లోని 2,354 పరిశ్రమల్లో కాలుష్య రీడింగ్‌లను క్రమబద్ధం చేసే చర్యలో భాగంగా 'ఆన్‌లైన్ కంటిన్యూయస్ ఎమిషన్, మానిటరింగ్ సిస్టమ్' ఏర్పాటు తప్పనిసరి చేయడంవిశేషం. వీటిలో97.3 శాతం అనగా 2197పరిశ్రమలు ప్రభుత్వ నిర్ణయానికిసానుకూలంగా స్పందించాయి. 57 పరిశ్రమలను మూసి వేయించారు. పార్టిక్యులేట్ ప్రమాణాన్ని 80 నుండి 50 ఎంజికి తగ్గించారు. గతంలో కూడా డిసెంబరు 2025 నుంచి సెప్టెంబరు 2026 మధ్య 1127 పరిశ్రమ లను సర్వేచేసి కాలుష్యకారక పరిశ్రమలు 2283ను మూసి వేయించారు. కావున పారిశ్రామిక కాలుష్యం ఎంతో కొంత పరిమాణంలో నియంత్రించగల పరిస్థితిఉంది. ఇలాంటి చర్యలనుముందస్తు ప్రణాళికల ద్వారా నిర్దేశించుకోవడం స్వాగతించదగినది. రాజధాని వాసులకు కాలుష్య ఊరట కలిగిస్తే మంచిదే.

ఒక కంటితో నిద్రపోతూ మరో కంటితో శత్రువులను కనిపెట్టి ఉండే ఎలుగుబంటిలా రాజు శత్రువులపట్ల ఎప్పుడూ జాగ్రత్తగా ఉండాలి.



శ్రీ కృష్ణదేవరాయలు

క్రమశిక్షణ, సౌశీల్యం, అంతర్ దృష్టి వంటిగుణాలు లోపించిన నాయకుల చేతుల్లో రాజకీయాలు ఉండటంకంటే అసలు రాజకీయాలే లేకపోవడమే మేలు.



రామ్ మనోహార్ లోహియా

## ప్రజావాక్కు



### అవినీతి అనకొండలు

అవినీతిఅనుకొండలు పట్టుబడిన కొద్దీ ఇంకాఇంకా పట్టుబడుతూనే ఉన్నాయి. అలాగే దొంగతనాలు, దోపిడీలు, సైబర్ నేరాలు, మానభంగాలు, భార్యలు, భర్తలు ఒకరి నొకరు చంపుకోడాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. కారణం పాపభీతి కరువవుతోంది. కష్టపడకుండా డబ్బు సంపాదనకు అలవాటుపడుతున్నారు. బాధితులకు సత్వర న్యాయం జరగడంలేదు. దీనిని అరికట్టలేక పోవడం మన చట్టాలు కఠినాతి కఠినంగా లేకపోవడం, నేరస్తులు పట్టుబడినా కోర్టుల నుంచి బెయిల్ మీద బయటకొచ్చి మళ్ళీ నేరాలకుపాల్పడుతున్నారు. హైదరాబాద్‌లోని మల్కాజీగిరి పరిధిలోని బోడుప్పల్ వద్ద నున్న దుకాణంలో కోట్ల రూపాయల విలువ చేసే బంగారం, వజ్రాలు దొంగతనం సామాన్యమైనదికాదు. రాష్ట్రాలు, దేశం అరాచకంలోకి నెట్టబడుతున్నాయి. ముందు ఇంట గెలవండి.

- డా. ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

### క్యాంటీన్ లైసెన్స్ రద్దు పరచండి

సినిమా హాల్‌లో టాయిలెట్లు ఉచితంఉంటుంది. బస్టాండులో కూడా టాయిలెట్ ఉచితం ఉండాలి. నిత్యం వేలాది మంది ప్రయాణికులు విజయవాడ బస్టాండుకు వస్తారు. వారుప్రయాణించిన టికెట్లపై ఆర్టీసీ నడుస్తుంది. కానీ ఉచిత బస్సుల్లో ప్రయాణం చేసిన మహిళలకు బస్టాండులో ఐదు రూపాయలు ఇచ్చి పని పూర్తి చేసుకోవాలి. మరీ ముఖ్యంగా దూరప్రాంతాల నుండి ప్రయాణికులు బస్సులు దిగేదగ్గర, ఎదురుగా ఉన్న కొన్నిక్యాంటీన్'లో టాయిలెట్లు లేవు. అడిగితే పక్కనే ఉన్న మూత్ర శాలకు పొమ్మంటారు. టాయిలెట్ లేకుండా హోటల్‌కు అనుమతి ఎవరు ఇచ్చారు ? గతంలో కూడా ఇదే విషయం పై కలెక్టరుకు ఫిర్యాదు చెయ్యటమైనది.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### పాత ఓటర్ లిస్ట్‌ను తనిఖీ చేయాలి

కొన్నిచోట్లబీఎల్‌వోలు తెలియకనో, చాదస్తమో, మరియోంటోగాని ఫాంఒకే కుటుంబం ఓటర్‌లిస్ట్ గతంలో తప్పులుగా నమోదుచేశారు. ఇప్పుడు నాల్గురు బిఎల్‌వోలు నాలుగు ఫామ్ తీసుకువచ్చి మాకు ఇవ్వాలని అనడం వారి విధుల పట్ల వారికి ఎంతవరకు అవగాహన ఉందో దీన్ని బట్టి అర్థమవుతోంది. ఇప్పటికైనా విషయం తెలుసుకొని వ్యవహరించాలి. గతంలోఎన్నిసార్లు ఓట్లు వేసిన లిస్టులను తనిఖీ చేసి పరిశీలిస్తే త్వరగా దొరుకుతుంది.

-సింగు లక్ష్మీనారాయణ, కరీంనగర్

### విస్తరిస్తున్న మూఢాచారాలు

నాడు చదువు రాని వారు మూఢనమ్మ కాలను నమ్మి మోసపోతే, నేడు బాగాచదువుకున్నవారు ఈమూఢాచారాలపై ఆధారపడి నష్టపోతున్నారు. ఏమీ తెలియనివారు మూఢనమ్మకాలను నమ్ముతున్నారంటే కొంతవరకు అర్థం చేసుకోవచ్చు . కానీ బాగా చదువుకున్నవారు, లోకజ్ఞానం ఉన్నవారు సైతం ఈ మూఢనమ్మకాలలో నలిగితున్నారంటే ఆశ్చ ర్య మేస్తుంది. కొందరు మూర్ఖులు చెప్పిన మాటలు విని మూఢనమ్మకాల మత్తులో మినిగిపోతున్నారు. పూజలు, జాతకాలు అంటూ వాళ్ళుమీడియా ద్వారా అబద్దాల ప్రచారప్రచారం చేసుకుంటూ ప్రజల అమాయకత్వాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. అజ్ఞానంతో, అమాయకత్వంతో జనం ఇలాంటి వాటిని నమ్ముతున్నారు. మనం ఆధునిక కాలంలోఉన్నా, ఈ మూఢనమ్మకాల ప్రభావం ఇంకా చాలా మందిలో కనిపిస్తోంది. ఆచారమంటూ ప్రచారంచేసే మూర్ఖులనుదగ్గరకురానీయకూడదు. ఈ మూఢాచారాలను ఎంత త్వరగా తొలగించగలిగితే అంతా మంచిది. అందుకు ముఖ్యంగా ప్రజల్లో చైతన్యం రావాలి.

- కాయల నాగేంద్ర, హైదరాబాద్

### స్వీయ నియంత్రణ అవసరం

హైదరాబాద్‌లోని ఆహ్లాదకర ప్రదేశాలలో ట్యాంక్‌బండ్ ఒకటి. అనేకమంది సాయంత్రం వేళలలో ఇక్కడ సందర్శిస్తుంటారు. ఒకప్రక్కన హుస్సేన్‌సాగర్‌ను కూర్చొని చూడటానికి ఏర్పాటు చేసిన దిమ్మలు, మరోవైపు తెలుగుప్రముఖుల విగ్రహాలు ఉన్న ప్రాంతంలో పచ్చని చెట్లతో, పచ్చిక బయళ్లతో పాదచారులను ఆకర్షిస్తుంటుంది. మధ్యలో రోడ్డునిరంతరం రద్దీగా ఉంటుంది. అతిజాగ్రత్తతో వ్యవహరించాల్సిన ప్రదేశంగా దీనిని పేర్కొనవచ్చు. లేనిచో రోడ్డు ప్రమాదాల భారీన పడక తప్పదు. ట్యాంక్‌బండ్‌పై అర్థరాత్రి వేళల్లో బర్త్‌డే పార్టీలు కొంతమంది చేసుకోవటంతో సమస్యలు తలెత్తుతున్నాయి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

### పోస్టులను భర్తీ చేయాలి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా భర్తీ చేయబోయే అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్, ఎనలిస్ట్ పోస్టులకు ఎంఎస్సీ జాగ్రఫీ చదివిన అభ్యర్థులను అర్హులుగా చేయాలి. ఇంతకు పూర్వం టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ పోస్టులకు ఎమ్మెస్సీ జాగ్రఫీ అభ్యర్థులను సివిల్ ఇంజినీర్ పోస్టులతో సమానంగా భావిస్తూ ఎలిజిబుల్‌గా చేశారు. కాబట్టి పుష్కరానికి ఒకసారి పడే ఈపోస్టులకు ఎంఎస్సీ జాగ్రఫీ అభ్యర్థులను ఎలిజిబుల్‌గా చేసి అనుమతించాలి.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# మనకు కనిపిస్తున్న ప్రపంచం నిజమేనా?

**ప్రపంచ పటం మారినంత మాత్రాన భూమి మారదు. ఆఫ్రికా ఒక్కసారిగా పెద్దది కాదు, యూరప్ ఒక్కసారిగా చిన్నది కాదు. మారేది మన కళ్లకు కనిపించే చిత్రం. కానీ ఆ చిత్రం చిన్న విషయం కాదు. మన విద్యను, మన భౌగోళిక అవగాహనను, ప్రపంచంలోని ఇతర ప్రాంతాల పట్ల మన దృష్టిని అది ప్రభావితం చేయగలదు. అందుకే ప్రపంచ పటాలను మరింత వాస్తవికంగా చూపించే ప్రయత్నాన్ని స్వాగతించాలి. అయితే దాన్ని రాజకీయ పోరాటంగా కాకుండా శాస్త్రీయ చర్చగా చూడాలి. భారతదేశం తీసుకున్న వైఖరిలోనూ ఇదే సమతుల్యత కనిపిస్తోంది భూభాగాల వాస్తవ పరిమాణాలను మెరుగ్గా చూపించే సమాన విస్తీర్ణ పట రూపకల్పనా పద్ధతులకు మద్దతు, అదే సమయంలో ఏఒక్క పటాన్నీ అన్ని అవసరాలకు అంతిమ సత్యంగా ప్రకటించకపోవడం.**

తిప్పర్తి శ్రీనివాస్

భూమిని మనం చూస్తున్న తీరు ఎంతవరకు వాస్తవం? ప్రపంచ పటాలపై కొత్త చర్చ చెబుతున్న పాఠం. మన కళ్లకు కనిపించే ప్రపంచమే నిజమైన ప్రపంచమా? ఈ ప్రశ్నకు సమాధానం వెతికేటప్పుడు భౌగోళిక శాస్త్రం, చరిత్ర, రాజకీయాలు, సంస్కృతి వంటి అంశాలను ప్రస్తావిస్తాం. కానీ మన ప్రపంచ దృక్పథాన్ని మౌనంగా ప్రభావితం చేసే మరో సాధనం ఉంది. అదే ప్రపంచ పటం. ఇటీవల ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం భూభాగాల వాస్తవ పరిమాణాలను మరింత సముచితంగా ప్రతిబింబించే పట రూపకల్పనా పద్ధతుల వినియోగాన్ని ప్రోత్సహించే తీర్మానాన్ని ఆమోదించింది. ఈ తీర్మానానికి 164 దేశాలు అనుకూలంగా ఓటు వేశాయి. భారత్ కూడా దీనికి మద్దతు తెలిపింది. అయితే భారతదేశం ఒక ముఖ్యమైన విషయాన్ని స్పష్టం చేసింది. ఒక నిర్దిష్టపటాన్నే ప్రపంచవ్యాప్తంగాప్రమాణంగా అమలు చేయాలని తాము కోరడం లేదని, భూభాగాల సాపేక్ష విస్తీర్ణాలను వాస్తవానికి దగ్గరగా చూపించే సమాన విస్తీర్ణ పట రూపకల్పనా పద్ధతులను ప్రోత్సహించడానికే మద్దతు ఇస్తున్నామని తెలిపింది. పటం అంటే కేవలం పటం కాదు. చిన్ననాటి నుంచే పాఠశాలల్లో చూసే ప్రపంచ పటమే మనకు భూమి ఆకారం, ఖండాల స్థానాలు, దేశాల పరిమాణాలపై తొలి అవగాహన ఇస్తుంది. ఏఖండంపెద్దది? ఏ దేశం ఎక్కడ ఉంది? సముద్రాలు ఎంత విస్తరించి ఉన్నాయి? వంటి విషయాలు మన మదిలో పటాల ద్వారానే మొదట రూపుదిద్దుకుంటాయి. కానీ భూమి గోళాకారంగా ఉంటుంది. పటం మాత్రం సాధారణంగా సమతలంగా ఉంటుంది. గోళాన్ని సమతలంపై చూపించేటప్పుడు ఏదో ఒక రకమైన వక్రీకరణ తప్పదు. ఒక పటంలో ఆకారాన్ని మెరుగ్గా కాపాడవచ్చు, మరొక దాంట్లో దిశను, ఇంకొక దాంట్లో దూరాన్ని, మరొకదాంట్లో భూవిస్తీర్ణాన్ని. అందువల్ల ప్రపంచాన్ని చూపించే ఒకే ఒక్క పరిపూర్ణమైన పటం ఉండదు. ప్రపంచ పటాల చర్చలో మర్కేటర్ పటం పేరుతప్పక ప్రస్తావనకు వస్తుంది. పదహారవ శతాబ్దంలో రూపొందిన ఈ పట రూపకల్పనా విధానం సముద్ర నావిగేషన్‌కు ఎంతో ఉపయోగకరంగా నిలిచింది. అందువల్ల అది శతాబ్దాలుగా విస్తృతంగా ఉపయోగించబడింది. ధ్రువ ప్రాంతాలకు దగ్గరగా ఉన్న భూభాగాలు ఈ పద్ధతిలో వాస్తవ పరిమాణం కంటే చాలా పెద్దవిగా కనిపిస్తాయి. గ్రీన్‌లాండ్, ఆఫ్రికాలను ఒకసారి పోల్చి చూస్తే ఈ తేడా స్పష్టమవుతుంది. పటంలో రెండూ దాదాపు సమాన పరిమాణంలో ఉన్నట్లు అనిపించవచ్చు. వాస్తవానికి ఆఫ్రికా ఖండం గ్రీన్‌లాండ్ కంటే సుమారు పద్నాలుగు రెట్లు పెద్దది. ఇక్కడ తప్పు భూమిలో లేదు. పటాన్ని రూపొందించే విధానంలో ఉంది. అందుకే మర్కేటర్ పటాన్ని చెడ్డ పటంగా కొట్టిపారేయడం కూడా సరైంది కాదు. సముద్ర ప్రయాణాల్లో దిశలను గుర్తించేందుకు అది ఉపయోగకరమైన పద్ధతి. కానీ భూభాగాల విస్తీర్ణాలను పోల్చే సందర్భంలో అది సరైన సాధనం కాదు. ఇటీవలి ఐక్యరాజ్యసమితి తీర్మానం ప్రాధాన్యం ఇక్కడే ఉంది. భూభాగాల సాపేక్ష విస్తీర్ణాలను కచ్చితంగా చూపించాల్సిన సందర్భాల్లో సమాన విస్తీర్ణ పట రూపకల్పనా పద్ధతులకు మరింత ప్రాధాన్యంఇవ్వాలని ఈ తీర్మానం ప్రోత్సహిస్తోంది. అయితే దీనిని మర్కేటర్ పటాన్ని నిషేధించారు అని అర్థం చేసుకోవడం తప్పు. అలాగే ప్రపంచ వ్యాప్తంగా ఒక్క నిర్దిష్ట పటాన్నే తప్పనిసరిగా ఉపయోగించాలనే నిర్ణయం కూడా తీసుకోలేదు. భారతదేశం ఇదే విషయాన్ని తన ఓటు వివరణలో స్పష్టంగా చెప్పింది. ఏ ఒక్క పట రూపకల్పనా విధానం అన్ని అవసరాలకు సరిపోదని, ఏ ప్రయోజనానికి ఏ పద్ధతి శాస్త్రీయంగా అనుకూలమో దాన్ని ఎంచుకునే స్వేచ్ఛ ఉండాలని భారత్ పేర్కొంది. ఇది సమతుల్యమైన వైఖరి. ఇది పాశ్చాత్య వ్యతిరేకత కాదు.



ప్రపంచ పటాలపై చర్చ మొదలైన ప్రతిసారీ దానికి రాజకీయ రంగు పులమడం సులభం. మర్కేటర్ పటం యూరప్‌ను పెద్దదిగా చూపించేందుకే ఉద్దేశపూర్వకంగా రూపొందించబడిందని కూడా కొందరు అంటారు. కానీ చారిత్రకంగా దాని ప్రధాన ఉద్దేశం సముద్ర నావిగేషన్. కాబట్టి దాన్ని ఒక రాజకీయ కుట్రగా మాత్రమే చూడటం సరైనది కాదు. అయితే ఒక పటం ఒక నిర్దిష్ట ప్రయోజనం కోసం రూపొందించబడినా, అది తరువాత ప్రపంచాన్ని చూపించే సాధారణ పటంగా మారితే, దాని వల్ల ఏర్పడే అవగాహనా ప్రభావాలను పరిశీలించడం మాత్రం అవసరం. అందుకే ప్రశ్న ఎవరు పెద్దగా కనిపిస్తున్నారు?అనేది కాదు. ఏ ప్రయోజనానికి ఏపటం ఎక్కువ ఖచ్చితత్వాన్ని ఇస్తుంది? అనేదే అసలు ప్రశ్న. భారత్ వైఖరిలో మరో ముఖ్యమైన అంశం. ఈ చర్చలో భారతదేశానికి సంబంధించిన మరో అంశం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. ఐక్యరాజ్య సమితి తీర్మానానికి మద్దతు తెలిపినప్పటికీ, భారతదేశం తన సార్వభౌమ భూభాగాన్ని జమ్మూకశ్మీర్, లడఖ్ సహా భారత అధికారిక పటానికి అనుగుణంగానే చూపించాలని స్పష్టం చేసింది. తప్పుదోవ పట్టించే లేదా సరికాని చిత్రీకరణను భారత్ అంగీకరించదని తెలిపింది. ఇక్కడ రెండు అంశాలను వేరు చేయాలి. పట రూపకల్పన ఒక శాస్త్రీయ అంశం. సరిహద్దుల చిత్రీకరణ ఒక రాజకీయ, సార్వభౌమ అంశం. భూమి గోళాన్ని సమతలంపై ఎలా చూపించాలి అన్నది పట నిర్మాణ శాస్త్రానికి సంబంధించిన ప్రశ్న. ఏ భూభాగం ఏ దేశానికి చెందుతుంది అన్నది రాజకీయ, చట్టపరమైన ప్రశ్న. ఈ రెండింటినీ కలిపి చూడటం వల్ల చర్చ అనవసరంగా సంక్లిష్టమవుతుంది. ఈ చర్చ ఐక్యరాజ్య సమితి తీర్మానంతో ముగియకూడదు. పాఠశాల విద్యలోనూ పటాలపై అవగాహన పెరగాలి. ఇదే ప్రపంచ పటం అని ఒకే చిత్రాన్ని చూపించడం కంటే, భూమిని సమతలంపై చూపించేటప్పుడు వేర్వేరు పట రూపకల్పనా పద్ధతులు ఎందుకు అవసరమవుతాయో పిల్లలకు చెప్పాలి. ఏ పటం దిశలను మెరుగ్గా చూపిస్తుంది? ఏది భూవిస్తీర్ణాన్ని? ఏది దూరాన్ని? ఏది ఆకారాన్ని? ఈ ప్రశ్నలు విద్యార్థులకు అర్థమైతే వారు పటాన్ని కేవలం చూసే వస్తువుగాకాకుండా, సమాచారాన్ని ఒక నిర్దిష్ట పద్ధతిలో ప్రతిబింబించే శాస్త్రీయ సాధనంగా చూడటం నేర్చుకుంటారు. నేడు పటాలు కాగితాలపై మాత్రమే లేవు. మొబైల్ ఫోన్లు, ఉపగ్రహచిత్రాలు, అంతర్జాల పటాలు, వార్తా సంస్థలు, సామాజిక మాధ్యమాలు ప్రతి చోటా మనంపటాలను చూస్తున్నాం. వాతావరణ మార్పు, సముద్ర మట్టం పెరుగుదల, అటవీ విస్తీర్ణం, వ్యవసాయ భూములు, జనాభా, వనరుల పంపిణీ వంటి అంశాలను ప్రపంచ స్థాయిలో పోల్చేటప్పుడు సరైన పట రూపకల్పన మరింత కీలకమవుతోంది. సరైన సమాచారాన్ని తప్పు పటంలో చూపిస్తే సమాచారం సాంకేతికంగా నిజమే అయినా, దాని దృశ్య అర్థం తప్పుదోవ పట్టించే అవకాశం ఉంది. చివరికి మారాల్సింది పటం మాత్రమే కాదు. ప్రపంచ పటం మారినంత మాత్రాన భూమి మారదు. ఆఫ్రికా ఒక్కసారిగా పెద్దది కాదు, యూరప్ ఒక్కసారిగా చిన్నది కాదు. మారేది మన కళ్లకు కనిపించే చిత్రం. కానీ ఆ చిత్రం చిన్న విషయం కాదు. మన విద్యను, మన భౌగోళిక అవగాహనను, ప్రపంచంలోని ఇతర ప్రాంతాల పట్ల మన దృష్టిని అది ప్రభావితం చేయగలదు. అందుకే ప్రపంచ పటాలను మరింత వాస్తవికంగా చూపించే ప్రయత్నాన్ని స్వాగతించాలి. అయితే దాన్ని రాజకీయ పోరాటంగా కాకుండా శాస్త్రీయ చర్చగా చూడాలి. భారతదేశం తీసుకున్న వైఖరిలోనూ ఇదే సమతుల్యత కనిపిస్తోంది భూభాగాల వాస్తవ పరిమాణాలను మెరుగ్గా చూపించే సమాన విస్తీర్ణ పట రూపకల్పనా పద్ధతులకు మద్దతు, అదే సమయంలో ఏఒక్క పటాన్నీ అన్ని అవసరాలకు అంతిమ సత్యంగా ప్రకటించకపోవడం. ప్రపంచాన్ని మార్చడానికి ముందుగా ప్రపంచాన్నిసరిగ్గా చూడాలి. పటం ఆ చూపుకు మొదటి అద్దం. ఆ అద్దంలో వక్రీకరణతగ్గితే మన ప్రపంచ దృష్టిలోనూ కొంత స్పష్టత పెరుగుతుంది. ఇది కేవలం కొత్త పటంకోసం జరుగుతున్నప్రయత్నంకాదు. వాస్తవాన్ని దగ్గరగా చూడాలన్న ప్రయత్నం. •

# చమురు మంటల్లో కరుగుతున్న రూపాయి

సి. హెచ్. ప్రతాప్

అంతర్జాతీయ ముడిచమురు ధరలు ఎగసిపడుతున్న వేళ రూపాయి విలువ మరోసారి తీవ్రమైన ఒత్తిడికి గురవుతోంది. రూపాయి డాలర్‌కు 96స్థాయిని దాటి బలహీనపడటం ఆర్థిక వ్యవస్థకు స్పష్టమైన హెచ్చరిక. మరోవైపు బ్రెంట్ ముడిచమురు ధర బ్యారెల్‌కు 107డాలర్లకు పైగా చేరడం పరిస్థితిని మరింత క్లిష్టం చేసింది. చమురు దిగుమతులపై భారీగా ఆధారపడే భారత్‌కు ఈరెండు పరిణామాలు ఒకేసారి ఎదురవడం కేవలం మార్కెట్ ఒడిదుడుకుగా తీసుకునే విషయం కాదు. రూపాయి విలువతగ్గితే ప్రతి డాలరు దిగుమతికి మరిన్ని రూపాయలు చెల్లించాల్సి వస్తుంది. అదే సమయంలో ముడిచమురు ధరలు పెరిగితే దిగుమతి బిల్లు రెట్టింపు ఒత్తిడిని ఎదుర్కొంటుంది. భారత్ తన ముడిచమురు అవసరాల్లో దాదాపు 90శాతం దిగుమతుల ద్వారానే సమకూర్చుకుంటోంది. అందువల్ల అంతర్జాతీయ చమురు ధరల్లో పెరుగుదల రవాణా, పరిశ్రమలు, విమానయానం, ఎరువులు, ప్లాస్టిక్ ఉత్పత్తుల నుంచి నిత్యావసర వస్తువుల వరకు అనేక రంగాల్లో వ్యయాన్ని పెంచుతుంది. ఈసంక్షోభానికి చివరి బిల్లు చెల్లించేదిసామాన్యుడే. పెట్రోలు, డీజిల్ ధరలపై ఒత్తిడి పెరిగితే మొదట ఆటో, టాక్సీ, బస్సు ప్రయాణ ఖర్చులు పెరుగుతాయి. లారీ రవాణా వ్యయం పెరిగితే కూరగాయలు, పండ్లు, పాలు, ధాన్యం నుంచి నిర్మాణ సామగ్రి వరకు ప్రతి వస్తువు ధరలో ఆ భారమే చేరుతుంది. రైతుకు ట్రాక్టర్ నడపడం, మోటారు పంపులు ఉపయోగించడం, ఎరువులు, పురుగు మందులు కొనడం ఖరీదవుతుంది. ఆ అదనపు వ్యయం చివరకు మార్కెట్ ధరల్లో ప్రతిఫలిస్తుంది. అంటే చమురు ధరల పెరుగుదల పెట్రోలు బంకు దగ్గర ఆగిపోదు. అది వంటింటి బడ్జెట్‌లోకి ప్రవేశిస్తుంది. రూపాయి బలహీనతతో దిగుమతి చేసుకునే వంటనూనెలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ భాగాలు, వైద్య పరికరాలు, కొన్ని ఔషధ ముడిపదార్థాల ధరలపైనా ఒత్తిడి పెరుగుతుంది. విదేశాల్లో చదువుతున్న పిల్లల ఫీజులు చెల్లించే కుటుంబాలకు ప్రతి డాలరు మరింత భారమవుతుంది. విదేశీ ప్రయాణం, విద్య, వైద్య చికిత్సల ఖర్చులు కూడా పెరుగుతాయి. నెలవారీ వేతనం మాత్రం అదే స్థాయిలో ఉండగా నిత్యావసరాల ధరలు పెరిగితే మధ్యతరగతి కుటుంబాల పొదుపులు కరిగిపోతాయి. దిగువ మధ్యతరగతి కుటుంబాలు అప్పులవైపు నెట్టబడే ప్రమాదం ఉంటుంది. ధరలను అదుపులోఉంచేందుకు ఆర్‌బీఐ కఠిన ద్రవ్య విధానాన్ని అనుసరించాల్సివస్తే గృహ రుణాలు, వాహన రుణాలు, చిన్నవ్యాపారరుణాలపై ఈఎంఐ భారం పెరగవచ్చు. ఒకవైపు కూరగాయలు, ప్రయాణం, విద్య, వైద్యం ఖరీదవుతుంటే మరోవైపు నెలవారీ రుణభారం పెరగడం కుటుంబబడ్జెట్‌ను మరింత కుదిస్తుంది. అందుకే రూపాయి పతనం స్టాక్ మార్కెట్‌లో కనిపించే సంఖ్య మాత్రమే కాదు, అది ప్రతిఇంటి ఖర్చుల పుస్తకంలో కనిపించే సమస్య. విదేశీ పెట్టుబడుల ప్రవాహం కూడా రూపాయిపై ఒత్తిడిని పెంచుతోంది. విదేశీ పెట్టుబడులు బయటకు వెళ్లినప్పుడు డాలర్లకు డిమాండ్ పెరిగి రూపాయి మరింత బలహీనపడుతుంది. ఈప్రభావందేశీయ స్టాక్ మార్కెట్లపైనా కనిపిస్తోంది. మ్యూచువల్ ఫండ్లు, పదవీ విరమణ పొదుపులు, బీమా పెట్టుబడులు కూడా మార్కెట్ ఒడిదుడుకులతో ప్రభావిత మవుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఆర్‌బీఐ ముందున్న సవాలు చిన్నది కాదు. రూపాయి పతనాన్ని అదుపులో ఉంచాలి, విదేశీమారక నిల్వలను జాగ్రత్తగా వినియోగించాలి, ద్రవ్యోల్బణంఅదుపు తప్పకుండా చూడాలి. అయితే రూపాయి సమస్యకు కేవలం ఆర్‌బీఐ జోక్యం లేదా వడ్డీరేట్ల మార్పులే శాశ్వత పరిష్కారం కావు. ఇంధన దిగుమతులపై ఆధారపడుదల తగ్గించకపోతే ఇలాంటి సంక్షోభాలు పునరావృతమవుతూనే ఉంటాయి. దేశీయ చమురు, సహజవాయు అన్వేషణను వేగవంతం చేయాలి. విద్యుత్ వాహనాలు, జీవ ఇంధనాలు, సౌర-పవన విద్యుత్, హరిత హైడ్రోజన్ వినియోగాన్ని విస్తరించాలి. ప్రజా రవాణాను బలోపేతం చేయడం కూడా చమురు వినియోగాన్ని తగ్గించే సమర్థ మార్గం. •

# ఓటుతోనే బిసిలకు రాజ్యాధికారం

దాడిశెట్టి శ్యామ్ కుమార్

తెలంగాణ రాష్ట్రంలో నలభై రెండు శాతం బీసీ రిజర్వేషన్ బిల్లు పెంపు విషయమై రాజకీయాలకు అతీతంగా రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించి చాలా కాలం గడుస్తున్నా, రాజ్యాంగబద్ధమైన విధానంలో చట్ట సభలో బిల్లు ఆమోదం పొందే విషయంలో ఆలస్యం అవుతుండడం, కాలయాపన జరుగుతున్న పరిణామాలతో రాబోయే ఎలక్షన్ల వరకు బీసీ రిజర్వేషన్ బిల్లుపై సందిగ్ధత పరిస్థితి కొనసాగితే బీసీలసాధికారతకు సవాలుగా నిలుస్తుందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రంలో అధిక జనాభా ఉన్న బీసీలు ఓటు బ్యాంకుగానే మిగిలిపోతారేమో అని కావచ్చు. బీసీ మేధావులు, విద్యావంతులు బీసీ ఉద్యమ భావజాలం కలిగినటువంటి ప్రముఖులు పార్టీలకతీతంగా బీసీల రాజకీయ భవిష్యత్తుపై ఐక్య వేదికలు ఏర్పాటు చేసుకొని విద్యాఉపాధి ఉద్యోగ అవకాశాలతో పాటు చట్టసభల్లో కూడా బీసీ సాధికారత కోసం ప్రజాస్వామ్యబద్ధంగా ఓటు ద్వారానే బీసీలకు రాజ్యాధికారం సాధ్యమనే రీతిలో బీసీకులాల ఐక్యతే లక్ష్యంగా వెనుకబడిన తరగతుల సామాజిక వర్గంలోని విభిన్న కులాలవారు వేదికలపై పాలుపంచుకుంటుండడం విశేషం. సాధారణంగా రాష్ట్రాల్లో బీసీ సామాజిక వర్గం అధికంగా ఉండడం ఒక ఎత్తైతే గడిచిన కాలంలో ఎక్కువ శాతం చట్ట సభలలో, రాజ్యాధికారంలో గానీ, మంత్రి పదవులతోపాటు వ్యాపార వాణిజ్య రంగాల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందిన సంపన్న ఉన్నత వర్గాలకు చెందిన వారే అధికంగా ఉంటున్నారు అనేది బీసీ సామాజిక వర్గాల నుండి విభిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా తెలంగాణ రాష్ట్రంలో జరిగిన కుల గణన సర్వే ఆధారంగా బీసీ కులాల సంఖ్య ఇతర అన్ని సామాజిక వర్గాల వారి కంటే అధికంగా ఉన్నప్పటికీ, విద్య ఉద్యోగ ఉపాధి అవకాశాల్లో ఇతరవర్గాల వారితో పోలిస్తే జనాభా ప్రాతిపదికన బీసీ సామాజిక కులాలు వెనుకబాటుకు గురవుతూనే ఉన్నట్టుగా గణాంకాలు చెప్తుంటాయి. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో ఆర్థికంగా వెనుకబడిన ఉన్నత వర్గాల తరగతులకు విద్యా ఉద్యోగ ఉపాధి అవకాశాల్లో ఈ డబ్ల్యూఎస్ కోటా కింద పదిశాతం రిజర్వేషన్ ఉండగా, ప్రస్తుతం అత్యధిక జనాభా శాతంఉన్న బీసీలు అంటే వెనుకబడిన తరగతుల కులాల మొత్తం రిజర్వేషన్ల సుమారు ఇరవై తొమ్మిది శాతం మాత్రమేఉంది. దీనివల్ల ఎక్కువగా జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లలో అధికంగా వ్యత్యాసాలు కనిపిస్తున్నాయనే భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దేశంలోని పలు రాష్ట్రాల్లో అధికశాతం ఉన్న బీసీలు చట్టసభల్లో సాధ్యమైనంత వరకు ఎక్కువగా రావడానికి రిజర్వేషన్ల పెంపు ప్రతిపాద నలు చట్టపరమైన విధంగా అమలు కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ




విషయమై బీసీ సామాజిక వర్గాలు ఐక్యతతో ఏకతాటిపైకి వచ్చి బీసీల అభ్యున్నతి పై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉంటుందనే విభిన్న వాదనలు లేకపోలేదు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రంలో తక్కువ శాతం జనాభా కలిగిన ఉన్నతవర్గాల వారికి ఉద్యోగఉపాధి తదితర అవకాశాల్లో ఈ డబ్ల్యూఎస్ కోటా కింద పదిశాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ఉద్దేశంతో చట్ట సభలు ఆమోదించినా, మరి తెలంగాణ రాష్ట్రంలో రాజకీ యాలకతీతంగా తీర్మానం చేసినా బీసీ రిజర్వేషన్ల పెంపుబిల్లు ప్రతిపాదనలు చట్టపరమైన ఆమోదానికి ఎందుకు జాప్యం అవుతుంది అనే సందేహాలు కలగక మానవు. దీనికి ప్రధానంగా బీసీల అంశాలపై స్పందించేందుకు సరైన బీసీసామాజిక వర్గాల రాజకీయ నాయకత్వం చట్టసభల్లో లేక పోవడమే కావచ్చు. కానీ ప్రస్తుత తరుణంలో బీసీల ఐక్యత రాగం ముందుకు వస్తున్నందుకు రాబోవు కాలంలో బీసీ రిజర్వేషన్ పెంపు అమలు అంశమే ప్రధాన ఎజెండాగా ఎలక్షన్లు జరగబోతాయేమో అనే సంకేతాలు అన్ని పార్టీల్లో స్పష్టంగా అంతర్గతంగా గోచరిస్తున్నప్పటికీ, బీసీల ఆకాంక్షలను నెరవేర్చుకునేందుకు సమయానుకూలంగా ఓటుద్వారా నే సాధించాలనే విధానం అధిక శాతం ఓటుబ్యాంకు ఉన్న బీసీ సామాజికవర్గాలలో ఉందనే చర్చ జరుగుతోంది. జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో బీసీ సామాజిక వర్గానికి తగినంతమంది శాసనసభ్యులు లేకపోవడం ఒక ఎత్తైతే ఆయా రాజ కీయ పార్టీలో ఉన్న బీసీలకు అధిష్టానం నిర్ణయాలమేరకు కట్టుబడి ఉండడం మరో ఎత్తు అవుతున్నదేమో. కానీ బీసీ లకు రాజ్యాధికారం దక్కాలంటే ఓటు ద్వారానే సాధ్యం అనేఅంశాన్ని మాత్రం అంతర్గతంగా బీసీవర్గాలు బలంగానమ్ముతున్నారు అనే వాదనలు తెరపైకి వస్తున్నాయి. అంతేకాకుండా చట్టసభలకు ఎలక్షన్లు వచ్చినప్పుడు ఎక్కువ శాతం రాజ కీయ పార్టీలు బీసీ అభ్యర్థులను ఎందుకు ప్రకటించలేకపోతున్నారనే అనే సంశయం కూడా బీసీవర్గాలలో లేకపోలేదు. ఇందుకు ప్రధానంగా కావాల్సింది బీసీల జనాభా సంఖ్య ఆధారంగా చట్టసభల్లో బీసీలకు రావలసిన వాటా ప్రతి పార్టీలోని అధినాయకత్వం ఇవ్వాలి. అప్పుడే బీసీల ఆకాంక్ష కు కార్యాచరణకు అని రాజకీయ పార్టీలు సానుకూలంగా ఉన్నట్టు అని భావించ వచ్చేమో. అయితే వెనుకబడిన తరగతి కులాలకు రాజ్యాధికారం రావాలంటే చట్టసభల్లో జనాభా ప్రాతిపదికన బీసీ అభ్యర్థులకు అవకాశం రావలసి ఉంటుంది. అందుకు బీసీలు స్వతంత్ర అభ్యర్థులుగా నైనా, పోటీ చేసైనా లేక బీసీ అభ్యున్నతికి పాటుపడే నూతన పార్టీల నిర్మాణం క్రమంలో అయినా విభేదాలు లేకుండా ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా బీసీ ఓటర్లు ఐక్యతను ప్రదర్శించి రాబోయే ఎన్నికల్లో ఓట్లతో మెరుగైన సీట్లుగెలిస్తే చట్టసభల్లో రాబోవు కాలమంతా బీసీలకు రాజ్యాధికారం ఉంటుందనేది బీసీలు బలంగా విశ్వసిస్తున్నారు. ఏది ఏమై నప్పటికీ బీసీల పెరిగిన జనాభా ప్రాతిపదికన ఉండవలసిన న్యాయపరమైన రిజర్వేషన్ల పెంపు బిల్లు సఫలీకృతంకోసం అన్నీ సామాజిక వర్గాల వారితోపాటు రాజకీయ పార్టీలు కూడా రాజకీయాలకతీతంగా త్వరితగతిన చట్టసభలలో ఆమోదానికి మరింత సహకరించాలి. లేకుంటే ఓటుద్వారానే చట్టసభల్లో బీసీలు రాజ్యాధికారం సాధించాలంటే సహజంగా అసెంబ్లీకి, పార్లమెంటుకు ఎన్నికలు వచ్చినప్పుడు రాజకీయ పార్టీలకు అతీతంగా వెనుకబడిన తరగతుల కులాల అభ్యర్థులనే గెలిపించేందుకు బీసీ సామాజిక వర్గాలు ఎంతవరకు బాధ్యతగా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తాయో వేచిచూడాల్సిందే. •

# సిఇసి జ్ఞానేశ్‌కు 42 మంది మాజీ జడ్జిల మద్దతు

**న్యూఢిల్లీ, అక్టోబరు 8:** ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ని వ్యతిరేకిస్తూ, సిఇసి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలు, క్రాకోచ్ జనతా పార్టీ(సిజేపీ), వామపక్ష విద్యార్థి సంఘాలు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో, జ్ఞానేష్ కుమార్‌కు భారీ మద్దతు లభించింది. 42 మంది మాజీ న్యాయమూర్తులు సీఈసీకి మద్దతుగా నిలిచారు. ఎన్నికల సంఘం, న్యాయవ్యవస్థ, ఇతర రాజ్యాంగ సంస్థలను బలహీనపరిచేలా నిరంతర ప్రచారం జరుగుతోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఓట్ చోరీ ఆరోపణలు చేయడం, రాజ్యాంగ సంస్థలను దొంగలుగా, రాజకీయ సంస్థలుగా పదే పదే చిత్రీకరించడం ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తుందని మాజీ జడ్జీలు హెచ్చరించారు. సంస్థల్ని విమర్శించడం ప్రజాస్వామ్య హక్కు, కానీ కించపరచడం మాత్రం కాదు అని వారు లేఖలో పేర్కొన్నారు. సర్ ప్రక్రియ కూడా మాజీ న్యాయమూర్తులు సమర్థించారు. ఓటర్ల జాబితా మరింత స్వచ్ఛంగా, ఖచ్చితంగా రూపొందించేందుకు చట్టబద్ధంగా చేపట్టిన ప్రక్రియ అని అభివర్ణించారు. ఎన్నికల ప్రక్రియను, ఎన్నికల ఫలితాల విశ్వసనీయతను ప్రశ్నిస్తూ రాజ్యాంగ సంస్థలను పూర్తిగా అనుమానాస్పదంగా చూపించే ప్రయత్నాలు అశాంతికి దారి తీయొచ్చని వారు హెచ్చరించారు. ఇలాంటి పరిస్థితులు అరాచక శక్తులకు ఊతమిస్తాయని లేఖలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యానికి నమ్మకమే పునాది అని వారు వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రక్రియపై రాజకీయ పార్టీలకు అభ్యంతరాలు ఉంటే వాటిని రాజ్యాంగం, చట్టం కల్పించిన మార్గాల్లో పరిష్కరించుకోవాలని మాజీ న్యాయమూర్తులు సూచించారు. ఎన్నికల వివాదాలను న్యాయపరమైన ప్రక్రియ ద్వారా పరిష్కరించుకోవాలని, రాజ్యాంగ సంస్థలపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసేలా ఆరోపణలు చేయకూడదని హితవు పలికారు. మరోవైపు, దీనిని జ్ఞానేష్ కుమార్‌పై విపక్ష పార్టీలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నాయి. సర్ పేరుతో భారీ సంఖ్యలో అర్హులైన ఓటర్లను తీసేశారని ఆరోపిస్తున్నాయి. 2025 నాటి ఓటర్ల జాబితానే కొనసాగించాలని, ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఓట్లను తొలగించడం వల్ల బీజేపీకి న్యాయం చేకూరుతోందని, సీఈసీ బీజేపీకి ప్రయోజనం చేకూరేలా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నాయి. సర్‌కు సంబంధించిన పలు నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత 10 నెలల్లో కనీసం 14 సందర్భాల్లో అభ్యంతరాలు వ్యక్తం చేశారనే మీడియా నివేదికలను ఆధారంగా చేసుకుని విపక్షాలు ఆందోళలు చేస్తున్నాయి.



# జ్ఞానేశ్ తప్పుకోవలసిందే.. బెంగళూరులో సిజెపి మహాధర్నా

**పాల్గొన్న ప్రకాష్‌రాజ్, అభిజిత్ దీప్కే ప్రభృతులు**

**బెంగళూరు, అక్టోబరు 8:** ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల చోరీకి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా డిమాండ్ తో ఉద్యమిస్తున్న క్రాకోచ్ జనతా పార్టీ నేతలు ఇవాళ బెంగళూరు ఫ్రీడమ్ పార్క్ లో మహాధర్నా చేపట్టారు. అక్టోబర్ 10న ఢిల్లీ వేదికగా జరిగే భారీ ధర్నాకు సన్నాహకంగా బెంగళూరులో వారు సమావేశమయ్యారు. ఈ ధర్నాకు నటుడు, సామాజిక కార్యకర్త ప్రకాష్ రాజ్, ప్రముఖ యూట్యూబర్ ధ్రువ్ రాఠీ, సీజేపీ నేత అభిజీత్ దీప్కే సహా పలువురు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం సర్ ను రద్దు చేయాలని, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి తప్పుకోవాలని కాక్రోచ్ పార్టీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బెంగళూరు ఫ్రీడమ్ పార్క్ లో ప్రజా ట్రైబ్యునల్ నిర్వహిస్తున్నారు. ఇవాళ ఉదయం నుంచే పలువురు కార్యకర్తలు, పౌర సమాజ సంస్థలు బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌కు తరలిరావడంతో జనసమూహం పెరగడం ప్రారంభమైంది. మధ్యాహ్నం సుమారు 1 గంటకు, సీజేపీ నాయకులు దీప్కే, సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా సభా ప్రాంగణానికి చేరుకుని, రాఠీ, ప్రకాష్ రాజ్‌లతో కలిసి వేదికపై చేతులు పైకెత్తారు. జనం మోడీ వ్యతిరేక నినాదాలు, ఓటు దొంగ, ఓటు దొంగ నినాదాలు చేశారు. ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా దేశ మొత్తాన్ని అవమానించిందని నటుడు ప్రకాష్ రాజ్ ఆరోపించారు. ఈ దేశంలో ప్రభుత్వాన్ని ఎవరు ఏర్పాటు చేయాలో ప్రజలే నిర్ణయించేవారని, కానీ ఎస్ఐఆర్ తో ఎవరు ఓటు వేయాలో ప్రభుత్వమే నిర్ణయిస్తోందన్నారు. 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో 13 కోట్లకు పైగా ప్రజలు ఎన్నికలలో పాల్గొనకుండా మినహాయింపునకు గురైన సర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అందుకే పౌరుల హక్కులను పునరుద్ధరించడానికే ఈ ఆందోళన చేస్తున్నట్లు ప్రకాష్ రాజ్ తెలిపారు. ఈ నిరసన యొక్క లక్ష్యం కేవలం సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించడం మాత్రమే కాదని, ఆయన వెళ్తే, ఆయన స్థానంలో మరొకరు వస్తారన్నారు. ఎస్ఐఆర్ ను రద్దు చేయించడమే తమ లక్ష్యమన్నారు.మరోవైపు ఫ్రీడమ్ పార్క్‌లో జరుగుతున్న సీజేపీ నిరసన కార్యక్రమంలో ఎస్ఐఆర్ సమయంలో ముసాయిదా జాబితాల నుండి పేర్లు తొలగించిన పలువురు పాల్గొన్నారు. వారు ఒకే చోట నివసిస్తున్నప్పటికీ, వారిని స్థానమార్పిడి చెందినవారు, గైర్హాజరుగా గుర్తించారని సీజేపీ ఆరోపించింది. వాస్తవానికి, ఓటర్ల జాబితాల నుండి తొలగించబడిన ప్రజల అనుభవాలను వినిపించడానికే ఈ ప్రజా న్యాయస్థానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బతికి ఉన్నవారిని చనిపోయినవారిగా ప్రకటిస్తున్నారని, ఇదే ప్రజాస్వామ్య మరణం అని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆరోపించారు. తమను బొద్దింకలలా బతకాలని వారు కోరుకుంటున్నారు కాబట్టే బొద్దింకలని పిలుస్తున్నారని,, కానీ మనం బొద్దింకలాగే దృఢంగా ఉండాలన్నారు.

## విద్యార్థుల ఆందోళనలతో అట్టుడుకుతున్న ఫ్రాన్స్

**ప్యారిస్, అక్టోబరు 8:** పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు, టీచర్ల నియామకం వంటి డిమాండ్లతో విద్యార్థులు చేపట్టిన నిరసనలతో ఫ్రాన్స్ దద్దరిల్లుతోంది. 15 నుంచి 18 ఏళ్లలోపు విద్యార్థులు వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేస్తుండటంతో దేశం అట్టుడుకుతోంది. సోషల్ మీడియా వేదికగా టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్‌ల ద్వారా వేగంగా వ్యాపించిన ఈ ఉద్యమం.. ఇప్పుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది. గత నెల 21న పారిస్ సమీపంలోని ఓ పాఠశాలలో టీచర్ల కొరతను నిరసిస్తూ ఉపాధ్యాయులు చేపట్టిన ధర్నాకు విద్యార్థులు మద్దతు పలకడంతో ఈ ఉద్యమం మొదలైంది. ప్రభుత్వం తాత్కాలికంగా ఆ స్కూల్‌కు కొత్త టీచర్లను పంపినా, దేశంలోని ఇతర లీసే (హైస్కూల్) పాఠశాలల్లోని విద్యార్థులు కూడా తమ సమస్యలపై గళం విప్పారు. పాఠశాలల్లో సరైన వసతులు లేకపోవడం, తరగతి గదుల్లో పరిమితికి మించి విద్యార్థులు ఉండటం, టీచర్ల వేతనాల్లో కోత విధించాలన్న ప్రభుత్వ ఆలోచన వంటివి విద్యార్థుల ఆగ్రహానికి ఆజ్యం పోశాయి. ప్రశాంతంగా మొదలైన ఆందోళనలను అణచివేసేందుకు పోలీసులు ప్రయత్నించడంతో పరిస్థితి హింసాత్మకంగా మారింది. విద్యార్థులపై భాష్పవాయువు, రబ్బరు బుల్లెట్లు ప్రయోగించడం, లాఠీఛార్జ్ చేయడంతో వారు మరింత రెచ్చిపోయారు. పలుచోట్ల పాఠశాల భవనాలకు నిప్పుపెట్టారు.

ఇప్పటివరకు సుమారు 100 పాఠశాలలు ధ్వంసం కాగా, పోలీసులు దాదాపు 6,000 మందిని అరెస్ట్ చేశారు. వీరిలో 87 శాతం విద్యార్థులేనని ప్రభుత్వం పేర్కొంది. పోలీసుల గ్రెనేడ్ దాడిలో ఓ విద్యార్థి చేయి కోల్పోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ ఉద్యమంలోకి క్రమంగా వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాలు, రైతులు కూడా ప్రవేశించారు. ఇది విద్యార్థుల ఉద్యమం కాదని, ప్రతిపక్షాల రాజకీయ కుట్ర అని ప్రధాని సెబాస్టియన్ లీకార్ను ఆరోపించారు. మరోవైపు, ఈ హింసను అందరూ ఖండించాలని పిలుపునిస్తూనే, విద్యార్థుల డిమాండ్లను వినాలని అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది దేశంలో అధ్యక్ష ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ పరిణామాలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# సిఇసి, ఎన్నికల కమిషనర్ల నియామకంపై విచారణకు పిటిషన్

**న్యూఢిల్లీ, అక్టోబరు 8:** కేంద్ర ఎన్నికల సంఘంలో సీఈసీతో పాటు కమిషనర్ల నియామకాల కోసం గతంలో ఉన్న కమిటీలో మార్పులు చేస్తూ కేంద్రం పార్లమెంట్ లో 2023లో ఓ చట్టం చేసింది. దీని ప్రకారం అప్పటివరకూ ఉన్న ఎన్నికల కమిషనర్ల నియామకాల కమిటీలో ప్రధాని, విపక్ష నేతతో పాటు ఉన్న సుప్రీంకోర్టు ఛీఫ్ జస్టిస్ ను కాదని, ఆ స్థానంలో ప్రధాని సిఫార్సు చేసే కేంద్రమంత్రిని చేర్చేలా ఈ చట్టంలో మార్పు చేశారు. దీని ఆధారంగా జరిగిన సీఈసీ జ్ఞానేష్ కుమార్, కమిషనర్లు సుఖ్ బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషీల నియామకాలు రద్దుచేయాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఓవైపు ఎస్ఐఆర్ పై ఎన్నికల సంఘంలో కమిషనర్ల మధ్య విభేదాల ఆరోపణలు, మరోవైపు 2023 నాటి ఎన్నికల కమిషనర్ల నియామక చట్టంలో మార్పుల వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో ఈ పిటిషన్ సుప్రీంకోర్టులో దాఖలైంది. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిల నియామకాలన్నింటినీ సవాలు చేస్తూ, వారికి వ్యతిరేకంగా కో వారంటో రిట్ జారీ చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. వారి నియామకాలు 2023 సీఈసీ, ఈసీల చట్టం కింద నిర్దేశించిన విధానాన్ని ఉల్లంఘించాయని పిటిషనర్ వాదిస్తున్నారు. హడావిడిగా చేసిన ఈ నియామకాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ, ఎంపిక కమిటీ సభ్యులకు పూర్తి వివరాలను పంపిణీ చేసిన తర్వాత మాత్రమే నియామకాలు జరగాలని పేర్కొన్న సుప్రీంకోర్టు మార్చి 2024 ఉత్తర్వును పిటిషనర్ ప్రస్తావించారు. చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం, ప్రతి ఖాళీకి 5 పేర్లతో కూడిన ప్యానెల్‌ను ఏర్పాటు చేయాల్సి ఉండగా, అలా చేయలేదని పిటిషనర్ వాదిస్తున్నారు. ఈ అధికారులలో ఎవరూ గతంలో ఎన్నికలకు సంబంధించిన పనులను నిర్వహించలేదని, అలాగే వారు సెక్షన్ 5 కింద అర్హతా ప్రమాణాలను అందుకోలేదని కూడా పిటిషనర్ వాదిస్తున్నారు. దీంతో ఎన్నికల కమిషనర్ల నియామకాల చట్టం రాజ్యాంగ బద్ధతపై దాఖలైన పిటిషన్లపై విచారణ, తుది తీర్పును ఆలస్యం చేస్తున్న సుప్రీంకోర్టుకు ఇప్పుడు ఏదో ఒక నిర్ణయం తీసుకోక తప్పని పరిస్థితి ఎదురు కాబోతోంది.

# యుపిఐ ఎండిఆర్‌ఛార్జి వసూలు వాయిదా!

**ముంబయి, అక్టోబరు 8:** యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిగే భారీ విలువ గల లావాదేవీలపై ప్రతిపాదించిన రుసుము అమలును కొన్ని నెలల పాటు వాయిదా వేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. త్వరలో ప్రారంభం కానున్న పండగ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకునే అవకాశముందని తెలుస్తోంది. దీనిపై త్వరలోనే అధికారికంగా స్పష్టత వచ్చే అవకాశం ఉంది. రూ. 2,000 కంటే ఎక్కువ విలువైన మర్చంట్ యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం రుసుమును అక్టోబర్ 15 నుంచి అమలు చేయాలని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ప్రతిపాదించింది. ఈ గడువును వచ్చే ఏడాది జనవరి వరకు పొడిగించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ నిర్ణయం వల్ల పేమెంట్ కంపెనీలు తమ సాంకేతిక వ్యవస్థలను ఆధునికీకరించుకోవడానికి సమయం దొరకడమే కాకుండా, పండగ సీజన్‌లో వ్యాపారులపై అదనపు ఛార్జీల భారం పడకుండా ఉంటుందని అంచనా. ఆరేళ్లకు పైగా ఎలాంటి రుసుము లేకుండా కొనసాగుతున్న యూపీఐ చెల్లింపులపై ఈ ఛార్జీలను ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే ఇది వినియోగదారులకు ప్రత్యక్షంగా వర్తించదు. ఇది వ్యాపారుల వైపు నుంచి చెల్లించాల్సిన ఇంటర్‌ఛేంజ్ రుసుము. ప్రస్తుతం దేశంలో 50 కోట్లకు పైగా యూపీఐ వినియోగదారులు ఉన్నారు. ఆగస్టు 2026 నెలలోనే యూపీఐ ద్వారా రూ. 29.82 లక్షల కోట్ల విలువైన 2,451 కోట్ల లావాదేవీలు జరిగాయంటే దీని ప్రాధాన్యం అర్థం చేసుకోవచ్చు. అక్టోబర్ 15 నుంచి ఛార్జీల అమలు మొదలుపెడితే, అది దసరా, దీపావళి వంటి పండగల సమయంలో వినియోగదారుల కొనుగోళ్లపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ కీలక సమయంలో రిటైల్ చెల్లింపులకు అంతరాయం కలగకుండా చూడాలనేది ప్రధాన ఉద్దేశం. అదే సమయంలో, ఈ అదనపు గడువులో పేమెంట్ కంపెనీలు తమ సాంకేతిక వ్యవస్థలను మెరుగుపరుచుకోవడానికి, ఛార్జీల భారాన్ని వినియోగదారులపై పడకుండా ఎలా సర్దుబాటు చేయాలో ప్రణాళిక రచించుకోవడానికి సమయం లభిస్తుంది.

## తమిళనాట మళ్లీ రచ్చకెక్కిన భాషా వివాదం




**చెన్నై, అక్టోబరు 8:** తమిళనాడులో భాషా విధానంపై కొనసాగుతున్న రాజకీయ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు అందించే మందుల కవర్లపై తమిళం, ఇంగ్లిష్‌తో పాటు హిందీలోనూ మోతాదు, వినియోగానికి సంబంధించిన వివరాలు ముద్రించడంపై వివాదం చెలరేగింది. ఈ నేపథ్యంలో కోయంబత్తూరు, కరూర్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో మూడు భాషల్లో ముద్రించిన మందుల కవర్ల పంపిణీని నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. రాజకీయ విమర్శలు కరూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పంపిణీ చేసిన మందుల కవర్ల ఫొటోలను డీఎంకే నేత టి.ఆర్.బి. రాజా సోషల్ మీడియాలో షేర్ చేయడంతో ఈ అంశం రాజకీయంగా మరింత వేడెక్కింది. తమిళనాడు ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలో మూడు భాషల విధానాన్ని రహస్యంగా అమలు చేస్తున్నారంటూ ఆయన ఆరోపించారు. తమిళనాడులో విద్య, ప్రభుత్వ పరిపాలనలో తమిళం, ఇంగ్లిష్‌కు ప్రాధాన్యం ఇచ్చే రెండు భాషల విధానం కొనసాగుతున్న నేపథ్యంలో మందుల కవర్లపై హిందీ ముద్రణపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. తన ఎక్స్ పోస్టులో, తమిళనాడు ఆసుపత్రుల్లోనూ మూడు భాషల విధానం అమలవుతున్నట్లు కనిపిస్తోందని, మొదట కరూర్‌లో, ఇప్పుడు కోయంబత్తూరులోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోందని రాజా పేర్కొన్నారు. అయితే ఆసుపత్రి అధికారులు ఈ కవర్లు ఇటీవలే తీసుకొచ్చినవి కావని స్పష్టం చేశారు. వివాదానికి కారణమైన మందుల కవర్లు గత 18 నెలలుగా ఉపయోగిస్తున్నవేనని తెలిపారు. చింతామణి కోఆపరేటివ్ సొసైటీ ద్వారా స్పాన్సర్ చేసిన కవర్లను

# దక్షిణకొరియా మానవతా సాయం మాకేమీ అక్కర్లేదు!

## కిమ్‌సోదరి కిమ్‌యోజోంగ్ తిరస్కృతి



**సియోల్, అక్టోబరు 8:** దక్షిణ కొరియా ఇస్తామన్న మానవతా సాయాన్ని ఉత్తర కొరియా తిరస్కరించింది. ఇది తమ దేశానికి జరిగిన అవమానమని, రాజకీయ ప్రేరేపిత కవ్వింపు చర్య అని ఘాటుగా విమర్శించింది. ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ సోదరి, దేశంలో అత్యంత శక్తిమంతమైన నాయకురాలిగా భావించే కిమ్ యో జోంగ్ ఈ మేరకు అధికారిక మీడియా సంస్థ కేసీఎన్ఏ ద్వారా ఓ ప్రకటన విడుదల చేశారు. మానవతా కార్యక్రమంలో భాగంగా ప్యాంగ్యాంగ్‌లోని ఒక ఆసుపత్రికి అవసరమైన వైద్య పరికరాలను పంపాలని దక్షిణ కొరియా ప్రణాళిక సిద్ధం చేసింది. వ్యాధి నిర్ధారణ, శస్త్రచికిత్సలు, ఇతర చికిత్సలకు అవసరమైన 166 కేటగిరీలకు చెందిన 1,431 వైద్య వస్తువులను పంపేందుకు ఏర్పాట్లు చేసింది. దీనికోసం మే నెలలోనే ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి నుంచి ఆంక్షల మినహాయింపును కూడా పొందింది. ఈ సాయాన్ని కిమ్ యో జోంగ్ ఒక ప్రహసనం గా కొట్టిపారేశారు. ఇది మా దేశానికి అవమానం. మా జాతీయ చట్టాలను ఉల్లంఘించేలా రాజకీయంగా ప్రేరేపించిన కవ్వింపు చర్య. ఈ చర్య అత్యంత వికారమైనదని ఆమె తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గతంలో, సెప్టెంబర్ 21న జరిగిన మైన్ పేలుడు ఘటనలో ముగ్గురు దక్షిణ కొరియా సైనికులు గాయపడటానికి ఉత్తర కొరియానే కారణమని సియోల్ తేల్చడాన్ని కూడా ఆమె విమర్శించారు. "మైన్ పేలుడు అనే నాటకం ఫ్లాప్ అవ్వడంతో, ఇప్పుడు వైద్య పరికరాల సహాయం అనే మరో నాటకానికి తెరలేపారని ఎద్దేవా చేశారు. దక్షిణ కొరియాతో చర్చలు జరిపే ఉద్దేశం తమకు ఏమాత్రం లేదని ఆమె స్పష్టం చేశారు. రిపబ్లిక్ ఆఫ్ కొరియాతో మేం ఇచ్చిపుచ్చుకునేది ఏమీ లేదు. వారితో ముఖాముఖి భేటీ కావాల్సిన అవసరం కూడా లేదని ఆమె స్పష్టం చేశారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు పూర్తిగా క్షీణించిన నేపథ్యంలో ఈ సాయాన్ని ఉత్తర కొరియా స్వీకరిస్తుందా? అనే అనుమానాలు ముందు నుంచే ఉన్నాయి. తాజాగా ఉత్తర కొరియా తిరస్కరించడంతో, ఈ సాయాన్ని పంపే అవకాశాలు చాలా తక్కువని, ఐక్యరాజ్యసమితిని గడువు పొడిగింపు కోరతామని దక్షిణ కొరియా అధికారి ఒకరు తెలిపారు.

## నానాపాటేకర్ మృతికి పలువురి సంతాపం



**ముంబయి,అక్టోబరు 8:** భారతీయ చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. తన విలక్షణ నటనతో దశాబ్దాల పాటు ప్రేక్షకులను అలరించిన దిగ్గజ నటుడు నానా పటేకర్ ఆకస్మికంగా కన్నుమూశారు. గోవాలోని తన నివాసంలో గుండెపోటు రావడంతో ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ వార్త తెలియగానే బాలీవుడ్ సహా యావత్ భారత సినీ రంగం దిగ్భ్రాంతికి గురైంది. నానా పటేకర్ మృతి పట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, నానా పటేకర్ మృతిపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనకు సోషల్ మీడియా వేదికగా భావోద్వేగ నివాళి అర్పించారు. నటనలో కొత్త ఒరవడి సృష్టించిన కళాకారుడు. స్ఫూర్తిదాయకమైన నటుడు. మట్టి వాసన తెలిసిన సహజ నటుడు.ఎంతో ఉత్సాహభరితంగా, అదే సమయంలో కవితాత్మకంగా ఉండగలరు. భారతీయ సినిమాలో ఆయనొక అరుదైన ఆణిముత్యం. ఆయన నటన ఎప్పటికీ స్ఫూర్తినిస్తూనే ఉంటుంది. ఆయన నైపుణ్యం చిరకాలం గుర్తుండిపోతుంది. ఆయన కుటుంబ సభ్యులకు, ఆప్తులకు నా ప్రేమ, ప్రగాఢ సానుభూతి. ఓం శాంతి" అని అల్లు అర్జున్ తన పోస్టులో పేర్కొన్నారు. సంభాషణలు చెప్పడంలో తనదైన ప్రత్యేక శైలి, ఎలాంటి పాత్రలోనైనా జీవించే అద్భుతమైన నటనతో నానా పటేకర్ కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు.



## వారెవ్వా.. మోరుమియా!

### బంగ్లా బిచ్చగాడికి 21 మంది భార్యలు

**ఢాకా, అక్టోబరు 8:** ప్రస్తుత కాలంలో పెళ్లికాని ప్రసాద్‌లు పెరిగిపోతున్నారు. కారణాలేంటో తెలియదు గానీ బ్యాచ్‌లర్స్ ఎక్కువైపోతున్నారు. కర్ణాటకలో అయితే ఓ రైతు పెళ్లి కావడం లేదని ముఖ్యమంత్రి డీకే. శివకుమార్ సమక్షంలోనే మొరపెట్టుకున్నాడు. అలాంటిది ఓ బిచ్చగాడు ఒక్కరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 21 మందిని పెళ్లి చేసుకున్నాడు. ఇదెలా సాధ్యమైంది ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారిన ఈ స్టోరీ ఏంటో చదివేయండి. బంగ్లాదేశ్‌కు చెందిన మోరు మియా(35) అనే యువకుడు బిచ్చగాడు. ఓ పూరి గుడిసెలో ఉంటూ భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. అలాంటి వ్యక్తిని ఒక్కరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 21 మంది మహిళలు పెళ్లి చేసుకున్నారు. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. కనీసం భార్యల పేర్లు కూడా చెప్పలేని బిచ్చగాడిని అంత మంది ఎలా పెళ్లి చేసుకున్నారని నెటిజన్లను ఆశ్చర్యానికి గురవుతున్నారు. మోరు మియా బంగ్లాదేశ్ మీడియాతో మాట్లాడుతూ తాను ఎవరినీ పెళ్లి చేసుకోవాలని స్వయంగా కోరుకోలేదని చెప్పాడు. తనను పెళ్లి చేసుకోవాలంటూ మహిళలే తన దగ్గరకు వచ్చేవారని తెలిపాడు. ముఖ్యంగా తన కంటే వయసులో పెద్దవాళ్లు కూడా పెళ్లి ప్రతిపాదనలు చేసేవారని చెప్పాడు. తనను చూసి మహిళలకు ఏం నచ్చుతుందో తనకు తెలియదని వాపోయాడు.నాలో వాళ్లకు ఏం కనిపిస్తుందో నాకు తెలియదు. దానికి వాళ్లే సమాధానం చెప్పాలి. మహిళలే నా దగ్గరకు వచ్చి పెళ్లి చేసుకుందామని అడుగుతారని మీడియాతో చెప్పినట్లు కథనాలు పేర్కొన్నాయి.

# పెళ్లిలో విందు ఇస్తే లక్ష రూపాయలు జరిమానా

**విందుకు వచ్చినవారికి రూ.50వేలు ఫైన్**

**కర్ణాటకలో ఒక గ్రామం నిర్ణయం - నెట్టింట వైరల్**

**శివమొగ్గ, అక్టోబరు 8:** అప్పుల ఊబిలో కూరుకుపోవడానికి కారణమవుతున్న అనవసరపు ఖర్చులకు అడ్డుకట్ట వేసేందుకు ఓ గ్రామం తీసుకున్న నిర్ణయం అందరి ప్రశంసలు అందుకుంటోంది. పెళ్లి తర్వాత ఇచ్చే ఖరీదైన మాంసాహార విందును పూర్తిగా నిషేధిస్తూ గ్రామస్థులంతా ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ నిబంధనను ఉల్లంఘించి విందు ఏర్పాటు చేస్తే ఏకంగా లక్ష రూపాయలు, ఆ విందుకు హాజరైన వారికి 50 వేల రూపాయల జరిమానా విధించనున్నట్లు ప్రకటించారు. కర్ణాటకలోని శివమొగ్గ జిల్లా, శికారిపుర తాలూకా పరిధిలోని హారగి గ్రామంలో ఈ వినూత్న నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలోని సుమారు 360 కుటుంబాలు స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం వద్ద సమావేశమై ఈ కఠిన నిర్ణయాన్ని ఆమోదించాయి. దీని వెనుక బలమైన కారణాలను గ్రామస్తుడు కేబీ శేఖరాజ్ వివరించారు. గ్రామంలో తీవ్రమైన కరవు నెలకొంది. వరుసగా పంటలు నష్టపోవడంతో రైతులు, ఇతర కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లోనూ పెళ్లి తర్వాత బీగర ఊట ఇవ్వడం సామాజిక గౌరవంగా మారింది. స్థోమత లేని వారు కూడా అప్పులు చేసి మరీ ఈ విందులు ఏర్పాటు చేయాల్సి వస్తోంది. దీంతో చాలా కుటుంబాలు రుణాల భారంతో కుంగిపోతున్నాయని ఆయన తెలిపారు. ఈ సమస్యకు పరిష్కారంగానే గ్రామస్థులందరూ కలిసి ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే, పెళ్లి తంతు, ఇతర మతపరమైన కార్యక్రమాలను యథావిధిగా జరుపుకోవచ్చని స్పష్టం చేశారు. కేవలం దగ్గరి బంధువులు, కుటుంబ సభ్యులతో (1020 మంది) సాధారణ భోజనాలు చేసుకోవడానికి ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపారు. గ్రామం మొత్తాన్ని పిలిచి భారీ ఎత్తున విందులు ఇవ్వడంపైనే నిషేధం ఉంటుందని తేల్చిచెప్పారు. కర్ణాటకలోని పాత మైసూరు, మల్నాడ్ ప్రాంతాల్లో బీగర ఊట అనేది ఒక సంప్రదాయం. కాలక్రమేణా ఇది హోదా ప్రదర్శనగా మారడంతో, హారగి గ్రామస్థులు తీసుకున్న ఈ నిర్ణయం చర్చనీయాంశంగా మారింది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా ఈ నిర్ణయాన్ని మెచ్చుకుంటూ, ఇలాంటి ఆర్థిక క్రమశిక్షణ పాటించడం అవసరమని అభిప్రాయపడుతున్నారు.

# అమెరికాలో విదేశీ విద్యార్థులకు ఫీజు భారం!

**వాషింగ్టన్, అక్టోబరు 8:** అమెరికాలో చదువుకునే విదేశీ విద్యార్థులకు భారీ ఫీజు భారం పడే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. చదువు పూర్తయ్యాక అమెరికాలో ఉద్యోగ అనుభవం పొందేందుకు ఉన్న ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ) కార్యక్రమంలో తొలిసారి పాల్గొనే విద్యార్థులకు 70 వేల డాలర్ల ఫీజు విధించాలని అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం (డీహెచ్ఎస్) ప్రతిపాదించింది. తర్వాత మరోసారి ఓపీటీలో పాల్గొనే వారికి 30 వేల డాలర్ల ఫీజు విధించాలని సూచించింది. అయితే ఇవి కేవలం ప్రతిపాదనలు మాత్రమే. ప్రస్తుతం అమల్లోకి రాలేదు. అక్టోబర్ 8 నుంచి నవంబర్ 9 వరకు దీనిపై ప్రజల నుంచి అభిప్రాయాలను డీహెచ్ఎస్ స్వీకరించనుంది. ఎఫ్1 వీసాపై అమెరికాలో చదివే అర్హత కలిగిన విదేశీ విద్యార్థులకు చదువుకు సంబంధించిన ఉద్యోగం చేసేందుకు ఓపీటీ అవకాశం కల్పిస్తుంది. ముఖ్యంగా సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం (స్టెమ్) రంగాల్లో చదివే విద్యార్థులకు ఇది ఎంతో కీలకం. ప్రతిపాదిత విధానం ప్రకారం విద్యార్థి ఓపీటీకి దరఖాస్తు చేయడానికి ముందే సంబంధిత విద్యాసంస్థ ఫీజును చెల్లించాలి. విద్యాసంస్థ చెల్లింపు చేయకపోతే ఉద్యోగం చేసుకునేందుకు అమెరికా పౌరసత్వం, వలస సేవల విభాగం (యూఎస్‌సీఐఎస్) అనుమతిని మంజూరు చేయదు. వలస వ్యవస్థలో మోసాలు, దుర్వినియోగాన్ని అరికట్టేందుకుమార్పులు ప్రతిపాదించారు.

# సంక్షిప్త వార్తలు

## సౌదీ అరేబియాపై హౌతీల దాడులను ఖండించిన భారత్

**అబుదాబి, అక్టోబరు 8:** సౌదీ అరేబియా లక్ష్యంగా యెమెన్‌లోని హూతీ తిరుగుబాటుదారులు దాడులకు పాల్పడుతున్నారు. ఇటీవల సౌదీ రాజధాని రియాద్‌తో పాటు ఆభా నగరంలోని విమానాశ్రయాలపై డ్రోన్లు, క్షిపణులు ప్రయోగించి ప్రాణ నష్టం కలిగించారు. ఈ దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోవడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేసింది.

'రియాద్‌లోని కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానాశ్రయంతోపాటు అభాలోని ఎయిర్ పోర్టుపై జరిగిన దాడులను ఖండిస్తున్నామని పేర్కొంది.

## ఎనిమిది యుద్ధాలు పరిష్కరించా: ట్రంప్



**వాషింగ్టన్, అక్టోబరు 8:** నేనేమీ డబ్బా కొట్టుకోవట్లేదు. నిజాలే చెప్తున్నాను. ఇప్పటివరకు ఏకంగా ఎనిమిది యుద్ధాలను పరిష్కరించానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. నోబెల్ శాంతి బహుమతి (నోబెల్ పీస్ ప్రైజ్)కి అసలైన అర్హుడిని తానేనంటూ ఆయన మళ్ళీ డిమాండ్ తెరపైకి తెచ్చారు. వైట్ హౌస్ వేదికగా మాట్లాడిన ఆయన, ఏ ప్రెసిడెంట్ కూడా సాధించని రికార్డును తాను సాధించానని చెప్పారు. ఎనిమిది యుద్ధాలను శాంతియుతంగా ముగించానని చెప్పుకొచ్చిన ట్రంప్, త్వరలోనే మరో పెద్ద విజయం కూడా తన ఖాతాలో పడబోతోందని హింట్ ఇచ్చారు.

## పాక్‌కు ఐఎంఎఫ్ 1.21 బిలియన్ డాలర్ల సాయం

**ఇస్లామాబాద్, అక్టోబరు 8:** ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న పాకిస్థాన్‌కు అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) నుంచి భారీ ఊరట లభించింది. ఆ దేశానికి అదనంగా 1.21 బిలియన్ డాలర్ల నిధులు అందించేందుకు ఐఎంఎఫ్ సిబ్బంది స్థాయి ఒప్పందానికి వచ్చారు. అయితే ఈ నిధుల విడుదలకు ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ బోర్డు ఆమోదం అవసరం. ఈ ఒప్పందంలో పాకిస్థాన్ 37 నెలల ఎక్స్‌టెండెడ్ ఫండ్ ఫెసిలిటీ కార్యక్రమంలో నాలుగో సమీక్ష, 28 నెలల రెసిలియన్స్ అండ్ సస్టెయినబిలిటీ ఫెసిలిటీలో మూడో సమీక్ష ఉన్నాయి. బోర్డు ఆమోదం తర్వాత ఈఎఫ్ఎఫ్ కింద సుమారు 1 బిలియన్ డాలర్లు, ఆర్ఎస్ఎఫ్ కింద మరో 210 మిలియన్ డాలర్లు అందనున్నాయి.

## నాపైనా స్టింగ్ ఆపరేషన్లు జరిగాయి: కర్ణాటక సిఎం డికె



**బెంగళూరు, అక్టోబరు 8:** కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సంచలన ఆరోపణలు చేశారు. తాను సీఎం అయిన తర్వాత తనను స్టింగ్ ఆపరేషన్‌లో ఇరికించేందుకు ప్రయత్నం జరిగిందని చెప్పారు. దీనికి సంబంధించిన ఫొటోలు, పత్రాలు తన వద్ద ఉన్నాయని తెలిపారు. ఈ వ్యవహారం వెనుక ఎవరున్నారో తనకు తెలుసని అన్నారు. ఢిల్లీలో గురువారం మీడియాతో మాట్లాడిన శివకుమార్ ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన తర్వాత కొందరు వ్యక్తులు తనను కలిశారని చెప్పారు. వారెవరో, ఎవరి కోసం వచ్చారో తనకు తెలుసన్నారు. నన్ను ఇరికించేందుకు ప్రయత్నం చేశారు. నా వద్ద ఫొటోలు ఉన్నాయి. ఈ స్టింగ్ ఆపరేషన్ల వెనుక ఉన్న వ్యక్తి ఎవరో నాకు తెలుసు అని పేర్కొన్నారు.

# విదేశాల్లోనూ వెలుగుతున్న తెలంగాణ సంస్కృతి

### అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

### అధ్యయనం ద్వారా పార్లమెంటరీ విధానాలపై మరింత అవగాహన: మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



స్విట్జర్లాండ్‌లోని బెర్న్ సిటీలో స్విట్జర్లాండ్ తెలుగు అసోసియేషన్ వారి బతుకమ్మ ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్, అక్టోబరు 8, ప్రభాతవార్త:** విదేశాల్లో స్థిర పడినా మాతృ భాషను, మన సంస్కృతి, సాం ప్రదాయాలను మరువకుండా కాపాడుతుండడం అందరూ హర్షిం చదగ్గ విషయమని తెలంగాణ శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. చిన్నపిల్లలకు తెలుగు భాష నేర్పిస్తూ, బతుకమ్మ, బోనాలు వంటి ఉత్స వాలను నిర్వహిస్తూ భాషా సంస్కృతిని స్విట్జర్లాండ్‌లో ఇను మడింపజేయడం భావి తరాలకు ఆదర్శమన్నారు. కామన్వెల్త్ పార్ల మెంటరీ అసోసియేషన్ (సిపిఏ) ఆధ్వ ర్యంలో చేపట్టిన విదేశీ అధ్యయన పర్యటనలో భాగంగా తెలంగాణ శాసన వ్యవస్థ ప్రతినిధుల బృందం స్విట్జ ర్లాండ్‌లోని బెర్న్ సిటీలో పర్యటిం చింది. స్పీకర్ మిత్రులు బ్రహ్మానంద రెడ్డి బావిగడ్డ ఆహ్వానం మేరకు అక్కడి ప్రవాస తెలుగు భారతీయులతో భేటీ అయ్యారు. స్విట్జర్లాండ్ తెలుగు అసోసియేషన్ అధికారిక వెబ్‌సైట్‌ను స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ యేడాది బతుకమ్మ ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను కూడా ఆవిష్కరించారు. ఆ తర్వాత ప్రవాస తెలుగు సంఘం ప్రతి నిధులతోనూ మాట్లాడారు. స్విట్జర్లాండ్‌లో నిర్మించ బోయే శ్రీ వెంకటేశ్వర స్వామి టెంపుల్ గురించి స్పీకర్ బృందానికి స్విట్జర్లాండ్ తెలుగు సంఘం ప్రతినిధులు తెలియజేశారు. టెంపుల్ నిర్మాణానికి అవసరమయ్యే నిధులు, సహాయ సహకారాల గురించి తప్పకుండా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ప్రతినిధులతో మాట్లాడి.. అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని స్పీకర్ ప్రసాద్ కుమార్ హామీ ఇచ్చారు. బతుకమ్మ ఉత్సవం అనేది కేవలం పూల పండుగ మాత్రమే కాదని ఇలా ప్రతి యేటా స్విట్జర్లాండ్‌లో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నందుకు సంఘం ప్రతినిధులను స్పీకర్ బృందం అభినందించింది. ఈ నెల 24న స్విట్జర్లాండ్‌లో తెలంగాణ ప్రభుత్వ సహకారంతో నిర్వహించనున్న బతుకమ్మ ఉత్సవాలను విజయవంతం చేయాలని స్పీకర్ పిలుపునిచ్చారు. ఈ వేడుకలకు రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, శాసనసభ కార్యదర్శి రెండ్ల తిరుపతి, శాసనమండలి కార్యదర్శి నరసింహాచార్యులు, స్పీకర్ ఓఎస్డీ వెంకటేశం, స్విట్జ ర్లాండ్ తెలుగు సంఘం అధ్యక్షులు కిరణ్ వేదాంతం, కార్యదర్శి హరి ప్రసాద్, ఈసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు తెలంగాణ శాసన వ్యవస్థ ప్రతినిధుల బృందం స్విట్జర్లాండ్ పార్లమెంట్ భవనాన్ని సందర్శించింది. తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ 'ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభలు అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తా యన్నారు. ప్రపంచంలోని వివిధ దేశాల పార్లమెంటరీ వ్యవస్థలను అధ్యయనం చేయడం ద్వారా ప్రజాస్వామ్య విలువలు, శాసనసభల నిర్వహణ, పారదర్శకత, జవాబుదారీతనం వంటి అంశాలపై మరింత అవగాహన పెంపొందించుకునే అవకాశం ఉంటుందని' గుత్తా సుఖేందర్ రెడ్డి వివరించారు.

## బిసిల సామాజిక బహిష్కరణలకు చెక్

### కలెక్టరేట్‌లో న్యాయ విభాగం ఏర్పాటు

### బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్

**హైదరాబాద్, అక్టోబరు 8, ప్రభాతవార్త :** గ్రామ అభివృద్ధి కమిటీల (విడిసి)ల సామాజిక బహిష్కరణల బాధితులకు న్యాయ సహాయం అందించేందుకు బీసీ కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామ అభివృద్ధి కమిటీల సామాజిక బహిష్కరణ ఫిర్యాదులను నమోదు చేయడానికి, ప్రభావిత గ్రామాలలో పౌర హక్కుల పరిరక్షణను నిర్ధారించడానికి గాను అదనపు కలెక్టర్ నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ కమిటీలో రెవెన్యూ, పోలీసు అధికారులను సభ్యులుగా చేర్చి, పౌర హక్కులపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు, కలెక్టరేట్‌లో ఒక న్యాయ విభాగాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. బీసీల హక్కులను పరిరక్షించేందుకు చట్టాన్ని ప్రతిపాదిస్తూ కమిషన్ ఇప్పటికే ఒక తీర్మానాన్ని ఆమోదించి, దానిని రాష్ట్ర ప్రభుత్వానికి పంపించినట్లు చెప్పారు. ప్రతిపాదిత చట్టం త్వరలో అమలవుతుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. 2025 నుంచి గ్రామ అభివృద్ధి కమిటీల బహిష్కరణలకు సంబంధించి కమిషన్‌కు ఫిర్యాదులు అందుతున్నాయని ఆయన వెల్లడించారు. ఈ నేపథ్యంలో బాధితులకు న్యాయ సహాయం అందించేందుకు, పౌర హక్కులపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎంపి డికె అరుణ

## మంత్రులు, ఎమ్మెల్యేలు డ్రామాలు చేసినా నీళ్లు రాలేదు

### జూరాల రైతులపై కేసులు ఉపసంహరించుకోవాలి : ఎంపి డికె అరుణ

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు 8, ప్రభాతవార్త :** జూరాల నీటి విడుదల కోసం పోరాటం చేసిన రైతులతో పాటు, రైతుల పక్షాన పోరాడిన వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టడం సరికాదని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. ఇలాంటి బెదిరింపులకు రైతులు భయపడరని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే జూరాల నుంచి నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్‌లో మీడియాతో ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ. జూరాల లెఫ్ట్, రైట్ కెనాల్స్ ద్వారా పంటలకు వెంటనే నీటిని విడుదల చేయాలని కోరారు. పంటలు ఎండిపోకుండా రెండో తడి అవసరమని, జూరాలలో నీరు ఉన్నందున ఆలస్యం చేయకుండా విడుదల చేయాలన్నారు. కర్ణాటకకు వెళ్లి మంత్రులు, ఎమ్మెల్యేలు నీళ్లు తెస్తామని పెద్ద డ్రామా చేశారని, వారి మాటలన్నీ పచ్చి అబద్ధాలని డీకే అరుణ విమర్శించారు. వాయుగుండం కారణంగా కురిసిన వర్షాలతో నీరు వస్తే, కర్ణాటక నుంచి విడుదల చేసిన నీళ్లుగా ప్రజలను నమ్మించారని అన్నారు. కర్ణాటక నుంచి చుక్క నీరు కూడా రాలేదని విమర్శించారు. రైతులపై నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టడం ద్వారా డ్యామ్‌పై ధర్నాలు, నిరసనలు చేయకుండా, నీళ్లు అడగకుండా రైతులను భయపెట్టాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆమె విమర్శించారు. మీ తాటాకు చప్పుళ్లకు భయపడేవాళ్లు ఎవరూ లేరు అని అన్నారు. అరెస్టులకు తాము భయపడబోమని, బరాబర్ రైతుల పక్షాన పోరాటం చేస్తామని డీకే అరుణ స్పష్టం చేశారు. కేసులు పెట్టినా రైతులు చేతులు ముడుచుకుని ఇంట్లో కూర్చోరని, నీళ్ల కోసం పోరాడేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల తీవ్ర వివక్ష చూపుతోందని, రైతులకు పూర్తి అన్యాయం చేస్తోందని ఆమె ఆరోపించారు. రైతు బంధు అందడం లేదని, రుణమాఫీ అందరికీ చేయలేదని విమర్శించారు. అరకొరగా పథకాలు అమలు చేసి గొప్పలు చెప్పుకుంటున్నారని, అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారని ప్రజలందరికీ తెలుసని అన్నారు. ఇచ్చిన హామీలన్నింటినీ తుంగలో తొక్కి ప్రజలను మోసం చేశారని డీకే అరుణ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానికి రైతులపై ఏమాత్రం ప్రేమ ఉన్నా రైతులతో పాటు, రైతుల పక్షాన పోరాటం చేసిన వారిపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని, జూరాల నుంచి వెంటనే నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని ఎంపీ డీకే అరుణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## వ్యవసాయ యాంత్రీకరణకు సిద్ధం

### రూ.147 కోట్లు కేటాయింపు

### ఎస్సీ, ఎస్టీలకు 60, ఇతరులకు 40 శాతం సబ్సిడీ

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, అక్టోబరు 8, ప్రభాతవార్త:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాతో తెలంగాణలోని రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని అమలు చేస్తున్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. లబ్ధిదారుల ఎంపికపై కేంద్ర మార్గదర్శకాల కోసం ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో నిలిపివేసిన ఈ పథకాన్ని 2025-26 నుంచి పునరుద్ధరించి అమలు చేస్తున్నామన్నారు. దీని నిమిత్తం రూ.71 కోట్లు కేటాయించగా, రూ.63 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. రైతులకు మరింత విస్తృతంగా యాంత్రీకరణ ప్రయోజనాలు అందించేందుకు 2026-27లో రూ.147.99 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. కేంద్ర మార్గదర్శకాలు అందిన వెంటనే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టి, రైతులకు పథకం ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు అవసరమైన వ్యవసాయ పరికరాలను తమకు నచ్చిన ఎంప్యానెల్ చేసిన కంపెనీ వద్ద కొనుగోలు చేసుకునే వెసులుబాటు కల్పించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ లకు 60 శాతం, ఇతరులకు 40 శాతం సబ్సిడీ ఉంటుందని చెప్పారు. సబ్సిడీ రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కావడం వల్ల మధ్యవర్తుల ప్రమేయం తగ్గడంతో పాటు, పథకంలో పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రైతులకు అందించేందుకు ప్రస్తుతం 37 రకాల వ్యవసాయ పరికరాలను ఖరారు చేసినట్లు వెల్లడించారు. రైతుల అవసరాలు, సాగు విధానాల్లో వస్తున్న మార్పులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులకు ఉపయోగపడే కొత్త పరికరాలను చేర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలులో ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్లను భాగస్వాములను చేయాలని తెలిపారు. చిన్న, సన్నకారు రైతులు ప్రతి వ్యవసాయ పరికరాన్ని సొంతంగా కొనుగోలు చేయాల్సిన అవసరం లేకుండా, ఆర్గనైజేషన్ల ఆధ్వర్యంలో కస్టమ్ హైరింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి వాటిని అద్దెకు అందించే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని రైతులకు ఉపయోగకరంగా తీర్చిదిద్దేందుకు రైతుల అభిప్రాయాలను తీసుకోవాలని పేర్కొన్నారు. రైతుల నుంచి వచ్చే సూచనలను పరిగణనలోకి తీసుకుని, సాధ్యాసాధ్యాలను పరిశీలించి, రైతులకు గరిష్ఠ ప్రయోజనం కలిగేలా వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి తుది రూపం ఇవ్వాలని తెలిపారు.

# సమష్టి శక్తితోనే వ్యవసాయం బలోపేతం



గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి కిసాన్ మేళాలో మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయ, రైతు కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి

### రైతులు ఉత్పత్తి సంఘాలుగా ఏర్పడాలి

### ఎగుమతి స్థాయి నాణ్యత సాధించేలా ఉత్పత్తులు

### వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 8, ప్రభాతవార్త:** సమష్టి శక్తితోనే వ్యవసాయాన్ని బలోపేతం చేయవచ్చని రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం కోదండ రెడ్డి తెలిపారు. ఇందుకు రైతు ఉత్పతిదారుల సంఘాలుగా ఏర్పడాలని సూచించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి కిసాన్ మేళాకు కోదండరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి, స్వయం సమృద్ధి సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యతను పెంచి ఎగుమతి స్థాయి నాణ్యత సాధించేలా రైతులు కృషి చేయాలని తెలిపారు. రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడి సమిష్టి విధానంలో వ్యవసాయ ఉత్పత్తి, మార్కెటింగ్ కార్యకలాపాలను మరింత పటిష్టం చేసుకోవాలన్నారు. రైతులు సంఘటితంగా పనిచేయడం ద్వారా ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవడంతో పాటు, మార్కెటింగ్‌లో మెరుగైన అవకాశాలను పొందవచ్చని పేర్కొన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కల్పించడం, స్వామినాథన్ కమిషన్ సిఫారసులను క్షేత్రస్థాయిలో అమలు చేయడం వంటి రైతులకు సంబంధించిన కీలక అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు పంటల ఎంపిక, సాగు విధానాల్లో తగిన మార్పులు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు అందించే సాంకేతిక సూచనలు, సలహాలను పాటించాలని కోరారు. అధిక నీటి అవసరం ఉన్న వరికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగు చేయగల పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఎల్‌నినో పరిస్థితుల్లో రైతాంగానికి అవసరమైన సహకారాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్య ఇస్తుందని స్పష్టం చేశారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి నాణ్యతతో పాటు దిగుబడులను పెంచుకోవాలని, వ్యవసాయ శాఖ అధికారులు అందించే సాంకేతిక సూచనలు, సలహాలను పాటించాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే, కలెక్టరు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ,అనుబంధ శాఖల అధికారులు, రైతులు పలువురు పాల్గొన్నారు.

# కెటిపిఎస్ 1,600 మెగావాట్ల ప్లాంట్ సాధనే లక్ష్యం

### రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు చెక్

### సర్కార్‌పై ఒత్తిడి తెచ్చేందుకు సాధన సమితి కార్యాచరణ

**హైదరాబాద్, అక్టోబరు 8, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని పాల్వంచలో 2/800 మెగావాట్ల (1,600 మెగావాట్ల) సూపర్ క్రిటికల్ పవర్ ప్రాజెక్ట్ కోరుతూ కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కేటీపీఎస్) ఎనిమిదవ దశ సాధనా సమితి తన ప్రచారాన్ని ముమ్మరం చేయాలని నిర్ణయించింది. సూపర్ క్రిటికల్ పవర్ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు గాను తమ కార్యకలాపాలను ముమ్మరం చేసేందుకు సిద్ధమవుతోంది. తగ్గుతున్న ఉపాధి, పెరుగుతున్న రాష్ట్ర విద్యుత్ డిమాండ్‌ను కారణంగా చూపుతూ, ఈ బృందం నిరసనలు, అవగాహన ప్రచార కార్యక్రమాలను ప్రకటించింది. 1965-67 నుండి 1978 వరకు దశలవారీగా నిర్మించిన, మొత్తం 720 మెగావాట్ల సామర్థ్యం గల ఎనిమిది కాలం చెల్లిన పాత విద్యుత్ యూనిట్లను తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్కో కూల్చివేసింది. అప్పటి నుండి, నిలిపివేసిన ప్లాంట్ స్థానంలో ప్రభుత్వం ఒక కొత్త విద్యుత్ ప్లాంటును నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మరోపక్క రాష్ట్రంలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 2026-27లో సుమారు 19,529 మెగావాట్ల నుండి 2033-34 నాటికి 30,139 మెగావాట్లకు పెరుగుతుందని అంచనా. తత్ఫలితంగా, భవిష్యత్ అవసరాలను తీర్చడానికి విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని ముందుగానే పెంచాల్సిన అవసరం ఉంది. భారీ విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణానికి సాధారణంగా ఐదు నుంచి ఆరు సంవత్సరాలు పడుతుంది కాబట్టి, అనుమతులలో జాప్యాన్ని నివారించడం చాలా కీలకంగా మారింది.

**కెటిపిఎస్ ఏర్పాటుకై ప్రభుత్వంపై వత్తిడి: సాధన సమితి**

ఈ నేపథ్యంలో కేటీపీఎస్ ఎనిమిదవ దశ సాధన సమితి నాయకుడు జమ్ముల సీతారామరెడ్డి గురువారం మీడియాతో మాట్లాడుతూ కేటీపీఎస్ స్టేజ్83 విద్యుత్ ప్లాంటు కోసం ఒత్తిడి చేసేందుకు సమితి ఒక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసిందని వెల్లడించారు. ఈ నెలలో వరుస నిరసనలు, అవగాహన ప్రచారాలు చేపట్టడం, అధికారులకు, మంత్రులకు వినతిపత్రాలు సమర్పించడం, స్థానిక ప్రజాప్రతినిధులతో సంప్రదింపులు జరపడం, రిలే నిరాహార దీక్షలు చేపట్టడం, పాల్వంచ బంద్‌కు పిలుపునివ్వడం వంటివి చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు.



గురువారం లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్‌శుక్లాకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరేళ్ల శారద

## గవర్నర్‌తో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరేళ్ల శారద భేటీ

**హైదరాబాద్ (బేగంపేట), అక్టోబరు 8, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర మహిళా కమీషన్ చైర్‌పర్సన్ నేరేళ్ళ శారద గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇరవై నిమిషాలకు పైగా సాగిన వీరి భేటీలో మహిళా కమీషన్ పరంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ప్రగతి, మార్పు, చేర్పులకు సంబంధించి గవర్నర్‌కు వివరించారు. రెండవ సారి కమీషన్ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న నేపథ్యంలో కమిషన్ సేవలను మారుమూల గ్రామాలకు చేర వేసే అంశంలో తీసుకుంటున్న చర్యలను గవర్నర్‌కు ఆమె తెలిపారు. మహిళా కమిషన్ చర్యలను గవర్నర్ ప్రశంసించారని నేరేళ్ల శారద పేర్కొన్నారు.

# కాళేశ్వరం బ్యారేజీ పునరుద్ధరణ పెండింగ్ బిల్లుల చెల్లింపులో పీటముడి

### మూడు బ్యారేజీలకు కలిపి రూ 800 కోట్ల బకాయిలు

### బిల్లుల చెల్లింపునకు కాంట్రాక్టర్ల ఒత్తిడి

**హైదరాబాద్, అక్టోబరు 8, ప్రభాతవార్త:** కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ పనులకు మూడు బ్యారేజీల పెండింగ్ బిల్లులు సుమారు రూ.800 కోట్ల చెల్లించాలని కాంట్రాక్టర్లు ఒత్తిడి పెంచుతున్నారు. మేడిగడ్డ నిర్మాణ సంస్థ ఎల్అండ్టీకి సుమారు రూ.460 కోట్లు అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణ సంస్థలకు రూ.170 కోట్ల చొప్పున బిల్లులు చెల్లించాల్సి ఉంది. కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ పనులకు నీటిపారుదలశాఖ అంచనా వ్యయం ప్రాథమికంగా రూపొందించింది. మూడు బ్యారేజీల సుమారు రూ.2,500 కోట్లు వ్యయం అవుతుందని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. డిజైన్లు ఖరారైన తర్వాత వ్యయాలపై ఖచ్చితమైన అంచనా వెలువడే అవకాశం ఉంది. మూడు బ్యారేజీలకు ఆర్.సి.సి దయాఫ్రం వాల్ నిర్మించి సిసి బ్లాకులు కొట్టుకుపోయిన స్థానంలో స్టిల్లింగ్ బేసిన్ పెంచాలని ఒక నిర్ధారణకు వచ్చారు. మేడిగడ్డలో 60 మీటర్ల పెంచాల్సిన అవసరం ఉండటంతో మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణకు ఎక్కువ వ్యయం కానుంది. అన్నారం, సుందిళ్లలో 45 నుంచి 50 మీటర్ల వరకు స్టిల్లింగ్ బేసిన్ పెంచాల్సి ఉంటుంది. బ్యారేజీ నుంచి గేట్ల ద్వారా నీరు కిందకు పడి ఎగిరిపడే ప్రాంతంలో ఉన్న సిసి బ్లాకులు కొట్టుకుపోవడం వల్ల పునాది బలహీనపడటంతోపాటు బ్యారేజి నిర్మాణంపై ప్రతికూల ప్రభావం ఏర్పడింది. మేడిగడ్డ ఏడో బ్లాక్ పునరుద్ధరణ విషయంలో ఇంకా ఒక నిర్ణయానికి రావాల్సి ఉంది. బ్లాక్ మొత్తం తొలగించి మళ్లీ నిర్మించడమా? రాఫ్ట ను ఎత్తు పెంచి ఓవర్ ఫ్లోగా చేయడం వంటి ఆలోచనలులు చేస్తున్నారు, బ్లాక్ మొత్తం తొలగించి మళ్లీ నిర్మించాలంటే ఇంకా ఎక్కువ వ్యయం అవుతుంది. మరోవైపు పునరుద్ధరణ పనులు చేయడానికి ప్రత్యేకంగా కార్పొరేషన్ చేయాలని ప్రతిపాదన కూడా నీటిపారుదలశాఖ చేస్తున్నట్లు తెలిసింది. పునరుద్ధరణ పనికి పదినెలల గడువుపెట్టి ఏడాదిలో పూర్తి చేయాలనే నిబంధన విధించే అవకాశం ఉంది. మేడిగడ్డ బ్యారేజీ కుంగిన తర్వాత నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టికి పని పూర్తయినట్లు ఇచ్చిన ధ్రువీకరణ పత్రాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్ కొనసాగుతోంది. అన్నారంలో మాత్రం ఇది పూర్తయింది. ఈ నేపథ్యంలో నిర్మాణ సంస్థలతో అనుబంధ ఒప్పందాలు చేసుకోవడంపై ప్రభుత్వం దృష్టిసారించింది. ప్రత్యేక కార్యదర్శి కర్నల్ పరీక్షిత్ మెహ్రా కూడా నిర్మాణ సంస్థలతో సమావేశమై పునరుద్ధరణ అంశంపై ఒక కార్యాచరణ పై ఒక అవగాహనకు వచ్చినట్లు నీటిపారుదలశాఖ అధికారులు చర్చించుకొంటున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మూడు బ్యారేజీల పెండింగ్ బిల్లులు ఇవ్వకుండా పునరుద్ధరణ పనులు చేయడం కష్టమని కాంట్రాక్టర్లు చేతులు ఎత్తినట్లు సమాచారం. పునరుద్ధరణ అంచనా వ్యయాలు, పెండింగ్ బిల్లుల చెల్లింపులు మంత్రి మండలిలో చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ అన్నట్లు తెలిసింది. ఇదీ కాకుండా మూడు పంపుహౌస్ ఒ అండ్ ఎం బిల్లులు నాలుగేళ్లుగా విడుదల చేయడంలేదు.. పెండింగ్ ఓఅండ్ఎం బిల్లులు చెల్లించకుండా, నిర్మాణ సంస్థతో నిర్వహణపై ఒప్పందానికి రాకుండా కాలహరణ చేస్తూపోతే పంపుహౌస్‌లు కూడా మరమ్మతు గురై పనికిరాకుండా పోతాయని ఇంజినీర్లు అంటున్నారు.

## ఆందోళన చేస్తున్న రైతులపై కేసులు నమోదు

## అత్యంత హేయమైన చర్య

### మాజీమంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్,అక్టోబరు8,ప్రభాతవార్త:** జూరాల ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయాలని ఆందోళన చేసిన రైతులపై పోలీసులు కేసు నమోదు చేయడంపై బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. దీనిపై గురువారం తన ఎక్స్ ఖాతా వేదికగా ఆయన స్పందించారు. కళ్ల ముందే ఎండుతున్న పంటలకు జూరాల నీటిని విడుదల చేయాలని ఆందోళన బాట పట్టిన రైతులపై కేసులు నమోదు చేయడం అత్యంత హేయమైన చర్య. రేవంత్ పాలనలో రైతుల చేతులకు బేడీలు వేయడం, పోలీస్ స్టేషన్లలో కేసులు పెట్టడం పరిపాటిగా మారడం సిగ్గుచేటు, ఇంజనీర్లతో రైతులపై కేసులు పెట్టించడం కాంగ్రెస్ ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనం. మీ చేతగానితనం వల్ల ఈరోజు పంటలకు నీళ్లు అందక ఎండిపోతున్న దుస్థితి. కడుపు మండిన రైతన్న రోడ్డెక్కి నిలదీస్తే అక్రమ కేసులు బనాయిస్తారా?. పోలీసులను ప్రయోగించి భయభ్రాంతులకు గురి చేస్తారా? ఇదెక్కడి దుర్మార్గం? ఇదెక్కడి అన్యాయం?. కృష్ణాలో నీటి ప్రవాహాలు ఉన్నప్పుడు నీటిని లిఫ్ట్ చేయకుండా ఉద్దేశ్యపూర్వకంగా నిరక్ష్యం వహించింది మీరు, నీళ్లను ఒడిసి పట్టకుండా, విడిచిపెట్టి తెలంగాణకు జల ద్రోహం చేసింది మీరు. తప్పు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తే, శిక్ష రైతులు అనుభవించాలా?. సాగునీరు లేక, కరెంట్ లేక రైతులు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తుంటే.. పరిష్కరించాల్సింది పోయి.. కేసులు అక్రమ కేసులు పెడతారా?. ఇది ప్రజా పాలననా? లేక ప్రజా పీడననా?. రైతులపై పెట్టిన కేసులు వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. రైతు వ్యతిరేక చర్యలు ఇలాగే కొనసాగిస్తే, పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరిస్తున్నాం అని హరీశ్ రావు పేర్కొన్నారు.

# ఇహెచ్‌ఆర్‌ఎంఎస్ ద్వారా ప్రభుత్వోద్యోగుల పూర్తి డిజిటల్ డేటా నమోదు

### 15వ తేదీ నాటికి డిజిటల్ రికార్డుల ప్రక్రియ పూర్తిచేయాలి

### భవిష్యత్‌లో ప్రభుత్వ అనుమతులు, ఉత్తర్వులు పూర్తిగా డిజిటల్ విధానంలోనే : ప్రభుత్వ ప్రధానకార్యదర్శి సంజయ్‌జాజు

**హైదరాబాద్, అక్టోబరు 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మరింత పారదర్శక పరిపాలన అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఈ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఇ-హెచ్‌ఆర్ఎంఎస్)లో పూర్తి స్థాయిలో డిజిటలైజ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. ఇహెచ్‌ఆర్ఎంఎస్ అమలు, ప్రభుత్వ శాఖల్లో డిజిటల్ విధానాలపై అన్ని శాఖల ఉన్నతాధికారులతో సిఎస్ గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

ప్రభుత్వ ఉద్యోగుల నియామకం, సర్వీస్ రికార్డులు, జీతభత్యాలు, పదోన్నతులు, ఏసీఆర్‌లు, ఇతర ఉద్యోగ సేవలకు సంబంధించిన సమాచారాన్ని ఒకే డిజిటల్ వేదికపై అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలో సుమారు 3.48 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన డేటాను ఈ హెచ్‌ఆర్ఎంఎస్‌లో నమోదు చేస్తున్నట్లు అధికారులు సీఎస్‌కు వివరించారు. మొత్తం 38,710 కార్యాలయాలకు సంబంధించిన డేటాలో ఇప్పటికే సుమారు 93 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన ప్రక్రియను అక్టోబర్ 15 నాటికి పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. ప్రభుత్వ పరిపాలనలో పారదర్శకత, వేగం, సామర్థ్యాన్ని పెంచేందుకు భవిష్యత్‌లో అన్ని రకాల ప్రభుత్వ అనుమతులు, ఉత్తర్వులను సాధ్యమైనంత వరకు డిజిటల్ విధానంలోనే జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ సూచించారు. ఆర్థిక శాఖకు సంబంధించిన ఈసాంక్షన్ ఉత్తర్వులను పూర్తిగా డిజిటల్ విధానంలోకి తీసుకురావాలని ఆదేశించారు. అన్ని ఆర్థిక సేవలు, మంజూరులు, చెల్లింపులకు సంబంధించిన ప్రక్రియలను ఆన్‌లైన్‌లో నిర్వహించేలా వ్యవస్థలను సమన్వయం చేయాలని సూచించారు.

ప్రభుత్వ అభివృద్ధి పనులకు సంబంధించిన సాంకేతిక అనుమతుల ప్రక్రియను కూడా ఆన్‌లైన్‌లో నిర్వహించాలని సీఎస్ తెలిపారు. అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) నుంచి చీఫ్ ఇంజనీర్ (సిఈ) వరకు సాంకేతిక అనుమతుల ప్రక్రియను డిజిటల్ విధానంలో చేపట్టాలని సూచించారు. ఆదేవిధంగా, లబ్ధిదారులకు నేరుగా అందించే డిబిటి (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) మంజూరులను ఆధార్ ఆధారిత ధృవీకరణతో పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ హెచ్‌ఆర్ఎంఎస్‌తో పాటు అన్ని డిజిటల్ విధానాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రతి శాఖలో నోడల్ అధికారిని నియమించాలని సీఎస్ సూచించారు. డిజిటల్ వ్యవస్థల అమలులో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించేలా శాఖల వారీగా సమన్వయం ఉండాలని తెలిపారు.

ప్రభుత్వ సేవలను వేగవంతం చేయడంతో పాటు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు మరింత ఊతమిచ్చేలా డిజిటల్ విధానాలను సమర్థవంతంగా అమలు చేయాలని సీఎస్ అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో స్పెషల్ సిఎస్‌లు బి.ఎం.డి.ఎక్కా, సభ్యసాచి ఘోష్, ముఖ్య కార్యదర్శులు సందీప్ కుమార్ సుల్తానియా, అహ్మద్ నదీం, క్రిస్టినా చొంగ్తూ, శిఖాగోయల్, కార్యదర్శులు గౌరవ్ ఉప్పల్, లోకేష్ కుమార్, దివ్య దేవరాజన్, సురేంద్ర మోహన్, హరిచందన, ఇ. శ్రీధర్, సిక్తా పట్నాయక్, విజయేంద్ర, సమాచార, పౌరసంబంధాల స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గురువారం సచివాలయంలో డిజిటల్ విధానాలపై అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన సిఎస్ సంజయ్‌జాజు



అద్భుతమైన శారీరక సామర్థ్యాన్ని ప్రదర్శించి చిన్నారి సాధించిన బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ చూపుతున్న తల్లిదండ్రులు

## పుట్టిన 73 రోజులకే ప్రపంచ రికార్డు సాధించిన చిన్నారి

**టేక్మాల్, అక్టోబరు 8, ప్రభాతవార్త:** మెదక్ జిల్లా టేక్మాల్‌కు చెందిన చిన్నారి లింగంపల్లి సువిక్ష నందన అతి పిన్న వయసులోనే ప్రతిష్టాత్మక ప్రపంచ రికార్డును సొంతం చేసుకుంది. కేవలం 2 నెలల 13 రోజుల వయసులోనే అద్భుతమైన శారీరక సామర్థ్యాన్ని ప్రదర్శించి బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకుంది. సహాయంతో నిటారుగా ఉన్న స్థితిలో తలను పైకి ఎత్తడం, ఇరువైపులా సులువుగా తిప్పడం వంటి ప్రత్యేక ప్రతిభను చిన్నారి ప్రదర్శించింది. ఈ క్రమంలో పాప ప్రదర్శించిన అద్భుతమైన తల నియంత్రణ, మెడ బలం, సమతుల్యత వంటి అంశాలను రికార్డు నిర్వా హకులు నిశితంగా పరిశీలించి ఈ ఘనతను ధ్రువీకరించారు. దీంతో చిన్నారికి వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్, రికార్డ్ హోల్డర్ గుర్తింపు పత్రం, మెడల్, ప్రత్యేక అవార్డును ప్రదానం చేశారు. వ్యవసాయ విస్తరణ అధికారుల దంపతుల కుమార్తె సువిక్ష నందన తల్లిదండ్రులు లింగంపల్లి రజిత, జనార్దన్‌లు ఇద్దరూ తెలంగాణ వ్యవసాయ శాఖలో వ్యవసాయ విస్తరణ అధికారులుగా విధులు నిర్వహిస్తున్నారు. తల్లి రజిత టేక్మాల్ మండలం ఎలకుర్తి క్లస్టర్ అధికారిగా, తండ్రి జనార్దన్ నార్సింగి మండలం జప్తి శివనూరు క్లస్టర్ అధికారిగా పనిచేస్తున్నారు. వీరి స్వగ్రామం పాపన్నపేట మండలం చీకోడ్ కాగా, ఉద్యోగరీత్యా ప్రస్తుతం టేక్మాల్‌లో నివాస ముంటున్నారు. విధి నిర్వహణలో బిజీగా ఉంటూనే, పాప శారీరక ఎదుగు దలపై ప్రత్యేక శ్రద్ధపెట్టి ఈ విజయం సాధించేలా ప్రోత్సహించారు.

# పన్ను మోసాలపై కఠిన చర్యలు

## నిజాయితీ పన్నుదారులకు సులభతరం

### జీఎస్టీ సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి

**హైదరాబాద్, అక్టోబరు 8, ప్రభాతవార్త :** జీఎస్టీ సంస్కరణలను స్వాగతిస్తూనే రాష్ట్రాల ఆదాయ ప్రయోజనాలను పరిరక్షించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కేంద్రానిక విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ గురువారం జరిగిన 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతూ నిజాయితీగా పన్నులు చెల్లించే వారికి అనుసరణ ప్రక్రియను సరళీకరించడంతో పాటు, ఉద్దేశపూర్వకంగా పన్ను ఎగవేతకు పాల్పడే వారిపై జీరో టాలరెన్స్ విధానం కొనసాగాలని స్పష్టం చేశారు. రాష్ట్రాలు తమ స్వతంత్ర పన్ను విధించే అధికారంలో గణనీయమైన భాగాన్ని వదులుకున్నాయని గుర్తుచేశారు. తెలంగాణ సొంత పన్ను ఆదాయంలో జీఎస్టీ వాటా సుమారు 35 శాతం ఉందని తెలిపారు. ఈ ఆదాయంతోనే రాష్ట్రంలో పాఠశాలలు, ఆసుపత్రులు, సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలకు నిధులు సమకూరుతున్నాయని చెప్పారు. జీఎస్టీ ఆదాయంలో తగ్గుదల కేవలం లెక్కల అంశం కాదని, ప్రజలకు సేవలు అందించే రాష్ట్ర సామర్థ్యంపై నేరుగా ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. మోటార్ వాహనాలు, క్యాపిటల్ గూడ్స్, ఇన్‌పుట్ సర్వీసుల రీఫండ్‌లకు సంబంధించిన మార్పులు చేపట్టే ముందు వాటి పూర్తి ఆర్థిక ప్రభావాన్ని రాష్ట్రాలకు వివరించాలని చెప్పారు. మోటార్ వాహనాల విషయంలో కేంద్రం అందించిన అంచనాల ప్రకారం తెలంగాణకు ఏడాదికి సుమారు రూ.800 కోట్ల ఆదాయ ప్రభావం ఉంటుందని, రాష్ట్ర సొంత అంచనాల ప్రకారం ఈ నష్టం అంతకంటే రెట్టింపు కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. రిస్క్ లేని కేసుల్లో ఆటోమేటిక్‌గా రీఫండ్‌లు మంజూరు చేయడం ద్వారా నిజాయితీగల పన్నుదారులకు త్వరగా ప్రయోజనం అందుతుందని అన్నారు. అదే సమయంలో అధిక రిస్క్ ఉన్న కేసులపై పన్ను అధికారులు మరింత దృష్టి సారించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు.

జీఎస్టీ రిటర్నుల్లో అవసరమైన మార్పులు చేసి పన్ను వివరాల్లో తేడాలను తగ్గించాలని, నిజాయితీగల పన్నుదారులకు అనవసర నోటీసులు జారీ కాకుండా చూడాలని సూచించారు. జీఎస్టీ అమలులో స్పష్టత, ఏకరూపత కోసం తగిన సర్క్యులర్లు, వివరణలు జారీ చేయాలని కోరారు. పన్ను దారులకు అనుకూలమైన విధానాలను అమలు చేయడంతో పాటు జీఎస్టీ మోసాలు, నకిలీ రిజిస్ట్రేషన్లు, గుర్తింపు వివరాల దుర్వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వృద్ధులు, గృహిణులు, రోజువారీ కూలీలు, ఇతర అమాయకుల ఆధార్, పాన్ వివరాలను దుర్వినియోగం చేసి మోసపూరిత జీఎస్టీ రిజిస్ట్రేషన్లు సృష్టిస్తున్న ఘటనలను ప్రస్తావించారు. నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించడం, అక్రమంగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందడం లేదా ఇతరులకు బదిలీ చేయడం వంటి కార్యకలాపాలకు పాల్పడుతున్న వ్యక్తులు, వ్యవస్థీకృత ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. విధానాలను సరళీకరించడం పేరుతో వ్యవస్థీకృత పన్ను ఎగవేతపై అమలు చర్యలు బలహీనపడకూడదని స్పష్టం చేశారు. స్క్రాప్ రంగంలో అసంఘటిత, నగదు ఆధారిత వ్యవస్థ కారణంగా నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించడం, నకిలీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ బదిలీ చేయడం జరుగుతోందని చెప్పారు. స్క్రాప్ రంగం, గుర్తింపు దొంగతనం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి, పేద ప్రజల ప్రయోజనాలను కాపాడే కార్యాచరణను రూపొందించేందుకు జీఎస్టీ కౌన్సిల్ మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు. జీఎస్టీ కౌన్సిల్ పునర్వ్యవస్థీకరించే కమిటీల్లో తెలంగాణకు సభ్యత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. స్టాండింగ్ కమిటీ ఆఫ్ ఆఫీసర్స్‌లోనూ తెలంగాణకు ప్రాతినిధ్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

పన్ను ఎగవేతను అరికట్టడంతో పాటు, వ్యాపార కార్యకలాపాలకు అనవసరమైన ఇబ్బందులు కలగకుండా సమతుల్య విధానం అవసరమని పేర్కొన్నారు. తెలంగాణ వంటి ఎగుమతి రాష్ట్రాల సహకారాన్ని గుర్తించాలని చెప్పారు. నిజాయితీగల పన్నుదారులకు అనుసరణ ప్రక్రియను సులభతరం చేయడం, ఉద్దేశపూర్వక పన్ను మోసాలపై జీరో టాలరెన్స్ విధానాన్ని కొనసాగించడం, ఈ రెండూ సమాంతరంగా సాగాలన్నారు.



ఢిల్లీ గురువారం జరిగిన 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న తెలంగాణ డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

## 14న రామగుండంలో బిఆర్ఎస్ భారీ బహిరంగ సభ

**హైదరాబాద్,అక్టోబరు8,ప్రభాతవార్త:** సింగరేణి బొగ్గు గని కార్మికుల సమస్యలపై పోరాటం చేసేందుకు ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని.. అందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈనెల 14వ తేదీన సాయంత్రం 5 గంటలకు రామగుండంలో 'సింగరేణి కార్మిక గర్జన' పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. ఈ విషయాన్ని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఈ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని పేర్కొన్నారు.గురువారం తెలంగాణ భవన్‌లో సింగరేణి ప్రాంతాలకు చెందిన పార్టీ నేతలు, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) ప్రతినిధులతో హరీశ్‌రావు సమావేశమై మాట్లాడారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి.. సంస్థ ఆర్థిక పరిస్థితి, కార్మికుల సమస్యలు, థర్మల్ విద్యుత్ ఉత్పత్తి తదితర అంశాలపై వారితో హరీశ్ రావు చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన.. కార్మికుల డిమాండ్ల సాధన కోసం ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమవుతున్నట్లు ప్రకటించారు. సింగరేణి సంస్థ లాభాల్లో కార్మికులకు రావాల్సిన వాటాను పూర్తిగా చెల్లించాలని హరీశ్‌రావు ప్రధానంగా డిమాండ్ చేశారు. అలాగే అర్హులైన కార్మిక కుటుంబ సభ్యులకు డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించాలని, క్రమం తప్పకుండా మెడికల్ బోర్డులు నిర్వహించాలని కోరారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను వెంటనే నిర్వహించాలని.. సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని కూడా హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి తగ్గిందంటూ హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. తన వాదనకు సంబంధించి 202324లో 70 మిలియన్ టన్నులుగా ఉన్న బొగ్గు ఉత్పత్తి.. 2025 26లో 58 మిలియన్ టన్నులకు తగ్గిందని పేర్కొన్నారు. పరిపాలనా నిర్ణయాలు, టెండర్లు, కాంట్రాక్టు వ్యవహారాల కారణంగానే ఉత్పత్తి తగ్గిందని ఆయన ఆరోపించారు. సింగరేణి కార్మికుల ఇళ్ల హక్కుల అంశాన్ని కూడా ఈ సందర్భంగా హరీశ్‌రావు ప్రస్తావించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 76 కింద మిగిలిన అర్హులైన కార్మికులకు సేల్ డీడ్‌ల ద్వారా హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే సింగరేణి సంస్థకు సంబంధించిన ప్రైవేటీకరణ చర్యలను వ్యతిరేకిస్తామని తెలిపారు. రామగుండంలో జరగనున్న ఈ సభ ద్వారా సింగరేణి కార్మికుల సమస్యలను రాష్ట్రస్థాయిలో మరింతగా ప్రస్తావించాలని బీఆర్ఎస్ భావిస్తోంది.



విలేకరులతో మాట్లాడుతున్న కార్మిక శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్‌వెంకటస్వామి

## ఎర్రవెల్లి కెసిఆర్ ఫాంహౌస్ సమీపంలో 42 ఎకరాల భూమి మిస్సింగ్ నిగ్గు తెలుస్తాం

### కార్మిక శాఖ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్‌వెంకటస్వామి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** ఉద్యమంలో అందరూ స్వంతంగా డబ్బులు ఖర్చుపెట్టుకొని తెలంగాణ కోసం పోరాటం చేస్తే ఉద్యమంలో కెసిఆర్ మాత్రం ఆస్తులను పెంచుకున్నారని రాష్ట్ర కార్మికశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉద్యమ సమయంలో 22 ఎకరాలు ఉన్న ఫాంహౌస్ ఇప్పుడు వందల ఎకరాలకు విస్తరించిందన్నారు. ఎర్రవెల్లి 325 సర్వే నంబరులో 42 ఎకరాల భూమి తక్కువ వస్తుందని అది ఎక్కడ ఉందని సిఎం ఆదేశాలతో అధికారులు నిగ్గుతేల్చే పనిలో ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ డబ్బులు ఖర్చు చేసిన పాండురంగసాగర్ నుంచి కెసిఆర్ ఫామ్ హౌస్‌కు నీరు ఎలా పోతుందని ప్రశ్నించారు. పాండురంగసాగర్ నుంచి కెసిఆర్ ఫాం హౌస్‌కు నీరు ఎలా వెళ్తుందో విచారణ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కెసిఆర్ కుటుంబ ఆస్తులు ఎలా పెరిగాయని ప్రజలు చర్చించుకుంటున్నారని తెలిపారు. నోటీసులు ఇవ్వడంలో తప్పు లేదని నోటీసులు ఇచ్చినప్పుడే సరైన సమాధానం లభిస్తుందన్నారు. ఎర్రవెల్లిలోని కెసిఆర్ ఫాం హౌస్ సమీపంలో 325 సర్వే నంబరులో 42 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు తెలుస్తుందని ఆ భూమిలో తెలంగాణ అమరవీరుల కుటుంబాల కాలనీ నిర్మించడానికి సిఎం చర్యలు తీసుకుంటారని తెలిపారు. సింగరేణి సంస్థలను బిఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా నాశనం చేసిందన్నారు. బిఆర్ఎస్ హయాంలో కొత్త గనులు ఎందుకు రాలేదో హరీష్‌రావు సమాధానం చెప్పాలన్నారు. ఆర్టీసి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ అనుబంధ సంఘాన్ని గెలిపించాలన్నారు. సమావేశంలో పద్మశాలి కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం. పార్టీ నాయకులు హరికృష్ణ, ఎం.డి.ఇమామ్(అత్తు) తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ గ్లోబల్ సమ్మిట్.. భారీస్థాయిలో రక్షా ఎక్స్‌పో

### డిసెంబరు 9న ఎయిర్ షో నిర్వహణ, రక్షణ, ఏరోస్పేస్ రంగాల అభివృద్ధికి ఎక్స్‌పో దోహదం

### రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు

**హైదరాబాద్,అక్టోబరు8,ప్రభాతవార్త:** తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026లో భాగంగా డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో భారీ స్థాయిలో రక్షా ఎక్స్‌పో నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. డిసెంబర్ 9న ఎయిర్ షోను కూడా నిర్వహించ నున్నట్లు వెల్లడించారు.

రక్షా ఎక్స్‌పో నిర్వహణ ఏర్పాట్లపై డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గురువారం సీఎస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్స్‌పోకు సంబంధించిన ఏర్పాట్లు, పాల్గొనే సంస్థలు, ప్రచార కార్యక్రమాలు, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.

రక్షణ, వైమానిక రంగాలకు సంబంధించిన సుమారు 30 శాతం పరిశ్రమలు హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్నాయని సీఎస్ తెలిపారు. తెలంగాణలో డిఫెన్స్, ఏరోస్పేస్ రంగాల అభివృద్ధికి, పెట్టుబడులను ఆకర్షించేందుకు రక్షా ఎక్స్‌పో కీలక వేదికగా నిలుస్తుందని అన్నారు. జాతీయ, అంతర్జాతీయ సంస్థలకు ఆహ్వానం తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026లో భాగంగా నిర్వహిస్తున్న ఈ రక్షా ఎక్స్‌పోలో పాల్గొనేందుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోని ప్రముఖ రక్షణ, ఆయుధ తయారీ సంస్థలు, డిఫెన్స్, ఏరోస్పేస్ కంపెనీలను ఆహ్వానిస్తున్నట్లు సీఎస్ తెలిపారు.

ఎక్స్‌పోకు విస్తృత ప్రచారం కల్పించేందుకు అక్టోబర్ 24న హైదరాబాద్‌లో, ఈనెల 29న న్యూఢిల్లీలో రోడ్ షోలను నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల విస్తరణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని సీఎస్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో ఎయిర్‌ఫీల్డ్ స్ట్రిప్ ఏర్పాటు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు.ఫిక్కీ, అసోచామ్, ఎస్ఐడీఎం, ఎంఎస్ఎంఈలతో పాటు డిఫెన్స్, ఏరోస్పేస్ రంగాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలను ఎక్స్‌పోలో భాగస్వామ్యం చేయాలని సీఎస్ సూచించారు. హెచ్ఏఎల్, బీఈఎల్, బీడీఎల్ తదితర ప్రముఖ సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శించడంతో పాటు మార్కెటింగ్, బయ్యర్-సెల్లర్ సమావేశాలు, బిజినెస్ ఇంటరాక్షన్స్, ఎంఒయూలు, స్టార్టప్‌లకు అవకాశాలు, సెమినార్లు తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా పోలీసు, పారామిలటరీ దళాల ఆధునికీకరణ కొనసాగుతున్న నేపథ్యంలో అన్ని రాష్ట్రాల డీజీపీలను కూడా రక్షా ఎక్స్‌పోకు ఆహ్వానించాలని సీఎస్ సూచించారు. రక్షా ఎక్స్‌పోపై హైదరాబాద్‌లోని ప్రముఖ ప్రాంతాల్లో స్టాండీలను ఏర్పాటు చేయాలని, షార్ట్ ఫిలిమ్స్ ప్రదర్శించాలని సీఎస్ సూచించారు. బ్రోచర్లు, సోషల్ మీడియా తదితర మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, పంచాయతీరాజ్, సెర్ప్ కమిషనర్ దివ్య, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖ చారిత్రక నవలా రచయిత డా. ముదిగొండ శివప్రసాద్ కన్నుమూత



**హైదరాబాద్,అక్టోబరు8,ప్రభాతవార్త:** ప్రముఖ తెలుగు చారిత్రక నవలా రచయిత, చారిత్రక నవలా చక్రవర్తిగా ప్రసిద్ధులైన డా. ముదిగొండ శివ ప్రసాద్ (86) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి కన్నుమూశారు. 83 పుస్త కాలు అందులో 20కిపైగా చారిత్రక నవలలు రాశారు (ఉదాహరణకు: శ్రీపదార్చన, ఆవాహన, పట్టాభి, రెసిడెన్సీ, తంజావూరు విజయం, రోహణం మొదలైనవి). సికిందరాబాద్ వెస్లీ హై స్కూల్లో ఉపాధ్యాయుడిగా, అనంతరం ఉస్మా నియా విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడిగా పనిచేశారు. ప్రకాశం జిల్లాలో 1940, డిసెంబరు 23న జన్మించిన ఆయన హైదరాబాద్‌కు వచ్చి ఉన్నత విద్యను అభ్యసించారు. తెలుగు శాఖలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహించారు. చిన్న వయసులో స్వాతంత్రసమర ఉద్యమంలో కూడా పాల్గొన్నారు. ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణలో పర్యటించిన ఆయన అనేక చారిత్రక నవలు రాశారు. చారిత్రక నవలా చక్రవర్తిగా ప్రసిద్ధిగాంచారు.

## దసరాకు సొంతూళ్లకు వెళ్లే వారికి తీపికబురు

### తెలుగు రాష్ట్రాల మధ్య ప్రత్యేక రైళ్లు, నేటి నుంచి ప్రారంభం

హైదరాబాద్,అక్టోబరు8,ప్రభాతవార్త: దసరా, దీపావళి పండగల నేపథ్యంలో రైళ్లలో పెరగనున్న ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. తెలుగు రాష్ట్రాల మధ్య భారీగా రాకపోకలు సాగించే ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని పలు ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకురానుంది. పండగల సమయంలో హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉండటంతో అదనపు సర్వీసులను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా చర్లపల్లి నుంచి శ్రీకాకుళం మధ్య ప్రత్యేక రైళ్లను నడపనున్నారు. ఈనెల 13, 20, 27 తేదీల్లో, అలాగే నవంబర్ 3, 10, 17, 24 తేదీల్లో ఈ ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయి. పండగల సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే వారు, తిరిగి హైదరాబాద్ నగరానికి చేరుకునే ప్రయాణికులకు ఈ సర్వీసులు ఉపయోగపడనున్నాయి. ముఖ్యంగా సాధారణ రైళ్లలో వెయిటింగ్ లిస్ట్ పెరిగే సమయంలో అదనపు సర్వీసులు కొంత మేర రద్దీని తగ్గించే అవకాశం ఉంది. అదే విధంగా సికింద్రాబాద్-కాకినాడ మధ్య కూడా ప్రత్యేక రైలు సర్వీసును నడపనున్నారు. శుక్రవారం నుంచి ఈ ప్రత్యేక రైలు రాకపోకలు సాగించనుంది. దీంతో హైదరాబాద్ నుంచి కోస్తాంధ్ర ప్రాంతానికి వెళ్లే ప్రయాణికులకు అదనపు రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది. పండగల సమయంలో సొంతూర్లకు వెళ్లే వారి సంఖ్య పెరగడంతో సాధారణ సర్వీసులపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

## గ్లోబల్ సమన్వయంతో సైబర్ మోసాలకు చెక్

### డిజిటల్ చెల్లింపుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### మొబైల్ కాంగ్రెస్ సమావేశంలో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, అక్టోబరు 8:** భారతదేశంలో డిజిటల్ విప్లవం మరింత వేగంగా కొనసాగుతున్న నేపథ్యంలో సైబర్ మోసాలను అరికట్టేందుకు ప్రపంచవ్యాప్త సమన్వయం అవసరమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. సైబర్ నేరాల నుంచి ప్రజలను రక్షించేందుకు అంతర్జాతీయ స్థాయిలో ఒక గ్లోబల్ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. న్యూఢిల్లీలోని యశోభూమిలో జరుగుతున్న ఇండియా మొబైల్ కాంగ్రెస్ 2026 పదో ఎడిషన్‌ను గురువారం ప్రధాని మోడీ ప్రారంభించారు. నేటి నుంచి 10 వరకు నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ టెక్నాలజీ కార్యక్రమంలో టెలికాం, ఐటీ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొంటున్నారు. 6జి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్, డిజిటల్ ఆవిష్కరణలు, సైబర్ భద్రత వంటి అంశాలకు ఈ ఏడాది ప్రాధాన్యం ఇచ్చారు. డిజిటల్ సేవల వినియోగం పెరుగుతున్న కొద్దీ సైబర్ మోసాల ప్రమాదం కూడా పెరుగుతోందని ప్రధాని మోడీ ఆందోళన వ్యక్తం చేశారు. ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, డిజిటల్ చెల్లింపుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాల నుంచి ప్రజలను రక్షించేందుకు దేశాల మధ్య సమన్వయం అవసరమని, ఇందుకోసం గ్లోబల్ ఫ్రేమ్‌వర్క్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. బిలీతితో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న టెలికాం ఆపరేటర్లు, సంబంధిత భాగస్వాములు ఈ ప్రయత్నంలో కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ విధమైన అంతర్జాతీయ వ్యవస్థ డిజిటల్ మౌలిక సదుపాయాలను మరింత పటిష్ఠం చేయడంతో పాటు సైబర్ నేరాల నియంత్రణకు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. భారత్‌లో డిజిటల్ విప్లవం సాధించిన పురోగతిని ప్రధాని మోడీ తన ప్రసంగంలో ప్రస్తావించారు. 2022లో ఇండియా మొబైల్ కాంగ్రెస్ వేదిక నుంచే 5జి సేవలను ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. గత నాలుగేళ్లలో దేశంలోని అన్ని జిల్లాలకు 5జి నెట్‌వర్క్ విస్తరించిందని, ప్రస్తుతం భారత్‌లో 5.5 లక్షలకు పైగా 5జి బేస్ స్టేషన్లు ఉన్నాయని తెలిపారు. తదుపరి తరం టెలికాం సాంకేతికత అయిన 6జి అభివృద్ధిపైనా భారత్ దృష్టి సారించిందని పేర్కొన్నారు. 5జి సేవల విస్తరణతో వేగవంతమైన ఇంటర్నెట్, డిజిటల్ సేవలు, ఆన్‌లైన్ వ్యాపారాలు, సాంకేతిక



ఆధారిత పరిశ్రమలకు మరింత అవకాశాలు ఏర్పడుతున్నాయని వివరించారు. 2020లో కరోనా మహమ్మారి సమయంలో డిజిటల్ టెక్నాలజీ కీలక పాత్ర పోషించిందని ప్రధాని మోడీ గుర్తుచేశారు. భౌతికంగా దూరంగా ఉన్నప్పటికీ ప్రజలు తమ కుటుంబ సభ్యులతో అనుసంధానమై ఉండటానికి డిజిటల్ సేవలు ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల అమలులోనూ డిజిటల్ వ్యవస్థలు కీలకంగా మారాయని తెలిపారు. రైతులకు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందించడంలో డిజిటల్ మౌలిక సదుపాయాలు ఉపయోగపడుతున్నాయని వివరించారు. ఇండియా మొబైల్ కాంగ్రెస్‌ను కేవలం టెలికాం ప్రదర్శనకు మాత్రమే పరిమితం చేయకుండా, పరిశోధన, ఆవిష్కరణలు, తయారీ రంగాలను అనుసంధానించే అంతర్జాతీయ వేదికగా తీర్చిదిద్దాలని ప్రధాని మోడీ అన్నారు. ప్రపంచ టెక్నాలజీ రంగంలోని సంస్థలు, పరిశోధకులు, తయారీదారులు, స్టార్టప్‌లు ఒకే వేదికపైకి రావడం ద్వారా కొత్త ఆవిష్కరణలకు అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. భారత్‌లో 5జి విస్తరణ, 6జి పరిశోధన, ఎఐ వినియోగం, గేమింగ్ రంగ అభివృద్ధి వంటి అంశాలు డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు కొత్త అవకాశాలను తెస్తున్నాయి. అదే సమయంలో సైబర్ మోసాలు, డిజిటల్ భద్రత వంటి సవాళ్లను కూడా సమర్థంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో సైబర్ మోసాల నివారణకు గ్లోబల్ ఫ్రేమ్‌వర్క్ ఏర్పాటు చేయాలన్న ప్రధాని మోడీ పిలుపు ఇండియా మొబైల్ కాంగ్రెస్‌లో ప్రధాన చర్చనీయాంశంగా నిలిచింది.



గురువారం హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో ఆర్చరీ ప్రీమియర్ లీగ్ రెండో సీజన్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న మంత్రి వాకిటి శ్రీహరి

## విలువిద్యకు భారతీయ సంస్కృతిలో విశిష్ట స్థానం

### ఆర్చరీ ప్రీమియర్ లీగ్ ప్రారంభోత్సవంలో క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్, అక్టోబరు 8,ప్రభాతవార్త:** విలువిద్యకు భారతీయ సంస్కృతిలో విశిష్ట స్థానం ఉందని రాష్ట్ర క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో ఆర్చరీ ప్రీమియర్ లీగ్ రెండో సీజన్‌ను ఆయన ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ఆర్చరీ ప్రీమియర్ లీగ్ కార్యక్రమానికి హాజరు కావడం గర్వకారణంగా ఉందన్నారు. భారతీయ సంస్కృతి, ఇతిహాసాల్లో విలువిద్యకు ఎంతో ప్రాధాన్యత ఉందని వరామాయణం, మహాభారత కాలం నుంచే విలువిద్యకు విశిష్ట స్థానం ఉందన్నారు. ఏకలవ్యుడు, అర్జునుడు, ద్రోణా చార్యుడు వంటి మహా నీయులు విలువిద్యలో ఆరితేరిన వారని గుర్తుచేశారు. విలువిద్య వంటి క్రీడలను ప్రోత్సహించడం ద్వారా యువతలో ఏకాగ్రత, క్రమశిక్షణ, పట్టుదల పెంపొందుతాయని మంత్రి అన్నారు. ఆర్చరీ ప్రీమియర్ లీగ్ వంటి ప్రతి ష్టాత్మక పోటీలు దేశంలో విలువిద్యకు మరింత ప్రాచుర్యం తీసుకురావడంతో పాటు, యువ క్రీడాకారులకు స్ఫూర్తినిస్తాయని శ్రీహరి అన్నారు. జపాన్‌లో జరిగిన ఏషియన్ గేమ్స్‌లో ఆర్చరీలో గోల్డ్‌మెడల్ సాధించిన చికితారావుతో పాటు వివిధదేశాలకు చెందిన ఆర్చరీ క్రీడాకారులను ఘనంగా సన్మానించారు.

**రాజ్‌పుతానా రాయల్స్ శుభారంభం**

ఆర్చరీ ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) రెండోసీజన్‌లో డిఫెండింగ్ చాంపియన్ రాజ్‌పుతానా రాయల్స్ శుభారంభం చేసింది.ఈ మెగా లీగ్ తొలిమ్యాచ్‌లో రాజ్‌పుతానా రాయల్స్ 53 తేడాతో పృథ్వీరాజ్ యోధాస్‌ను ఓడించింది. చివరివరకు అత్యంత ఉత్కంఠగా సాగిన ఈ పోరులో ఒత్తిడిని జయించిన రాజ్‌పుతానా విజయాన్ని అందుకుంది. కాంపౌండ్ ఆర్చర్లు ఓజస్ దియోతలే, ప్రపంచ నంబర్‌వన్ ఎల్లా గిబ్సన్ ఆరంభంలోనే వరసగా 10పాయింట్ల బాణాలు విసిరి రాజ్‌పుతానాకు మెరుగైన ఆధిక్యాన్ని అందించారు. టోక్యో ఒలింపిక్ విజేత మేటే గజోజ్, భారత ఆర్చర్ అంకితా భకత్ సరైన సమ యంలో పాయింట్లు సాధించి జట్టు విజయంలో భాగమయ్యారు. పృథ్వీరాజ్ యోధాస్ కెప్టెన్ అభిషేక్‌వర్మ ఆరంభంలో ప్రతిఘటించినా, మెక్సికో ఆర్చర్ మథియాస్‌గ్రాండే ఆఖర్లో పాయింట్లు చేజార్చుకోవడం ఆ జట్టును దెబ్బతీసింది.

## ఓటుచోరీ ఆరోపణలకు అరెస్టులు సమాధానం కావు

### ఓటర్ల జాబితా అభ్యంతరాలపై ఇసి ఆధారాలతో జవాబు చెప్పాలి

### నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 8,ప్రభావార్త:** ఓటు చోరీ ఆరోపణలపై సమాధానం అడిగిన ప్రజా ప్రతినిధులను నిర్బంధించడం అప్రజాస్వామికమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి విరుచుకుపడ్డారు. గురువారం విలేఖరులతో మాట్లాడుతూ ఓటర్ల జాబితాపై తలెత్తిన అనుమానాలను నివృత్తి చేయాని ప్రజల విశ్వాసాన్ని పోలీసు బలంతో సంపాదించలేరనీ అన్నారు. ప్రతి ఓటు విలువను కాపాడేందుకు రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటాన్ని అరెస్టులు, కేసులతో అణచివేయాలని చూడటం కేంద్ర ప్రభుత్వ భ్రమ" అని మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు.అక్టోబర్ 6, 7 తేదీల్లో ఢిల్లీలో జరిగిన నిరసనలు, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, ప్రతిపక్ష ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకున్న పరిణా మాలపై ఆయన తీవ్రంగా స్పందించారు. కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీ నామా చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ఎన్నికల పారదర్శకత కోసం రాహుల్ గాంధీ చూపుతున్న పట్టుదల, ప్రియాంక గాంధీ ప్రదర్శించిన ధైర్యం దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటానికి స్ఫూర్తినిస్తున్నాయని పేర్కొన్నారు.ఎన్నికల సంఘం తనపై వస్తున్న ఆరోపణలను ఖండించినప్పటికీ, ఓటర్ల జాబితాల సవరణపై లేవనెత్తిన సందేహాలను వివరాలు, ఆధారాలతో నివృత్తి చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. పేర్ల చేర్పులు, తొలగింపులకు అనుసరించిన ప్రమాణాలు, ప్రభావిత ఓటర్లకు కల్పించిన అభ్యంతరాల అవకాశాలు, వాటిపై తీసుకున్న నిర్ణయాలను ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. నిర్దిష్టంగా లేవనెత్తిన ఆరోపణలపై స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా పరిశీలన జరగాలన్నారు.ఎన్నికల సంఘంపై ప్రజలకు నమ్మకం ఉండాలి. ఆ నమ్మకాన్ని నిలబెట్టే బాధ్యత ఆ సంస్థపైనే ఉంది. ఏ పార్టీ ఒత్తిడికి లోనుకాకుండా వ్యవహరించడం, నిర్ణయాలను పారదర్శకంగా వివరించడం ద్వారానే ఆ విశ్వాసాన్ని కాపాడగలరు. ప్రశ్నలను తప్పించుకుంటూ, ప్రశ్నించిన వారిపైనే ఒత్తిడి పెంచే ధోరణి ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం" అని ఆయన హెచ్చరించారు.

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న ప్రతిపక్ష డిమాండ్‌కు మద్దతు తెలిపారు.రాహుల్ గాంధీ నాయకత్వంలో ఎన్నికల విశ్వసనీయత అంశం జాతీయ చర్చలో ప్రధానంగా నిలిచిందని ఉత్తమ్ అన్నారు. ప్రజల ఓటు విలువను కాపాడేందుకు ప్రతిపక్ష ఎంపీలతో కలిసి ఆయన సాగిస్తున్న పోరాటం ప్రజల్లో ధైర్యాన్ని, ప్రశ్నించే చైతన్యాన్ని పెంచుతోందని పేర్కొన్నారు. నిర్బంధాలను ఎదుర్కొంటూ ప్రజాస్వామ్య హక్కుల కోసం నిలిచిన రాహుల్, ప్రియాంకలకు అభినందనలు తెలిపారు."ప్రజల ఓట్లతో ఏర్పడే ప్రభుత్వానికి ప్రజల ప్రశ్నలు వినే బాధ్యత ఉంది. ప్రశ్నించే గొంతుపై ఉక్కుపాదం మోపే వైఖరిని దేశం అంగీకరించదు. ఢిల్లీ వీధుల్లో లేవనెత్తిన ఓటు హక్కు ప్రశ్నకు దేశంలోని ప్రతి పౌరుడితో సంబంధం ఉంది. ప్రతి అర్హుడి ఓటు హక్కును కాపాడాలి. ప్రతి అభ్యంతరానికి విశ్వసనీయమైన సమాధానం ఇవ్వాలి. ఎన్నికల పారదర్శకత కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో సాగుతున్న పోరాటానికి సంపూర్ణ మద్దతుగా నిలుస్తాం. బారికేడ్ల ముందు ఆగిపోయేంత బలహీనమైనది ప్రజాస్వామ్య చైతన్యం కాదు" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఎక్సైజ్‌శాఖలోనూ ఆన్‌లైన్ కేసుల నమోదు

## సెలవు రోజుల్లోనూ బార్లకు దరఖాస్తుల స్వీకరణ :కమిషనర్ సి.హారికిరణ్

**హైదరాబాద్, అక్టోబరు 8,ప్రభాతవార్త:** ఎక్సైజ్ శాఖలో కూడా ఆన్‌లైన్‌లో కేసుల నమోదు ప్రకియను ముందుకు తీసుక వెళ్లడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి.హారికిరణ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్‌కు ఆదేశాలు జారీ చేశారు. గురువారం ఆబ్కారీ భవన్‌లో జరిగిన క్యూర్ పరిధిలోని డీసీలు, ఇతర అధికారులతో కమిషనర్ సమీక్షా నిర్వహించారు. పోలీస్‌శాఖ రీతిలో ఎక్సైజ్ శాఖలో కూడ ఆన్‌లైన్ కేసుల నమోదు ప్రకియను చేపట్టామన్నారు. కొత్తగా బార్ల కోసం వచ్చె వరఖాస్తులను లాటరీ పద్ధతి డ్రా తీయడానికి అవసరమైన చర్యలను చేపట్టాలని సూచించారు. డిఫెన్స్, మద్యంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చె మద్యాన్ని పూర్తిగా అరికట్టడానికి ఎక్సైజ్‌శాఖ దాడులను ముమ్మురం చేసి అక్రమ మద్యం రవాణను అరికట్టాలన్నారు. డ్రగ్స్, గంజాయి, నాటుసారాను పూర్తిగా లేకుండా చేయడానికి ఎక్సైజ్ శాఖ గట్టి నిఘా పెట్టాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ సయ్యద్ యాషిన్ ఖురేషి, జాయింట్ కమిషనర్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) జి. అంజన్‌రావు, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి డిప్యూటి కమిషనర్లు ఏ.శ్రీనివాసరెడ్డి, జె.హరి కిషన్, ప్రణవి, టీజీబీసీఎల్ డీసీ పి.దశరథ్, అసిస్టెంట్ కమిషనర్ (హెడ్ క్వార్టర్స్) శీలం శ్రీనివాస్, డి.శ్రీనివాస్, డి.శ్రీనివాసరెడ్డి, ఈఎస్‌లు పాల్గొన్నారు. సెలవు రోజుల్లోనూ బార్లకు దరఖాస్తుల స్వీకరణ.. శని,ఆదివారాల్లో దరఖాస్తులు తీసుకోవడానికి ఎక్సైజ్ శాఖ నిర్ణయం తీసుకుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి.హారికిరణ్ తెలిపారు.ఈ నెల 10న రెండో శనివారం, 11న ఆదివారం రోజున ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బార్లకు దరఖాస్తులు తీసుకుంటారని తెలిపారు.9,11,12 తేదీలు మంచి రోజులు కావడంతో వచ్చే దరఖాస్తుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక కౌంటర్లను అన్ని చోట్ల ఏర్పాటు చేయాలని డీసీలకు, అధికారులకు కమిషనర్ అదేశాలు జారీ చేశారు. క్యూర్ పరిధిలోని 14 బార్లతో పాటు మిగిలిన 27 బార్లకు ప్రస్తుతం దరఖాస్తులు స్వీకరిస్తామని కమిషనర్ పేర్కొన్నారు.



# మైనార్టీ సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత

## విద్య, ఉపాధి రంగాల్లో నైపుణ్యాభివృద్ధికి చర్యలు : మంత్రి అజారుద్దీన్

**హైదరాబాద్, అక్టోబరు 8,ప్రభాతవార్త:** మైనార్టీ సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజహారుద్దీన్ అన్నారు. గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని భారతీయ విద్యా భవన్‌లో నిర్వహించిన సంక్షేమ కార్యక్రమంలోపాల్గొని సుమారు 800 మంది లబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాలను అందజేశారు. ఎంపికైన విద్యార్థుల తరుపున వారి తల్లిదండ్రులకు ఒక్కొక్కరికి రూ.20 లక్షల చొప్పున సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఫకీర్ కమ్యూనిటీకి చెందిన లబ్ధిదారులకు మోపెడ్లు, ఇందిరమ్మ మైనారిటీ మహిళా శక్తి పథకం కింద కుట్టు మిషన్లు, మైనారిటీ మహిళా యోజన కింద రూ.50,000 చొప్పున చెక్కులు అందజేశారు. అలాగే మైనారిటీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఉపాధి కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసిన అభ్యర్థులకు ధ్రువపత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం మైనారిటీల సామాజిక, ఆర్థిక అభివృద్ధి, పురోగతి, సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో తొలిదశలో మైనారిటీ బాలుర కోసం 10, బాలికల కోసం 10 రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యంగా అత్యంత వెనుకబడిన, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. మైనారిటీలను సాధికారత దిశగా తీసుకెళ్లేందుకు, స్వయం ఆధారితంగా తీర్చిదిద్దేందుకు, విద్య, ఉపాధి తదితర రంగాల్లో వారి భాగస్వామ్యాన్ని పెంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మోపెడ్లు, కుట్టు మిషన్లు, పనిముట్లు, పరికరాలు, స్కాలర్‌షిప్‌లు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ వంటి సహాయాన్ని అందించడం ద్వారా ఆదాయ మార్గాలను కల్పించి స్వయం ఉపాధిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. మైనారిటీ విద్యార్థులకు 5వ తరగతి నుంచి 12వ తరగతి వరకు 205 తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ విద్యాసంస్థల ద్వారా ఆధునిక విద్యను అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఒక్కో విద్యార్థిపై సంవత్సరానికి సుమారు రూ.1.20 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలకు శిక్షణ అందించేందుకు 23 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ పనిచేస్తున్నాయని ప్రవేశ పరీక్షల్లో విద్యార్థులు మంచి ర్యాంకులు సాధిస్తున్నారని తెలిపారు. మైనారిటీల సంక్షేమ శాఖకు తెలంగాణలో ఇప్పటివరకు ఎన్నడూ లేనంతగా రూ.3,768 కోట్ల బడ్జెట్ కేటాయింపు లభించిందని మంత్రి తెలిపారు.కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ప్రభుత్వ విప్ బాల్మూర్ వెంకట్, ఎమ్మెల్సీ రియాజ్‌ఉల్‌హాసన్, వైస్ చైర్మన్, ప్రెసిడెంట్ ఫహీమ్ ఖురేషీ, తెలంగాణ స్టేట్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబైదుల్లా కోత్వాల్, జిల్లా కలెక్టర్ డా. ప్రియాంక అలా, జిల్లా మైనారిటీస్ వెల్ఫేర్ అధికారి ఇలియాస్ అహ్మద్, లబ్ధిదారులు ఉన్నారు.

# రాహుల్ గాంధీ పోరాటానికి మద్దతుగా సంగారెడ్డిలో జగ్గారెడ్డి, నిర్మల దీక్ష

## జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్




రెండో రోజు దీక్షలో పాల్గొన్న జగ్గారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు

**సంగారెడ్డి బ్యూరో అక్టోబర్ 8, ప్రభాతవార్త :** దేశ ప్రజల ఓటు హక్కును, ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షి ంచేందుకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఆయన సతీమణి నిర్మల జగ్గారెడ్డి సంగారెడ్డి ఓల్డ్ బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి చేపట్టిన దీక్ష గురువారానికి రెండో రోజుకు చేరుకుంది .ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ వ్యవహారశైలిపై తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీ బలపడిన రాష్ట్రాల్లో ఎన్నికల వ్యవస్థను తమకు అనుకూలంగా మార్చుకుని అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నించిందని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ సహకారంతోనే బీజేపీ మూడుసార్లు కేంద్రంలో అధికారంలోకి వచ్చిందని, ఈ అంశంపై రాహుల్ గాంధీ అనేక సందర్భాల్లో ప్రశ్నలు లేవనెత్తారని పేర్కొన్నారు.ఇది కేవలం కాంగ్రెస్ పార్టీ రాజకీయ పోరాటం కాదు.. దేశ ప్రజల ఓటు హక్కును కాపాడే రాజకీయ యుద్ధం. దేశ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ రోడ్డుపై కూర్చొని పోరాడుతున్నారు" అని జగ్గారెడ్డి అన్నారు.సర్ ప్రక్రియలోనూ ఎన్నికల కమిషన్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించిన ఆయన, ఓటర్ల జాబితాల విషయంలో తలెత్తుతున్న వివాదాలపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందన్నారు. దేశ ప్రజల ఓటు హక్కును దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ చేస్తున్న ఆరోపణలను ప్రస్తావించారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రాహుల్ గాంధీ చేస్తున్న ఉద్యమానికి పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని జగ్గారెడ్డి తెలిపారు.

# ఆస్తి కోసం తండ్రిని హతమార్చిన కుమారుడు

## భూమిని తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయాలని ఒత్తిడి..

### బండరాయితో కొట్టి దారుణ హత్య - షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు



తండ్రి పోశయ్య (ఫైల్)

**షాద్‌నగర్, అక్టోబరు 8, ప్రభాతవార్త :** ఆస్తి విషయంలో తండ్రితో తరచూ గొడవపడుతూ, భూమిని తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయాలని ఒత్తిడి చేసిన కుమారుడు తండ్రిని బండరాయితో కొట్టి హతమార్చిన ఘటన ఫరూఖ్‌నగర్ మండలం దూసకల్ గ్రామంలో చోటుచేసుకుంది. షాద్‌నగర్ పట్టణ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం.. దూసకల్ గ్రామానికి చెందిన బాగం పోశయ్య (70) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆయనకు భార్య అంజమ్మ (60), కుమారుడు బాగం నర్సింహులు (39) ఉన్నారు. ఈ నెల 8వ తేదీ అర్ధరాత్రి సమయంలో ఆస్తి విషయంలో తండ్రి పోశయ్యతో కుమారుడు నర్సింహులు గొడవకు దిగినట్లు పోలీసులు తెలిపారు. తనకు ఉన్న రెండు ఎకరాల భూమిని తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయాలని నర్సింహులు తండ్రిపై ఒత్తిడి చేసినట్లు పేర్కొన్నారు. అందుకు తండ్రి నిరాకరించడంతో కోపోద్రిక్తుడైన నర్సింహులు బండరాయితో తండ్రి తలపై కొట్టి తీవ్రంగా గాయపరిచినట్లు తెలిపారు.తీవ్ర గాయాలపాలైన పోశయ్యను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు సీఐ సీతారాం తెలిపారు. ఈ ఘటనపై మృతుడి భార్య అంజమ్మ ఫిర్యాదు మేరకు షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం, నర్సింహులు గతంలోనూ తండ్రితో ఆస్తి విషయంలో గొడవపడేవాడని, తండ్రి వద్ద ఉన్న భూమిని తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయాలని తరచూ ఒత్తిడి చేసేవాడని తెలిపారు. ఈ క్రమంలోనే ఈ హత్య జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైనట్లు పోలీసులు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న వెంటనే సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సీఐ సీతారాం తెలిపారు.

# ట్యాంక్‌బండ్‌పై నుంచి కన్నబిడ్డను తోసేసిన తల్లి

## పాపను రక్షించిన పోలీసులు



**ముషీరాబాద్, అక్టోబర్ 8, ప్రభాతవార్త:** కన్నబిడ్డను కన్నతల్లి ట్యాంక్‌బండ్ పైనుంచి తోసివేసిన ఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దోమలగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అల్వాల్‌కు చెందిన షబానా అనే మహిళ గురువారం మధ్యాహ్నం తన కూతురు రుక్సానా(6)ను తీసుకుని ట్యాంక్‌బండ్‌పైకి వచ్చింది. ఉన్నట్లుండి షబానా పాపను ఒక్కసారిగా నీటిలోకి పడేసి, అక్కడ నుంచి వేగంగా వెళ్లి పోయింది. ఇది గమనించిన స్థానికులు పాపను రక్షించి, పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేశారు. సమాచారం అందుకున్న దోమలగూడ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని, పాపను చికిత్స నిమిత్తం గాంధీ హాస్పటల్‌కు తరలించారు. పాప ఆరోగ్యం మెరుగుగానే ఉందని, కేసు నమోదు చేసి, తల్లి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. పాపకు తండ్రి లేదని, బహుశా కుటుంబ కలహాల కారణంగానే తల్లి ఈ దారుణానికి ఒడిగట్టి ఉండవచ్చునని భావిస్తున్నారు.

# శ్రీవారికి బంగారు పగడాల హారాలు



**తిరుమల, అక్టోబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి భక్తులు తమ భక్తిపూర్వకంగా పలు రకాల కానుకలు విరాళ రూపంలో అందిస్తున్నారు. ఇలా దాతలు తమ ఇష్టదైవానికి రోజువారీగా విరాళా లందిస్తుండటం విదితమే. తాజాగా గురువారం ఉదయం తెలంగాణ హైదరాబాద్‌కు చెందిన కమల శ్రీవారికి దాదాపు రూ.25 లక్షలు విలువైన రెండు బంగారు పగడాల హారాలు విరాళంగా అందించారు. దాత తన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టిటిడి అదనపు ఇఒ సి.హెచ్.వెంకయ్య చౌదరికి హారాలను అందజేశారు. ఆలయ డిప్యూటీ ఇఒ భాస్కర్ పాల్గొన్నారు.

## టిటిడి గోశాల మావటి చంద్రశేఖర్ మృతి

**తిరుపతి, అక్టోబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో శ్రీనిధి ఏనుగు దాడిలో తీవ్రంగా గాయపడిన మావటి చంద్రశేఖర్‌రెడ్డి (చంద్రయ్య) చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఈనెల 4వ తేదీ ఆదివారం సాయంత్రం అమ్మవారి ఆలయ వేడుకల్లో పాల్గొన్న శ్రీనిధి ఏనుగు గోశాలకు తరలిస్తుండగా టిటిడి గోశాల మావటి చంద్రయ్యపై ఆస్థాన ఏనుగు తొండంతో దాడి చేసి తొక్కేసిన ఘటన విదితమే. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతను స్విమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. హార్మోన్ల మార్పుల కారణంగా ఏనుగులో దూకుడు పెరిగిందని వెటర్నరీ డాక్టర్లు, టిటిడి అధికారులు నిర్ధారించారు.

# పెంపుడు జంతువుల వ్యాధుల నిర్ధారణలో సైటాలజీ కీలకం

## ఫీల్డ్ వెటర్నరీ వైద్యులకు రెండు రోజుల శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులతో ఉపకులపతి జ్ఞాన ప్రకాష్ ,ఇతర ప్రొఫెసర్లు

**అత్తాపూర్ అక్టోబరు8,ప్రభాతవార్త** పెంపుడు జంతువుల్లో సాధారణంగా కనిపించే వివిధ వ్యాధులను సైటాలజీ విధానాల ద్వారా త్వరితగతిన గుర్తించి, తగిన వైద్య నిర్ణయాలు తీసుకునేలా ఫీల్డ్ వెటర్నరీ వైద్యుల నైపుణ్యాలను పెంపొందించేందుకు రాజేంద్రనగర్‌లోని పి.వి. నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తోంది. కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్‌లోని వెటర్నరీ పాథాలజీ విభాగం ఆధ్వర్యంలో, తెలంగాణ స్టేట్ వెటర్నరీ కౌన్సిల్ ఆర్థిక సహకారంతో డయాగ్నోస్టిక్ సైటాలజీ ఆఫ్ కామన్ పాథలాజికల్ కండిషన్స్ ఇన్ కంపానియన్ యానిమల్స్ అంశంపై ఈ శిక్షణ కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో మొత్తం 20 మంది ఫీల్డ్ వెటర్నరీ వైద్యులు పాల్గొంటున్నారు. కుక్కలు, పిల్లులు వంటి పెంపుడు జంతువుల్లో తరచుగా ఎదురయ్యే చర్మం, చర్మం కింద ఏర్పడే గడ్డలు, లింఫ్ నోడ్‌ల వాపు, ఇన్‌ఫ్లమేటరీ, ఇన్ఫెక్షియస్ వ్యాధులు, వివిధ రకాల ట్యూమర్లు, ఇతర పాథలాజికల్ పరిస్థితులను సైటాలజీ ద్వారా గుర్తించే అంశాలపై శిక్షణ అందిస్తు న్నారు. కార్యక్రమానికి పి.వి. నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ ఎం. జ్ఞాన ప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ వెటర్నరీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డా. బి. సుబ్బారాయుడు, యూనివర్సిటీ డీన్ ఆఫ్ ఫ్యాకల్టీస్ ప్రొఫెసర్ ఎం. ఉదయ కుమార్ గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్, రాజేంద్రనగర్ అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డి. మాధురి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.పెంపుడు జంతువుల్లో వ్యాధి నిర్ధారణకు ఫైన్ నీడిల్ ఆస్పిరేషన్ సైటాలజీ, ఇంప్రెషన్ సైటాలజీ వంటి విధానాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. తక్కువ ఖర్చుతో, తక్కువ ఇన్వేసివ్ విధానంలో, తక్కువ సమయంలో ప్రాథమిక నిర్ధారణకు వీటి ద్వారా అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్వోత్తమరెడ్డి విజయం ఖాయం

## కాంగ్రెస్ అభ్యర్థి విజయంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ధీమా

**హైదరాబాద్,అక్టోబరు8,ప్రబాతవార్త:** నల్గొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గానికి జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎంపికైన రామిరెడ్డి సర్వోత్తమరెడ్డి గురువారం సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సర్వోత్తమరెడ్డికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సర్వోత్తమరెడ్డి ఘన విజయం సాధిస్తారన్న ధీమాను మంత్రి వ్యక్తం చేశారు.ప్రజా సమస్యలపై అవగాహన, పార్టీ పట్ల నిబద్ధత, పట్టభద్రులు-ఉద్యోగ వర్గాలతో ఉన్న అనుబంధం సర్వోత్తమరెడ్డికి కలిసొస్తాయని మంత్రి పేర్కొన్నారు. పట్టభద్రుల ఆశయాలను శాసనమండలిలో బలంగా వినిపించే అవకాశం సర్వోత్తమరెడ్డికి కల్పించాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రస్తుతం ఏఐసీసీ, టీపీసీసీ సభ్యుడిగా కొనసాగుతున్న సర్వోత్తమరెడ్డి, పార్టీ శ్రేణులు, పట్టభద్రులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో ఎన్నికల్లో విజయం సాధించే దిశగా ముందుకు సాగాలని మంత్రి సూచించారు.నల్గొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# త్వరలో పత్తి కొనుగోళ్లు ఆరంభం

## - జిల్లా కలెక్టర్ల నోటిఫికేషన్లు - రాష్ట్ర వ్యాప్తంగా 131 సేకరణ కేంద్రాలు - ఖరీఫ్‌లో 48,21,503 ఎకరాల్లో సాగు - మొత్తం 25.85 లక్షల టన్నుల పత్తి ఉత్పత్తి

**హైదరాబాద్, అక్టోబరు 8, ప్రభాతవార్త:** తెలంగాణలో త్వరలో పత్తి కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 21వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా పత్తి కొనుగోళ్లను ప్రారంభించాలని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) నిర్ణయించింది. ఈ పత్తి కొనుగోళ్లకు సంబంధించి ఇప్పటికే సీసీఐ రంగం సిద్ధం చేసింది. కాటన్ కార్పొరేషన్ అధికారవర్గాల వివరాల ప్రకారం రాష్ట్రంలో మొత్తం 131 కొనుగోలు కేంద్రాల్లో ఒకేసారి కార్యకలాపాలు ప్రారంభించాలని నిర్ణయించింది. ఇందుకు గాను త్వరలో ఆయా జిల్లాల కలెక్టర్లు ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్లు జారీ చేయనున్నారు. దీంతో పత్తి రైతులు తమ పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకునేందుకు మార్గం సుగమం కానుంది. ఈ పత్తి కొనుగోళ్ల సంబంధించి సీసీఐ సీఎండీ లలిత్ కుమార్ గుప్తా ఇప్పటికే రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులు, కాటన్ మిల్లర్లతో సమావేశం సైతం నిర్వహించారు. కొనుగోళ్ల ఏర్పాట్లు, జిన్నింగ్ మిల్లుల వినియోగం, రైతులకు ఇబ్బందులు లేకుండా పత్తిని సేకరించే విధానంపై ఇందులో చర్చించారు. అందుకు అనుగుణంగా తెలంగాణలో పత్తి కొనుగోళ్ల విషయంలో తాజాగా సీసీఐ పలు నిర్ణయాలు తీసుకుంది. ప్రస్తుత సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 48,21,503 ఎకరాల్లో పత్తి సాగు చేసినట్లు అధికారులు అంచనా వేశారు. మొత్తం 25.85 లక్షల టన్నుల పత్తి ఉత్పత్తి అవుతుందని, జిన్నింగ్ ప్రక్రియ అనంతరం సుమారు 50.68 లక్షల బేళ్ల పత్తి లభించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో పెద్ద మొత్తంలో పత్తి మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉండటంతో కొనుగోలు కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రధానంగా సీసీఐ ఎంపిక చేసిన 131 కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాలు, పత్తి తూకం, నిల్వ, రవాణా వంటి అంశాలపై ముందస్తు ఏర్పాట్లు చేయనున్నారు. కొనుగోళ్ల ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ రైతుల నుంచి పత్తిని సకాలంలో సేకరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులు భావిస్తున్నారు. గతంలో ఎల్1, ఎల్2, ఎల్3 కేటగిరీల ఆధారంగా జిన్నింగ్ మిల్లులను గుర్తించి, దశలవారీగా పత్తిని జిన్నింగ్ కోసం పంపించేవారు. అయితే ఈసారి ఎంపిక చేసిన 353 జిన్నింగ్ మిల్లులకు ఒకేసారి పత్తిని పంపించే ఆలోచన చేస్తున్నారు. దీంతో పత్తి కొనుగోళ్ల ప్రారంభమైన తర్వాత జిన్నింగ్ ప్రక్రియ వేగంగా కొనసాగించే అవకాశం ఉంది. ఈ సీజన్‌లో ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనుగోళ్ల సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు సీసీఐ అధికారులు తెలిపారు. కాగా మార్కెట్‌లో పత్తి ధరలపైనా రైతుల్లో ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం కొన్ని ప్రైవేటు కొనుగోలు కేంద్రాల్లో ప్రాంతాన్ని బట్టి క్వింటా పత్తికి సుమారు రూ.8 వేల నుంచి రూ.8,300 వరకు ధర చెల్లిస్తున్నట్లు సమాచారం. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనూ రైతులకు మంచి ధర లభిస్తుందని అధికారులు, రైతులు ఆశిస్తున్నారు. అయితే పత్తి నాణ్యత, మార్కెట్ పరిస్థితులు, ప్రభుత్వ కొనుగోలు నిబంధనలను బట్టి రైతులకు లభించే ధరలో మార్పులు ఉండే అవకాశం ఉంది. అయితే ఈసారి పత్తి రైతులకు దిగుబడి విషయంలో ఆశించిన స్థాయిలో ఫలితం కనిపించడం లేదన్న ఆందోళన ఉంది. ఎల్‌నినో ప్రభావంతో పాటు వర్షాలు సకాలంలో,

సమృద్ధిగా కురవకపోవడం పత్తి సాగుపై ప్రభావం చూపింది. అనేక ప్రాంతాల్లో పంటకు అవసరమైన సమయంలో తగిన వర్షపాతం లేకపోవడంతో కాయల అభివృద్ధి, దిగుబడిపై ప్రతికూల ప్రభావం పడినట్లు రైతులు చెబుతున్నారు. దీంతో సాగు విస్తీర్ణం భారీగా ఉన్నప్పటికీ వాస్తవ దిగుబడి అంచనాల కంటే తగ్గే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# ఎసిబికి చిక్కిన అటవీశాఖ అధికారి

**హైదరాబాద్,అక్టోబరు8,ప్రబాతవార్త:** లంచం తీసుకుంటూ ఖానాపూర్ ఫారెస్టు సెక్షన్ అధికారి రవీందర్ ఎసిబి అధికారులకు పట్టుబడ్డాడు. ఆదిలాబాద్ ఎసిబి డిఎస్పీ మధు తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి తన టింబర్ డిపో లైసెన్స్ రెన్యువల్ కోసం ఆగస్టు నెలలో దరఖాస్తు చేసుకున్నాడు. లైసెన్స్ రెన్యువల్ చేయడానికి రవీందర్.. సదరు వ్యక్తిని రూ.20 వేలు డిమాండ్ చేశాడు. చివరకు రూ.12 వేలకు ఒప్పందం కుదిరింది. బాధితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. గురువారం రవీందర్ తన కారులో బాధితుడి నుంచి రూ.12 వేలు లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆయనపై కేసు నమోదు చేసి..కరీంనగర్‌లోని ఎసిబి కోర్టులో హాజరుపరచనున్నట్లు డిఎస్పీ తెలిపారు.

# మహిళ హత్య కేసును ఛేదించిన పోలీసులు

## - ఇద్దరు నిందితుల అరెస్టు.. వాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రవీందర్‌రెడ్డి, సిఐ మక్బూల్‌జానీ

**ఎల్.బి.నగర్, అక్టోబరు 8 ప్రభాతవార్త:** మహిళను హత్య చేసిన సంఘటనలో ఇద్దరినీ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నాగోల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎల్బీనగర్ ఏసీపీ బి.రవీందర్‌రెడ్డి హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మత్తుగూడ 100 ఫీట్ల రోడ్డుకు సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో బుధవారం మహిళ హత్యకు గురైన ఘటనలో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. మాణికేశ్వర్‌నగర్‌కు చెందిన అలకుంట మంగ(46) హత్య కేసులో పాల్వాయి ఎల్లయ్య (51), ఇరుగు సీతారాంరాజు అలియాస్ రామ్(27)లను అరెస్టు చేశామన్నారు. డబ్బులు ఇస్తామని నమ్మించి సెప్టెంబరు 28న మృతురాలు మంగాను కలిసిన నిందితులు మరుసటి రోజు డబ్బులు ఇస్తామని చెప్పి జైపురికాలనీకి పిలిపించుకున్నారు. సెప్టెంబరు 29న ఉదయం ఆమె అక్కడికి చేరుకున్న అనంతరం ఇద్దరూ కలిసి మోటార్‌సైకిల్‌పై మత్తుగూడ 100 ఫీట్ల రోడ్డుకు సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ మద్యం సేవించిన అనంతరం మృతురాలిపై లైంగిక దాడికి పాల్పడినట్లు తెలిపారు. అనంతరం ఇరువురి మధ్య డబ్బులకు సంబంధించి వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో నిందితులు ఆమెను కిందకు పడేసి గొంతుపై బలంగా నొక్కడంతో మృతి చెందినట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు. సాంకేతిక ఆధారాలతో పట్టివేత మంగను హత్య చేసిన అనంతరం నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు మృతురాలి ఫోన్ కాల్ వివరాలతో పాటు నిందితుల కాల్ డేటా రికార్డులను సేకరించారు. ఘటనకు ముందు, తర్వాత వారి మొబైల్ టవర్ లొకేషన్లను పరిశీలించారు. సాంకేతిక ఆధారాల ద్వారా నిందితుల కదలికలను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరానికి సంబంధించిన వివరాలను వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి హీరో హోండా ప్యాషన్ మోటార్‌సైకిల్ (ఏపీ 10 ఏపీ 3901), ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన ఇద్దరు నిందితులను న్యాయస్థానంలో హాజరు పరిచి విచారణ అనంతరం రిమాండ్‌కు తరలించారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి పర్యవేక్షణలో, డీసీపీ బి.అనురాధ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ ఏసీపీ బి.రవీందర్‌రెడ్డి, నాగోల్ ఇన్‌స్పెక్టర్ ఎం.మక్బూల్ జాని, ఎస్సై మమత, పోలీసు సిబ్బంది సమన్వయంతో కేసును చేదించినట్లు తెలిపారు.

# రామాయణ నిర్మాత నమిత్ మల్హోత్రా ఇల్లు, ఆఫీసుల్లో ఐటిసోదాలు



**ముంబై, అక్టోబర్ 8:** బాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న రామాయణ చిత్ర నిర్మాత నమిత్ మల్హోత్రాకు చెందిన ప్రైమ్ ఫోకస్ లిమిటెడ్ ముంబై కార్యాలయాల్లో ఆదాయపు పన్ను శాఖ అధికారులు గురువారం సోదాలు నిర్వహించినట్లు సమాచారం. విదేశీ నగదు బదిలీలకు సంబంధించిన వ్యవహారాలపై ఈ సోదాలు జరిగినట్లు తెలుస్తోంది. అయితే, ఏ లావాదేవీలను అధికారులు పరిశీలిస్తున్నారు సోదాల పూర్తి పరిధి ఏమిటి అనే విషయాలపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ఐటీ సోదాల వార్తల ప్రభావం కంపెనీ షేర్లపై కూడా కనిపించినట్లు సమాచారం. గురువారం ఉదయం ట్రేడింగ్‌లో ప్రైమ్ ఫోకస్ షేర్లు దాదాపు 8 శాతం వరకు పడిపోయినట్లు తెలుస్తోంది. రామాయణలో కీలక పాత్ర పోషిస్తున్న డినెగ్ ప్రైమ్ ఫోకస్ సంస్థకు ప్రపంచవ్యాప్తంగా వినోద రంగంలో గణనీయమైన స్థానం ఉంది. విజువల్ ఎఫెక్ట్స్, యానిమేషన్, పోస్ట్ ప్రొడక్షన్, కంటెంట్ క్రియేషన్ వంటి విభాగాల్లో సంస్థ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ప్రైమ్ ఫోకస్‌కు చెందిన విజువల్ ఎఫెక్ట్స్ సంస్థ డినెగ్ రామాయణచిత్రానికి భారీ స్థాయిలో విజువల్ ఎఫెక్ట్స్ అందిస్తోంది. అత్యంత భారీ అంచనాలతో తెరకెక్కుతున్న ఈ పౌరాణిక చిత్ర నిర్మాణంలో డినెగ్ సంస్థ పాత్ర కీలకంగా మారింది. ముంబైలోని ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్‌లో రామాయణ సినిమా సెట్స్ సమీపంలో కొన్ని రోజుల క్రితం స్వల్ప అగ్ని ప్రమాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే.

# పోలీస్ యూనిట్ల మెరుగైన పనితీరుతోనే జాతీయ స్థాయిలో రాణిస్తాం: డిజిపి సివి ఆనంద్

## నేరాల దర్యాప్తు, నూతన క్రిమినల్ చట్టాల అమలులో వెనుకబడిన యూనిట్లతో డిజిపి ప్రత్యేక సమీక్ష

**హైదరాబాద్,అక్టోబరు8,ప్రభాతవార్త:** నూతన క్రిమినల్ చట్టాల అమలులో వెనుకబడిన పోలీసు యూనిట్లు పనితీరు మెరుగుపర్చుకోవాలని రాష్ట్ర డిజిపి సి.వి. ఆనంద్ సూచించారు. నూతన చట్టాల అమలుతోపాటు నేరాల నియంత్రణ, దర్యాప్తు నాణ్యత, నేర నిరూపణ శాతం పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా క్రైమ్ ర్యాంకింగ్‌లో వెనుకబడిన యూనిట్ల కమిషనర్లు, ఎస్పీలు, ఇతర అధికారులతో డిజిపి సి. వి. ఆనంద్ గురువారం సీఐడీ కార్యాలయంలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. పనితీరులో మెరుగుదల సాధిస్తేనే జాతీయస్థాయిలో మెరుగైన ర్యాంకు సాధ్యమవుతుందని డిజిపి సూచించారు. గతంలో ఈగల్ ఫోర్స్, సైబర్ సెక్యూరిటీ బ్యూరోపై నిర్వహించిన సమీక్ష సమావేశాల్లో పలు సూచనలు, జాగ్రత్తలు సూచించడం, వాటిని అమలు చేయడం ద్వారా ఈగల్ , సైబర్ సెక్యూరిటీ బ్యూరో విభాగాలు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గుర్తింపు సాధించాయని పేర్కొన్నారు. ఈగల్ ఫోర్స్ దేశంలోనే నంబర్‌వన్‌గా నిలవడంతోపాటు, సైబర్ నేరాల నియంత్రణలోనూ తెలంగాణ జాతీయస్థాయిలో విశేష ప్రతిభ కనబరిచి దేశానికి ఆదర్శంగా నిలిచిందని డిజిపి కొనియాడారు. ఇదే విధంగా ఇతర అంశాల్లోనూ రాష్ట్రం ముందంజలో నిలవాలంటే క్రమం తప్పకుండా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ లోపాలను గుర్తించి, సరిదిద్దుకుంటూ ముందుకు సాగాలని, అప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని సూచించారు. కేసుల పరిష్కారం,లైంగిక నేరాల ట్రాకింగ్ వ్యవస్థ,పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర విచారణ.నేరం జరిగిన చోట ఎఫ్ఐఆర్ నమోదు, ఈ సాక్ష్య తదితర అంశాలపై యూనిట్ల వారీగా డిజిపి సమీక్షించారు. ప్రత అంశంలో ఎదురవు తున్న సమస్యలను అధికారులను అడిగారు.

# వారికి మొదలవుతుందా ?



పాపకి పదేళ్లు వచ్చాయంటే చాలు.. రజస్వల కావడానికి సిద్ధంగా ఉందని అర్థం. ఈ వయసు నుంచి ఆమెకు పోషకాలన్నీ అందుతున్నాయో లేదో సరిచూసుకోవాలి. అప్పుడే నెలసరి ఇబ్బందులు, గర్భాశయ సమస్యలు, రక్తహీనత, ఎముకలు గుల్లబారడం వంటి సమస్యల బారిన పడకుండా చూసుకోవచ్చు. ఇందుకోసం ఎలాంటి ఆహారం తీసుకోవాలంటే..

**ఇనుము :** ప్రపంచదేశాలతో పోల్చితే మనదేశంలోనే రక్తహీనతతో బాధపడుతోన్న మహిళలు, పిల్లలు ఎక్కువట. ఆడపిల్లల్లో రుతుక్రమం మొదలయ్యాక ఈ ఇబ్బంది తలెత్తకూడదంటే.. వారి ఆహారంలో తప్పనిసరిగా ఇనుము ఉండేలా చూసుకోవాలి. ఫిష్, లివర్ వంటివాటితో పాటు సజ్జలు, రాగులు, ఆకుకూరలు, సెనగలు, ఉలవలు, పల్లీలు, నువ్వులు, కాయగూరలు, పండ్ల నుంచి ఐరన్ అధికమోతాదులో లభిస్తుంది.

**కాల్షియం :** ఇనుము తరవాత ఎక్కువగా అవసరమయ్యే ఖనిజం కాల్షియం. ఇది లోపిస్తే ఎముకలు బలహీనంగా మారతాయి. మూడుపదులు దాటాక, మెనోపాజ్ దశలోనూ.. కీళ్ల సమస్యలు రావొచ్చు. పాలు, పాల సంబంధిత పదార్థాలను తీసుకోవాలి. అవి ఇష్టపడనివారు పెరుగుని ప్రత్యామ్నాయంగా తీసుకోవచ్చు. వీటితో పాటు తాజా ఆకుకూరలు, నువ్వులు, రాగులు, రాజ్మా, వేరు సెనగ పప్పు, పప్పుధాన్యాల నుంచి ఎక్కువగా లభిస్తుంది.

**మేలు చేసే కొవ్వులు :** చాలామంది కొవ్వు పదార్థాల్ని హానికారకం అనుకుంటారు. కానీ వీటిల్లో శరీరానికి మేలు చేసే కొవ్వులూ ఉంటాయి. వీటి అవసరం ఎంతో ఉంటుంది. బిఎంఐ 18 కంటే తక్కువ ఉన్న అమ్మాయిలో పీరియడ్స్ క్రమంగా రాకపోవడానికి కొవ్వుల లోపం కారణమైతే.. స్థూలకాయుల్లో కొవ్వులు ఎక్కువవ్వడం మరో కారణం. కాబట్టి వీటిని తగిన మోతాదులో తీసుకోవాలి. ఈ కొవ్వులు సరిగ్గా ఉంటేనే తీసుకునే ఇతర ఎ,డి,ఇ,కె విటమిన్లను శరీరం స్వీకరిస్తుంది. □

# అందంగా ముఖం



అందంగా ఉండాలంటే పార్లర్‌ల వద్దకే వెళ్లాల్సిన పనిలేదు. మన ఇంట్లో దొరికే వాటితోనే చక్కటి నిగారింపును సొంతం చేసుకోవచ్చు. పైగా ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. అందుకోసం ముఖంపై కాస్త శ్రద్ద పెట్టి ఇంట్లో ఉంటే సహజ సిద్ధమైన వాటిని అప్లై చేసి మచ్చలేని చందమామలా ఉండే ముఖాన్ని సొంతం చేసుకుండి. అందకు ఈ సింపుల్ రెమిడీస్‌ని ఫాలోకండి. అందంగా ముఖం రోజూ పెదవు లకు కాస్తంత మీగడ రాసిన సున్నితంగా మర్దన చేస్తే పదవులు పగడల కుండా గులాబీ రేకుల్లా మెరు స్తాయి. ముఖాన్ని రోజుకు రెండు మూడుసార్లు గోరువెచ్చటి నీటితో కడుక్కుని పొడి టబల్‌తో చక్కగా తుడిచేస్తే మొటిమల వంటివిరావు. ముఖం లేత కొబ్బరిని మెత్తగా మెదిపి ముఖానికి ప్యాక్‌లా వేసుకుని, ఆరిన తర్వాత కడిగేసు కుంటూ ఉండాలి. ఇలా చేస్తుంటే ముఖం చక్కగా అందంగా కనబడు తుంది. రకరకాల షాంపూల బదులు కుంకుడు కాయ రసం లేదా సీకాయ పొడితో తలస్నానం చేయడం వల్ల చుండ్రు, కేశ సంబంధమైన సమస్యలు రాకుండా జుట్టు ఆరోగ్యంగా నిగనిలాడుతుంది. తల స్నానం పూర్తయిన తర్వాత, చివరి మగ్గు నీటిలో కొంచెం నిమ్మరసం కలిపి తలమీద పోసుకుంటే జుట్టు, చర్మ సమస్యలురావు. □

# నైపుణ్యం పెంచుకుంటే బంగారు భవిష్యత్తు



చేసే పనిలోనైనా, కెరీర్‌లోనైనా.. వచ్చే మార్పుల్ని గమనిస్తూ నైపుణ్యాలను పెంచుకున్నప్పుడే బంగారు భవిష్యత్తు సొంతమవుతుంది. ఇలా సొంతం చేసుకున్న నైపుణ్యాలే మన తరగని ఆస్తులు, అవే ఎలాంటి ప్రతి కూల పరిస్థితుల్లోనైనా వ్యక్తిగతంగా, వృత్తిపరంగా మనల్ని ఉన్నతంగా నిలబెడతా యని నిపుణులు చెబుతున్నారు.

**మార్పు మంచిదే!** శ్రీ ప్రస్తుతం మన రోజువారీ జీవితాలే కాదు..కెరీర్ కూడా టెక్నాలజీతో ముడిపడిపోయిందని శ్రీ చెప్పాలి. ఈ ఏఐ యుగంలో ఇది మరెంత అడ్వాన్స్ మారనుందో ఊహించగలం. ఈ శ్రీ టెక్నాలజీలో వస్తున్న కొత్త పోకడల్ని అవపోసన పట్టడం చాలా ముఖ్యమంటున్నారు. శ్రీ నిపుణులు. ఇందుకు మారుతోన్న సాంకేతికతకు అనుగుణంగా కొత్త కోర్సు లు నేర్చుకోవడానికి ఉత్సు కత చూపాలి. ఎలాంటి కొత్త బాధ్యతనైనా అందిపుచ్చుకునే నేర్పును అలవర్చుకోవాలి.

**కమ్యూనికేషన్ ముఖ్యం!** కొంతమందికి నలుగురిలో మాట్లాడాలంటే ఏదో తెలియని భయం, బిడియం ఉంటాయి. వ్యక్తిగతంగా, వృత్తిపరంగా ఎదగాలనుకునే వారికి ఇవే పెద్ద అవరోధాలుగా మారతాయంటున్నారు నిపుణులు. మీరు మీ బృందంతోనే కాదు.. ఇతర బృందాలతో కూడా పని/ప్రాజెక్ట్ గురించి మాట్లాడాల్సి వస్తుంది. మీ ఆలోచనల్ని వారితో పంచుకోవాల్సి న అవసరం ఏర్పడుతుంది. ఇలాంటప్పుడు చక్కటి కమ్యూనికేషన్ నైపుణ్యాలు ముందు నుంచే అలవర్చుకోవడం మంచిది.

**సృజనాత్మకంగా..** వివిధ రంగాల్లో కృత్రిమ మేధ సృష్టిస్తున్న అద్భుతాల గురించి వింటూనే ఉన్నాం. ఈ సృజనాత్మకంగా ఆలోచించగలిగే సామర్థం, ఒక సమస్యకు పరిష్కారం కనుక్కొని దాన్ని కనుగొనగలిగేలా నేర్పు. ప్రతి వైద్యం సానుకూలంగా ఆలోచించడంతో పాటు అందులోని లోపాలనూ కనిపెట్టగలిగినప్పుడే పరిష్కారం సాధించగలం. భవిష్యత్తులోనూ మంచి అవకాశాలను అందిపుచ్చుకోగలుగుతాం.

**పోటీని తట్టుకునేలా..!** ఈరోజుల్లో పోటీ లేని రంగం, కెరీర్ లేదంటే అతిశయోక్తి కాదు. అయితే ఇది భవిష్యత్తులో మరింత తీవ్రంగా ఉండే అవకాశాలున్నా యని నిపుణులు చెబుతున్నారు. అలాగని భయపడిపోతే ముందుకు సాగలేం.. అందుకే ఈ పోటీని తట్టుకొని నిలబడాలంటే ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనే నైపుణ్యాన్ని అలవర్చుకోవాలి. ఎంపిక రంగంలో పోటీని అధిగమించడానికి అవసరమైన అన్ని నైపుణ్యాలను సొంతం చేసుకోవాలి. ఎప్పటికప్పుడు మన వాయువు పెంపొందించుకోవాలి. ఈ లక్షణాలు ఎలాంటి ప్రతికూల పరిస్థితుల్లోనైనా ముందుకు నడిపించడంతో పాటు.. విజయం సాధించేలా ఉన్నాయి. □

# కాశీ అన్నపూర్ణమ్మ



కాశీ క్షేత్రానికి వెళ్లిన భక్తులు విశ్వ నాథుడితో పాటు అన్నపూర్ణమ్మ తల్లి దర్శనం కూడా చేసుకుంటూ వుంటారు. అన్నపూర్ణమ్మ ఈ క్షేత్రంలో కొలువై ఉండటం వెనుక ఒక ఆసక్తికర మైన పురాణ కథనం అక్కడ వినిపిస్తూ ఉంటుంది. పూర్వం పరమశివుడు కైలాసంలో ధ్యానంలో ఉండగా .. వెనక నుంచి పార్వతీదేవి వచ్చి సరదాగా ఆయన కళ్ళు మూసింది. ఒక్కసారిగా లోకాలన్నీ చీకట్లు అలుముకోవడంతో .. తాను చేసింది ఎంత పెద్ద పొరపాటు అనే విషయం పార్వతీదేవికి అర్థమైంది. తాను చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తం చేసుకోవడం కోసం అమ్మవారు కాశీ నగరానికి చేరుకుంటుంది. ఆ సమయంలో కాశీ నగరంలో కరవు కాటకాలతో ప్రజలు బాధలుపడుతూ వుంటారు. అక్కడ అన్నపూర్ణమ్మగా పిలవబడుతూ .. ఆకలితో వున్నవారికి ఆహారాన్ని అందిస్తూ ఉంటుంది. అన్న పూర్ణమ్మ రాకతో కాశీ నగరంలో ఆకలి బాధలు లేకుండా పోతాయి. ఈ విషయం తెలుసుకున్న కాశీ రాజు ఆశ్చర్యంతో అన్నపూర్ణమ్మ దర్శనం చేసుకుంటాడు. ఆమె సాక్షాత్తు పార్వతీదేవి అనే విషయాన్ని గ్రహించి .. భక్తి శ్రద్ధలతో నమస్కరిస్తాడు. కాశీ నగరంలోనే ఎప్పటికీ కొలువై ఉండమని ప్రార్థిస్తాడు. అందుకు అంగీకరించిన ఆ తల్లి అక్కడే కొలువై పూజలు అందుకుంటోంది. □

# వేడిగా తాగుతున్నారా ?



ఉదయం లేవగానే వేడి వేడి టీనో, కాఫీ మొదలుపెట్టినో తాగనిదే ఏ పనీరు చాలా మంది ఆడవాళ్లు. అంతలా అది మన జీవితంలో భాగమైంది మరి. దానివల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలూ ఎక్కువే. అయితే, దాన్ని ఎంత వేడిలో తాగుతున్నారన్నదీ ముఖ్యమే. వాతావరణం చల్లగా ఉందనో, నిద్ర పోగొట్టుకోవాలనో వేడిగా ఉండే టీ, కాఫీలు తాగడం అలవాటు కొందరికి. కానీ, బాగా వేడిగా ఉన్నవి అంటే... 65 డిగ్రీల సెంటీగ్రేడ్ కన్నా ఎక్కువ వేడిగా ఉన్నవి తాగితే 'స్క్యామస్ సెల్ కార్సి నోమా' అనే ఆహార నాళ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ క్యాన్సర్ అధ్యయనాలు చెబుతు న్నాయి. దీనికోసం పరిశోధకులు మిలియన్ ఉమన్ స్టడీ, యునైటెడ్ కింగ్డమ్ బయోబ్యాంక్ల డేటాను తీసుకొని పరిశీలించారు. మరీ అంత వేడిగా తాగని వాళ్లతో ప్రస్తుతం వీళ్లలో ఈ ప్రమాదం మూడు రెట్లు అధికమట. కాబట్టి, ఏదైనా వేడిగా తాగేముందు కొద్ది నిమిషాలు వేచి ఉండటం మంచిది . □

# పెసరుపప్పు పకోడి



పెసరుపప్పు : ఒక కప్పు
అల్లం : ఒక అంగుళం ముక్క
పచ్చిమిర్చి : రెండు
ఉల్లిపాయ : ఒకటి
కరివేపాకు : రెండు రెమ్మలు
కొత్తిమీర తరుగు : కొద్దిగా
పసుపు : పావు టీస్పూన్
గరం మసాలా : అర టీస్పూన్
కారం : అర టీస్పూన్
జీలకర్ర : ఒక టీస్పూన్
వాము : పావు టీస్పూన్
ఉప్పు : రుచికి తగినంత
నూనె : వేయించడానికి సరిపడా

**తయారీ:** పెసరుపప్పును శుభ్రంగా కడిగి.. ఒక గంటసేపు నానబెట్టాలి. నీళ్లను వంపేసి.. పప్పును మిక్సీ జార్‌లోకి తీసుకోవాలి. అందులో అల్లం ముక్క వేసి.. కాస్త బరకగా రుబ్బుకోవాలి. ఓ గిన్నెలో సన్నగా తరిగిన ఉల్లిపాయ, పచ్చిమిర్చి, కరివేపాకుతోపాటు కొత్తిమీర తరుగు, జీలకర్ర, వాము, ఉప్పు, పసుపు, కారం, గరం మసాలా వేసి బాగా కలపాలి. అందులోనే మిక్సీ పట్టుకున్న పెసరుపప్పును కూడా వేసుకొని మరోసారి బాగా కలపాలి. స్టవ్‌పైన కడాయి పెట్టి.. డీప్‌ఫ్రైకి సరిపడా నూనె పోసుకోవాలి. ఆయిల్ బాగా వేడెక్కిన తర్వాత.. మంటను సిమ్‌లో పెట్టుకొని, పిండిని కొద్దికొద్దిగా తీసుకుంటూ పకోడీలుగా వేసుకోవాలి. కడాయి నిండుగా పకోడీలు వేసుకున్న తర్వాత.. మంటను మీడియం ఫ్లేమ్‌లోకి మార్చుకోవాలి. పకోడీలను గంటెతో కలుపుతూ.. రెండు వైపులా ఎర్రగా, కరకరలాడేలా వేయించుకుని వేరే ప్లేట్‌లోకి తీసుకోవాలి. వర్షం పడుతున్నప్పుడు వీటిని వేడివేడిగా.. గ్రీన్ చట్నీ లేదా టమాటా సాస్‌తో కలిపి తింటే అద్భుతంగా ఉంటాయి.

# తెర

## 'ప్రేమనే ఊరిలో' ఎక్స్‌పీరియన్స్ చేసే సినిమా: సాయి కుమార్



డైలాగ్ కింగ్ సాయికుమార్ మాట్లాడుతూ ప్రేమనే ఊరిలో..ఆల్రెడీ ప్రూవ్డ్ ఫిలిం. ఇప్పటికే మంచి విజయం సాధించింది. ఇది ప్రతి ఒక్కరూ ప్రేమించే సినిమా, ఎక్స్‌పీరియన్స్ చేసే సినిమా. మన సినిమా. మన మట్టి సినిమా. మన ఊరి సినిమా. నేను త్వరలోనే ఈ సినిమాను థియేటర్స్‌లో మీతో పాటే కలిసి చూస్తాను. ఈ సినిమాను మీరంతా తప్పకుండా ఆదరిస్తారని తెలుసు. ఉన్నాయి. హీరో శ్రీరామ్ మాట్లాడుతూ మా "ప్రేమనే ఊరిలో.." సినిమాకు సాయికుమార్ లాంటి పెద్దల ఆశీర్వాదాలు దక్కడం చాలా సంతోషంగా ఉంది. ఆయన మా గురించి చెప్పిన ప్రతి మాటను మనసులో చిరకాలం దాచుకుంటాం. సాయికుమార్ లాంటి గొప్ప ఆర్టిస్టుల స్ఫూర్తి మాపై ఎప్పటికీ ఉంటుంది. హీరోయిన్ తపస్విని పునాచ మాట్లాడుతూ మా 'ప్రేమనే ఊరిలో..' సినిమాకు తెలుగు ఆడియెన్స్ ఇస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే హ్యాపీగా ఉంది. మేము థియేటర్ విజిట్స్ చేశాం. ప్రతి థియేటర్‌లో ఆడియెన్స్ సూపర్బ్‌గా ఎంజాయ్ చేస్తున్నారు. ప్రొడ్యూసర్ మమత దేవేంద్ర మాట్లాడుతూ మా సినిమాను తెలుగులో రిలీజ్ చేయాలనుకున్నప్పుడు మా బాబాయ్ ద్వారా సురేష్‌ని కలిశాం. ఆయన ఇక్కడే సినిమా చూశారు. సినిమా చూసిన తర్వాత ఆయన ఎలా రెస్పాండ్ అవుతారో అనుకున్నాం. సినిమా బాగుంది. డబ్బింగ్, సాంగ్స్ ఎవరితో చేయిద్దాం అంటూ మాట్లాడారు. నిర్మాత సురేష్ కొండేటి మాట్లాడుతూ "ప్రేమనే ఊరిలో..' సినిమాకు మంచి విజయాన్ని అందించిన తెలుగు ఆడియెన్స్ కు థ్యాంక్స్. ప్రేక్షకుల నుంచి వస్తున్న రెస్పాన్స్ చూసి థియేటర్స్, స్క్రీన్స్ పెంచాం. ఈ క్రమంలో నాకు మా టీమ్ అంతా సపోర్ట్ గా నిలిచారు. ఒక మంచి ఫీల్ గుడ్ మూవీ. ఫ్యామిలీ ఆడియెన్స్ కు బాగా కనెక్ట్ అవుతుందని ముందునుంచీ నమ్మకంతో ఉన్నాం.

## 'భారతీయుడు3' త్వరలో షూటింగ్ షురూ



యూనివర్సల్ హీరో కమల్ హాసన్, స్టార్ డైరెక్టర్ శంకర్, ప్రెస్టీజియస్ చిత్రాలను నిర్మిస్తోన్న భారీ నిర్మాణ సంస్థ కాంబోలో రూపొందుతోన్న చిత్రం భారతీయుడు3. 1996లో విడుదలైన బ్లాక్ బస్టర్ మూవీకి స్వీకెల్‌గా భారతీయుడు2, భారతీయుడు 3 చిత్రాలను కమల్, శంకర్ కాంబోలో రూపొందించ టానికి లైకా సంస్థ సిద్ధమైంది. అందులో భాగంగా 2024లో భారతీయుడు 2 విడుదలైన సంగతి తెలిసిందే. ఇప్పుడు దీనికి కొనసాగింపుగా భారతీయుడు3ను చిత్రీకరించటానికి మేకర్స్ సిద్ధమ య్యారు. ఇప్పటికే 'భారతీయుడు3'లో కొంత భాగాన్ని చిత్రీకరించారు. దానికి సంబంధించిన ఎడిటింగ్ వర్క్ శరవేగంగా జరుగుతోంది. 10 రోజుల్లో భారతీయుడు3'కి సంబంధించిన మిగిలిన భాగాన్ని పూర్తి చేయటానికి షూటింగ్‌ను స్టార్ట్ చేయబోతున్నారు. త్వరలోనే రిలీజ్ డేట్‌ను కూడా అనౌన్స్ చేస్తామని చిత్ర యూనిట్ తెలియజేసింది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేసింది. ముగ్గురు వ్యక్తులు గుర్రాలపై వేగంగా వెళుతుంటే దుమ్ము, దూళి రేగుతున్నట్లుగా ఉండే ఫొటో క్యూరియాసిటీని క్రియేట్ చేస్తోంది. భారతీయుడు 3 ఎలా ఉండబోతుందనే విషయాన్ని భారతీయుడు 2 క్లైమాక్స్‌లో చూపించారు.దక్షిణాది చిత్ర పరిశ్రమలో డిఫరెంట్ కంటెంట్ చిత్రాలను రూపొందించటంతో పాటు స్టార్స్‌తో భారీ బడ్జెట్ చిత్రాలను నిర్మిస్తూ తనదైన గుర్తింపు సంపాదించుకున్న సంస్థ లైకా ప్రొడక్షన్స్, అధినేత సుభాస్కరన్ ఇప్పుడు మరో ప్రెస్టీజియస్ మూవీగా భారతీయుడు3ని మనకు అందించటానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈసారి సేనాపతి లంచాన్ని అంతమొందించటానికి చేసే పోరాటం ఎలా ఉంటుందో బిగ్ స్క్రీన్‌పై చూసి ఎంజాయ్ చేయాల్సిందే. సాధారణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగి, వ్యాపార రంగంలో తనదైన ముద్ర వేసుకున్న దూరదృష్టి కలిగిన పారిశ్రామికవేత్త సుభాస్కరన్. వ్యాపార రంగంలో సాధించిన విజయాన్ని సినిమా రంగంలోనూ కొనసాగిస్తూ, లైకా ప్రొడక్షన్స్‌ను భారతీయ చిత్ర పరిశ్రమలో ప్రముఖ నిర్మాణ సంస్థగా నిలబెట్టారు.

## బహు భాషా చిత్రాల నటుడు నానాపటేకర్



లెజెండరీ యాక్టర్ నానా పటేకర్ మరణవార్త యావత్ సినీ లోకాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టేసింది. గోవాలో గుండెపోటుతో ఆయన కన్నుమూశారు అన్న వార్తను అభిమానులు ఇంకా జీర్ణించుకోలేక పోతున్నారు. నానా పటేకర్ తెలుగు ప్రేక్షకులకు సుపరిచతమే. ఆయన నటించిన కొన్ని సినిమాలు తెలుగులోకి డబ్ అయ్యి ఇక్కడి ప్రేక్షకులను ఆకట్టుకు న్నాయి. రజనీకాంత్ హీరోగా వచ్చిన 'కాలా' సినిమాలో విలన్ పాత్రలో అద్భుతంగా నటించారు. తమిళంతో పాటు తెలుగులోనూ విడుదలైన ఈ సినిమా ద్వారా ఇక్కడి ప్రేక్షకులకు దగ్గరయ్యారు. అలాగే, తమిళంలో భారతీ రాజా దర్శకత్వంలో వచ్చిన 'బొమ్మ లాట్టమ్' సినిమా తెలుగులో 'రాణా' పేరుతో డబ్ అయ్యింది. ఇందులో అర్జున్, కాజల్ అగర్వాల్‌తో పాటు నానా పటేకర్ (వెటరన్ యాక్టర్ నానా పటేకర్) ముఖ్య పాత్ర పోషించారు. 1951లో జన్మించిన నానా పటేకర్ అసలు పేరు విశ్వనాథ్ పటేకర్. 1978లో ఖిగమన్‌ఖి సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. హిందీతో పాటు మరాఠీ సినిమాల్లో ఎన్నో గుర్తుండిపోయే పాత్రలు పోషించారు. తన కెరీర్‌లో మూడు జాతీయ చలనచిత్ర పురస్కారాలను అందుకున్నారు. 'క్రాంతి వీర్' చిత్రానికి ఉత్తమ నటుడిగా, పరిందా, అగ్నిసాక్షి చిత్రాలకు ఉత్తమ సహాయనటుడిగా జాతీయ అవార్డు దక్కింది. సినీ పరిశ్రమకు అందించిన సేవలకు గానూ 2013లో కేంద్రం ఆయనను పద్మశ్రీ పురస్కారంతో గౌరవించింది. అదే ఏడాది మహారాష్ట్ర (మహారాష్ట్ర) ప్రభుత్వం రాజ్కపూర్ ప్రత్యేక సహకార అవార్డును ప్రదానం చేసింది. నానాపటేకర్ 1978లో మరాఠీ సినీ నటి, నిర్మాత నీలకంఠిని వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత కొన్ని కారణాల వల్ల వీరిద్దరూ విడివిడిగా ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు కాగా.. ఒక అబ్బాయి పుట్టిన రెండు సంవత్సరాలకే అనారోగ్య కారణాలతో కన్నుమూశాడు. మరో అబ్బాయి మల్హార్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.

## 'కామ్రేడ్ కళ్యాణ్' ప్రి రిలీజ్



ప్రెస్‌మీట్‌లో హీరో శ్రీ విష్ణు మాట్లాడుతూ.. అక్టోబర్ 9న 'కామ్రేడ్ కళ్యాణ్' రిలీజ్. దసరా సీజన్‌లో అందరూ ఫ్యామిలీతో కలిసి హ్యాపీగా ఈ సినిమాకు వెళ్లి మనస్ఫూర్తిగా ఎంజాయ్ చేయొచ్చు. పిల్లలకు కూడా ఈ సినిమా చాలా బాగా నచ్చుతుంది. మేము రిలీజ్ చేసిన కంటెంట్ అన్నిటికీ చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. కోన వెంకట్ మాట్లాడుతూ.. ఈరోజు మా కామ్రేడ్ కళ్యాణ్.. రేపట్నుంచి కామెడీ కళ్యాణ్ అవుతాడు. అందరి హీరోకి ఫ్యాన్స్ ఉంటారు. అందరి హీరోల ఫ్యాన్స్ కూడా శ్రీ విష్ణుని ఇష్టపడతారు. అందరివాడు అనే టైటిల్ శ్రీ విష్ణు సరిపోతుంది. తను అందరి హీరోలతో, అందరి అభిమానులతో కూడా చాలా బాగుంటాడు. డైరెక్టర్ జానకిరామ్ మాట్లాడుతూ.. నా దేవుడు శ్రీ విష్ణుకి, నా మెంటార్ కోన వెంకట్‌కి ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఈ సినిమా ఎంత అద్భుతం గా వచ్చి ప్రేక్షకుల ముందుకు వస్తుందంటే దానికి కారణం వారే. అలాగే మా నిర్మాత కిట్టు కూడా ఎంతో పాజిటివ్‌గా ఈ సినిమాని చేశారు. నిర్మాత వెంకట కృష్ణ మాట్లాడుతూ.. నిర్మాతగా ఇదినా తొలి సినిమా. శ్రీ విష్ణు , కోన చాలా సపోర్ట్ చేశారు.

## 'గుడ్ టైమ్' సినిమా 9న విడుదల



డైరెక్టర్ అనిల్ విశ్వనాథ్, హీరోయిన్ కామాక్షిభాస్కర్ల అతిథులుగా ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ దినేష్ కార్తీక్ మాట్లాడుతూ మా చిత్రం టీజర్, ట్రైలర్ మీరు చూశారు. టీజర్, ట్రైలర్ మీకు బాగా నచ్చాయి. రైటర్ అభిరామ్ మాట్లాడుతూ ఒక యావరేజ్ కుర్రాడి పీడకల ఈ సినిమా. అది ఎలా ఉంటుందో మీరే థియేటర్స్ లో చూడబోతున్నారు. ఎడిటర్ సాయి తరుణ్ మాట్లాడుతూ మా సినిమా మీకు రెండు గంటలు ఎంటర్ టైన్ మెంట్ అందిస్తుంది. మ్యూజిక్ డైరెక్టర్ నిర్వాణ్ ఆత్రేయ మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా ఈ సినిమాకు చాలా హార్డ్ వర్క్ చేస్తూ వస్తున్నాం. మా మూవీ సాంగ్స్ మీకు బాగా నచ్చాయని నమ్ముతున్నాం.నటుడు ధన్ రాజ్ మాట్లాడుతూ అల్వాల్ లో ఉండే ఒక లత్కోర్కగాని స్టోరీ ఇది. నిఖిల్, హ్రుతిక్ శెట్టి, నా కాంబినేషన్ సీన్స్ హిలేరియస్ గా వచ్చాయి. నటుడు హృతిక్ శెట్టి మాట్లాడుతూ అల్వాల్ బస్తీని దగ్గరగా చూసిన ఫీల్ మా సినిమాతో మీకు కలుగుతుంది. నటుడు హరి మున్నంగి మాట్లాడుతూ రీసెంట్‌గా అమీర్ లోగ్ చిత్రంలో నటించాను. ఆ సినిమాలో సాఫ్ట్ రోల్ చేశా. కానీ ఈ సినిమాలో మాత్రం కంప్లీట్ రఫ్ అండ్ టఫ్ క్యారెక్టర్ లో కనిపిస్తాను. నటి సౌందర్య లహరి మాట్లాడుతూ ఈ సినిమాలో ఫ్రెండ్ క్యారెక్టర్ చేశాను. ఈ జెనరేషన్ తో పాటు నిన్నటితరం వారికి కూడా మా సినిమా బాగా నచ్చుతుంది. సీయీవో ఐశ్వర్య జిల్లా మాట్లాడుతూ మా జర్నీలో ఇప్పటిదాకా 80 పర్సెంట్ సక్సెస్ అయ్యామని అనుకుంటున్నాం. థియేటర్స్ లో మీరు సినిమా చూసి ఆదరిస్తే 100 శాతం సక్సెస్ అవుతాం. ప్రొడ్యూసర్ రమేష్ జిల్లా మాట్లా డుతూ మా సినిమాకు పనిచేసిన నటీనటులు, టెక్నీషియన్స్ అందరికీ థ్యాంక్స్. ఈ రోజు ఈవెంట్ కు వచ్చి మీరంతా సపోర్ట్ చేయడం హ్యాపీగా ఉంది. థియేటర్స్ లో ఈ నెల 9న మా సినిమా రిలీజ్ అవుతోంది. నటి సునీత మనోహర్ మాట్లాడుతూ ఈ సినిమాల్లో ఇంపార్టెంట్ క్యారెక్టర్ లో నటించే అవకాశం రావడం హ్యాపీగా ఉంది.

## 'లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్': ప్రి బ్యాచలర్ పార్టీ



హర్ష చెముడు ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్', బాబు డెగాల దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని చవాన్, శ్రీధర్ చెని, దీపక్ ముస్త్యాల నిర్మించారు. రాజ్ సుహాస్, ప్రమదేశ్వి వి క్రియేటివ్ ప్రొడ్యూ సర్లుగా వ్యవహరించారు. అక్టోబర్ 9 నుంచి ప్రముఖ తెలుగు ఓటీటీ వేదిక 'లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' స్ట్రీమింగ్ కానుంది. ప్రీ బ్యాచిలర్ పార్టీ ఈవెంట్‌లో వైవా హర్ష మాట్లాడుతూ..ఈటీవీ అంటే మనకి ఇంటితో సమానం. చిన్నప్పటి నుంచి మనం ఈటీవీలో వచ్చే ప్రోగ్రామ్స్ చూస్తూనే పెరిగాము. నాలుగు నెలల్లో ఒక ప్రాజెక్ట్‌ను ఫినిష్ చేసి రిలీజ్ చేయడం అనేది ఒక కేస్ స్టడీ. షూటింగ్ అంతా చాలా కంఫర్టబుల్‌గా జరిగింది. ఈటీవీ సాయికృష్ణ మాట్లాడుతూ.. సందీప్‌కి థాంక్యూ. ఈ టైటిల్ పెట్టింది తనే. చవాన్ ప్రొడ్యూస్ చేశారు. నాలుగు నెలల్లో పూర్తి చేసి రిలీజ్ చేస్తున్నారు. ఈ సిరీస్‌లో ఈ క్యారెక్టర్ చేయడం అంత ఈజీ కాదు. హర్ష చాలా అద్భుతంగా చేశాడు. ఈ సినిమాలో నటించిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. డైరెక్టర్ బాబు మాట్లాడుతూ.. అందరికీ థాంక్యూ సో మచ్. ముందుగా ఈటీవీ సాయికి థాంక్యూ. ఈ జర్నీలో నాకు చాలా సపోర్ట్ చేశారు. మంత్ ఆఫ్ మధు సినిమా చూసి హర్షకి అభిమానిగా మారిపోయారు. ఆయన ఎక్కడా కూడా నటిస్తున్నట్టుగా కనిపించలేదు. హైపర్ ఆది మాట్లాడుతూ.. ఇది చాలా మంచి ఎంటర్ టైనర్. మీరందరూ చాలా ఎంజాయ్ చేస్తారు.

# నవంబరు 8న హైవోల్టేజ్ మ్యాచ్

## ఇండియా, పాకిస్థాన్ ఢీ




**న్యూఢిల్లీ:** భారత్, పాకిస్థాన్ జట్టు మరోసారి ఎదురెదురుపడనున్నాయి. పురుషుల సీనియర్ టీ20 జట్టు ఇటీవల ఏషియన్ గేమ్స్‌లో గోల్డ్ మెడల్ కోసం తలపడగా, త్వరలో అండర్ 19 జట్లు ఆసియా కప్, 2026లో పోటీ పడనున్నాయి. ఈ టోర్నీకి సంబంధించిన షెడ్యూల్ గురువారం విడుదలైంది. ఒమన్ ఆతిథ్యమివ్వనున్న ఈ టోర్నీ నవంబరు 5 నుండి 14వ తేదీ వరకూ జరగనుంది. మొత్తం ఎనిమిది జట్లు ఇందులో పాల్గొంటుండగా, ఈ టోర్నీలో పాకిస్థాన్ డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగనుంది. గత ఎడిషన్ ఫైనల్లో పాక్ భారత్‌ను 191 పరుగుల తేడాతో ఓడించి టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఆ ఓటమికి ప్రతీకారం తీర్చుకునేందుకు భారత్‌కు అవకాశం వచ్చింది. నవంబరు 8న జరిగే మ్యాచ్‌లో పాక్ భారత్‌ను ఢీకొంటుంది. ఈ మ్యాచ్ భారత్ కాలమానం ప్రకారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుంది. టోర్నీలోని అన్ని మ్యాచ్‌లు ఇదే సమయంలో ప్రారంభమవుతాయి. ఈ టోర్నీలో పాల్గొనే ఎనిమిది జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. గ్రూప్ ఎ లో భారత్, పాక్, యుఏఈ, నేపాల్ జట్లు ఉండగా, గ్రూప్ బి లో శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్ఘనిస్తాన్, మలేషియా జట్లు పోటీపడతాయి. గ్రూప్ దశలో ప్రతీ జట్టు తమ గ్రూప్‌లోని మిగిలిన మూడు జట్లతో తలపడుతాయి. 2 గ్రూపుల్లోనూ టాప్ 2జట్లు జెమీ ఫైనల్స్‌కు అర్హతసాధిస్తాయి. సెమీఫైనల్స్ రెండూనవంబరు 12న జరగనున్నాయి. అదేనెల 14న ఫైనల్ నిర్వహిస్తారు. టోర్నీలో మొత్తం 15 మ్యాచ్‌లు 50 ఓవర్ల ఫార్మాట్‌లోనే జరుగుతాయి. నవంబరు 5న జరిగే తొలి మ్యాచ్‌లో శ్రీలంక, మలేషియా జట్లు తలపడతాయి.

# ఆర్కిటిక్ ఓపెన్‌లో ప్రసాద్-పృథ్వీ జోడీ విజయం

## ప్రణయ్, శ్రీకాంత్ నిష్క్రమణ



**వాంటా (న్యూయార్క్):** ఆర్కిటిక్ ఓపెన్‌లో భారత్ తరఫున కృష్ణ ప్రసాద్ గరగ, పృథ్వీ కృష్ణమూర్తి రాయ్ జోడీ సంచలన విజయంతో అత్యుత్తమ ఫలితాన్ని అందించారు. గురువారం వాంటాలో జరిగిన పురుషుల డబుల్స్ ప్రీక్వార్టర్ ఫైనల్స్‌కు చేరేందుకు చైనాకు చెందిన ఐదో సీడ్ జోడీ హీ జీ టింగ్, రెన్ జియాంగ్ యూలను ఓడించారు. ఇక అనుభవజ్ఞులైన సింగిల్స్ ఆటగాళ్లు హెచ్‌ఎస్ ప్రణయ్, కిదాంబి శ్రీకాంత్ ఇక్కడ తొలి రౌండ్లలోనే నిష్క్రమించారు. తొలి గేమ్‌ను కోల్పోయినప్పటికీ, భారత్ జంట 61 నిమిషాల పాటు జరిగిన పోరులో చైనా జోడిని 10-21, 21-18, 22-20 తేడాతో ఓడించింది. ఇక ప్రపంచ ర్యాంకింగ్‌లో 31వ స్థానంలో ఉన్న శ్రీకాంత్, కెనడాకు చెందిన బ్రియాన్ యాంగ్‌పై తొలి గేమ్‌ను గెలుచుకుని మంచి ఆరంభం దిశగా సాగాడు. అయితే, మాజీ ప్రపంచ నంబర్ 1 అయిన అతను ఆ ఊపును కొనసాగించలేక చివరకు 15-21, 21-15, 21-13 తేడాతో ఓడిపోయాడు. నాలుగో సీడ్ ఆండర్స్ ఆంటోన్సెన్‌తో జరిగిన పోరులో ప్రణయ్ పోరాటం మరింత ఆకస్మికంగా ముగిసింది. గత నెలలో వియత్నాం ఓపెన్ సూపర్ 100 సెమీఫైనల్స్‌కు చేరుకున్న 34 ఏళ్ల ఈ భారత ఆటగాడు, ఆ డానిష్ ఆటగాడిపై ఆధిపత్యం చెలాయించలేక 21-10, 21-9 తేడాతో ఓటమి పాలయ్యాడు. ఇక క్వాలిఫయింగ్‌లో విజయం సాధించి తన జోరును కొనసాగించిన తరుణ్ మన్నేపల్లిపైనే ఇప్పుడు పురుషుల సింగిల్స్ డ్రాలో భారత ఆశలు ఆధారపడి ఉన్నాయి.




## క్వార్టర్ ఫైనల్స్‌కు సింధు

### తన్వి, తరుణ్ నిష్క్రమణ

**న్యూయార్క్:** రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు, జపాన్‌కు చెందిన రికో గుంజీని ఓడించి మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకోగా, గురువారం ఫిన్లాండ్‌లో జరిగిన ఆర్కిటిక్ ఓపెన్ సూపర్ 500 టోర్నమెంట్‌లో భారత పురుషుల సింగిల్స్ ఆటగాళ్లకు టోర్నమెంట్ నుండి నిష్క్రమణ ముగిసింది. జూలైలో జపాన్ ఓపెన్ సూపర్ 750 టైటిల్ గెలుచుకున్న హైదరాబాద్‌కు చెందిన 31 ఏళ్ల సింధు, రెండో రౌండ్‌లో జపాన్‌కు చెందిన రికో గుంజిపై 21 -15, 21-15 తేడాతో విజయం సాధించింది. ఆరో సీడ్ భారత క్రీడాకారుడు శుక్రవారం థాయ్‌లాండ్‌కు చెందిన టాప్ సీడ్, మాజీ ప్రపంచ ఛాంపియన్ రత్చానోక్ ఇంథానన్‌తో తలపడనున్నాడు. అయితే, వరుస గేమ్‌లలో ఓటమి పాలైన తరుణ్ మన్నేపల్లి, తన్వి శర్మలకు ఇది నిరాశాజనకమైన ప్రదర్శనగా నిలిచింది. ఫ్రాన్స్‌కు చెందిన రెండో సీడ్ క్రిస్టో పోపోవ్, మన్నేపల్లిని 21-14, 21-19 తేడాతో ఓడించగా, రాట్చానోక్ తన్విని 21-18, 21-7 తేడాతో ఏకపక్షంగా ఓడించింది. మాజీ ప్రపంచ నంబర్ 1 అయిన కిదాంబి శ్రీకాంత్ కూడా కెనడాకు చెందిన బ్రియాన్ యాంగ్ చేతిలో 21-15, 15-21, 13-21 తేడాతో ఓడిపోయి తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు.

# నేడు వెస్టిండీస్‌తో రెండో మ్యాచ్

## పట్టు సాధించే లక్ష్యంతో టీమిండియా






**రాంచి:** ఐదు మ్యాచ్‌ల టీ20ఐ సిరీస్‌లో తమ ఆధిక్యాన్ని మరింత పెంచుకోవాలని భారత్ చూస్తోంది. తొలి మ్యాచ్‌లో ఘోర పరాజయం పాలైన వెస్టిండీస్, శుక్రవారం రాంచీలో టీమిండియాతో తలపడనుంది. ఇప్పటికే ఈ సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉన్న భారత, ముఖ్యంగా ఓపెనర్‌గా సంజు సామ్సన్ స్థానం, బౌలింగ్ కూర్పు విషయంలో కొన్ని ఎంపిక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. సామ్సన్ తన గత నాలుగు ఇన్నింగ్స్‌లలో కేవలం 9, 7, 2, 11 పరుగులు మాత్రమే చేయడంతో ఈ వికెట్ కీపర్‌బ్యాటర్‌పై ఒత్తిడి పెరుగుతోంది. వైభవ్ సూర్యవంశీ జట్టులోకి రావడంతో, భారత్‌కు ఓపెనర్‌గా ప్రత్యామ్నాయం లభించింది. టీ20 వ్యూహంలో కీలక పాత్ర పోషించిన అభిషేక్ శర్మతో పాటు, అయ్యర్ ప్రదర్శన మిడిల్ ఆర్డర్‌లోని ఆందోళనలను తగ్గించింది. సిరీస్ ఆరంభ మ్యాచ్‌లో అతను సాధించిన తొలి టీ20ఐ సెంచరీ, ఛేజింగ్‌పై భారత్‌ను నియంత్రణలో ఉంచడమే కాకుండా, బ్యాటింగ్ విభాగానికి మరింత ఊపునిచ్చింది. మయాంక్ యాదవ్ తన తొలి ఓవర్‌లోనే 16 పరుగులు ఇవ్వడంతో, బౌలింగ్ కూర్పు కూడా పరిశీలనకు రావచ్చు. అతను చివరికి వెస్టిండీస్ టాప్ స్కోరర్, 56 పరుగులు చేసిన షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్‌ను అవుట్ చేసినప్పటికీ, మొత్తం మీద ధారాళంగా పరుగులు ఇచ్చాడు. నమన్ ధీర్ 3/31తో భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలవగా, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. భారత్ ప్రత్యామ్నాయ పేస్ బౌలింగ్ జోడీని పరిశీలించే అవకాశం ఉంది, అందులో నితీష్ కుమార్ కూడా ఒక ఎంపిక. అయితే, కొత్త బంతితో అతని ప్రయోగం ఎల్లప్పుడూ ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. ప్రారంభ మ్యాచ్‌లో భారత స్పిన్ బౌలింగ్ దాడి ముఖ్యంగా ప్రభావవంతంగా ఉంది. కుల్దీప్, అక్షర్ కలిసికట్టుగా బౌలింగ్ చేసి వెస్టిండీస్ బ్యాటింగ్ లైనప్‌ను కట్టడి చేయగా, ధీర్ తన ఆఫ్‌స్పిన్‌తో మరో ఎంపికను జోడించాడు.

ఇదిలా ఉండగా, సిరీస్‌ను సమం చేయడానికి వెస్టిండీస్‌కు మరింత బలమైన బ్యాటింగ్ ప్రదర్శన అవసరం. లక్నోలో షాయ్ హోప్, రూథర్‌ఫోర్డ్ అర్ధ సెంచరీలు సాధించారు, కానీ పవర్‌ప్లేలో మూడు వికెట్లు పడిన తర్వాత ఈ జోడీ ఇన్నింగ్స్‌ను పునర్నిర్మించింది. రాంచీ మరో ఆసక్తికరమైన సవాలును అందించవచ్చు. భారత్ జట్టులో శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, సంజు శాంసన్ (వికెట్‌కీపర్), తిలక్ వర్మ, శివం దూబే, వైభవ్ సూర్యవంశీ, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, నితీష్ కుమారె, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్ ఉన్నారు.



## చైనా స్మాష్ టేబుల్ టెన్నిస్.. సెమీఫైనల్‌కు మనుష్, ఠక్కర్ జోడీ

### సెమీస్‌లో దియా-మనుష్ ఔట్

**బీజింగ్:** చైనా స్మాష్ 2026, మనుష్ షా-మానవ్ ఠక్కర్ పురుషుల డబుల్స్ సెమీఫైనల్‌కు చేరగా, సెమీస్‌లో దియా-మనుష్ ఔటయ్యారు. గురువారం బీజింగ్‌లో జరిగిన చైనా స్మాష్ పురుషుల డబుల్స్ సెమీఫైనల్స్‌కు మనుష్ షా, మానవ్ థక్కర్ ముందంజ వేశారు. ఈ జంట చైనాకు చెందిన లియాంగ్ జింగ్‌కున్ మరియు జియాంగ్ పెంగ్‌లను వరుస గేమ్‌లలో 3-0 (11-9, 11-5, 11-4) తేడాతో ఓడించి సెమీఫైనల్‌లోకి ప్రవేశించారు. వారు ఇప్పుడు స్వీడన్‌కు చెందిన ఆంటోన్ కాల్‌బర్గ్, క్రిస్టియన్ కార్ల్‌సన్ లేదా దక్షిణ కొరియాకు చెందిన లిమ్ జోంగ్‌హూన్, ఓ జున్‌సంగ్‌లలో ఒకరిని ఎదుర్కొంటారు.

మ్యాచ్ సాగేకొద్దీ భారత ద్వితీయ శ్రేణి జట్టు మరింత ఆధిపత్యం చెలాయించడంతో, 19 నిమిషాల్లోనే విజయం లభించింది. ఇదిలా ఉండగా, మిక్స్‌డ్ డబుల్స్ సెమీఫైనల్స్‌లో మనుష్, దియా చితాలే జోడీ, చైనీస్ తైపీకి చెందిన లిన్ యున్‌జు, చెంగ్ ఐచింగ్ జోడీ చేతిలో 3-1 (11-7, 9-11, 12-10, 11-4) తేడాతో ఓడిపోయి టోర్నమెంట్ నుండి నిష్క్రమించింది.




# ఒకే వేదికగా అన్ని డిపాజిట్ల వివరాలు

## సిఎఎస్ యాప్ కోసం ఆర్బీఐ కసరత్తు

**ముంబయి, అక్టోబరు 8:** తమ కుటుంబం, పిల్లల భవిష్యత్తు కోసం వివిధ రకాల పెట్టుబడులు చేసే ఇన్వెస్టర్లకు బిగ్ రిలీఫ్ లభించనుంది. షేర్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్ మదుపరులకు సుపరిచితమైన కన్సాలిడేటెడ్ అకౌంట్ స్టేట్మెంట్ విస్తరణ దిశగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటి వరకు కేవలం షేర్లు, డిపాజిటరీ హోల్డింగ్స్, మ్యూచువల్ ఫండ్ పోర్ట్ ఫోలియోలకే పరిమితమైన సిఎఎస్ స్టేట్‌మెంట్లో త్వరలోనే వివిధ బ్యాంకుల్లో ఉన్న ఫిక్స్‌డ్ డిపాజిట్లు వివరాలు సైతం కనిపించనున్నాయి. అంటే ఇక నుంచి స్టాక్స్, మ్యూచువల్ ఫండ్స్‌తో పాటు బ్యాంక్ డిపాజిట్ల వివరాలు ఒకే చోట చూసుకోవచ్చు. ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను ట్రాక్ చేసేందుకు వివిధ రకాల యాప్స్ ఉపయోగిస్తుంటారు. ఆయా యాప్స్‌ని విడి విడిగా యాక్సెస్ చేయడం కొంచం ఇబ్బందిగా ఉంటుంది. ఇకపై ఇలాంటి ఇబ్బంది లేకుండా అన్నింటికీ ఒకే యాప్ ద్వారా యాక్సెస్ చేసే అవకాశం లభించనుంది. ఆర్థిక వివరాలన్నీ ఒకే చోట చూసుకునే విధంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక మార్పులు తీసుకురానుంది. కన్సాలిడేటెడ్ అకౌంట్ స్టేట్‌మెంట్‌లో ఒక వ్యక్తికి సంబంధించిన స్టాక్స్, మ్యూచువల్ ఫండ్స్, డీమ్యాట్ ఖాతా వివరాలు కనిపిస్తాయి. త్వరలోనే బ్యాంకుల్లోని ఫిక్స్‌డ్ డిపాజిట్ వివరాలు సైతం సిఎఎస్‌లో చేరనున్నాయి. దీంతో ఆదాయపు పన్నుకు సంబంధించిన ఫారం 26ఎఎస్ మాదిరిగా అన్ని పెట్టుబడులు ఒకే చోట తెలుసుకోవచ్చు. డిసెంబరు 31, 2026 నాటికి సిఎఎస్‌లో బ్యాంక్ డిపాజిట్లను కూడా చూపించే విధంగా సిస్టమ్ అప్డేట్ చేయాలని ఆర్‌బిఐ నిర్ణయించింది.

# రూ.11లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి

## భారీ నష్టాల్లో సెన్సెక్స్, నిఫ్టీ




**ముంబయి, అక్టోబరు 8:** భారత స్టాక్ మార్కెట్ గురువారర తీవ్ర సంక్షోభంలోకి జారిపోయి భారీ నష్టాలను చవిచూసింది. గ్లోబల్ మార్కెట్లలో ఉద్రిక్తతలు, ఆర్‌బిఐ వడ్డీ రేట్ల పెంపు, విదేశీ ఇన్వెస్టర్ల నిరంతర అమ్మకాల తీవ్రతతో దలాల్ స్ట్రీట్‌లో విక్రయాల సునామీ సృష్టించింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ మునుపటి ముగింపు స్థాయి నుండి 1,168.08 పాయింట్లు పడిపోయి 71,470.62 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 50 సూచీ 393.95 పాయింట్లు క్షీణించి 22,209.10 వద్ద ముగిసింది. ఈ తీవ్ర పతనం కారణంగా బిఎస్ఇలో నమోదైన కంపెనీల మొత్తం మార్కెట్ విలువ ముందురోజున్న రూ. 4,72, 35,273.39 కోట్ల నుండి ఏకంగా రూ. 10,41, 698.78 కోట్లుతగ్గి రూ. 4,61,93,574.61 కోట్లకు పడిపోయింది. మార్కెట్ పతనానికి ప్రధానంగా ఐదు బలమైన ప్రతికూల అంశాలు దోహదం చేశాయి.పశ్చిమ ఆసియాలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరిగి హోర్ముజ్ జలసంధిలో నౌకలపై దాడుల భయాలు నెలకొనడంతో బ్రెంట్ క్రూడ్ ధర 3 శాతానికి పైగా పెరిగి బ్యారెల్‌కు 103 మార్కుకు చేరింది. చమురు దిగుమతి వ్యయం పెరిగితే ద్రవ్యోల్బణం, కరెంట్ ఖాతా లోటు హెచ్చరిస్తాయనే భయాలు వ్యాపించాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు బుధవారం ఒక్కరోజే 6,100 కోట్లకు పైగా విలువైన భారతీయ షేర్లను విక్రయించడం మార్కెట్‌పై విపరీతమైన ఒత్తిడిని తెచ్చింది. ఆర్‌బిఐ తన కీలక రెపో రేటును 0.25 శాతం పెంచి 5.50 శాతానికి చేర్చడమే కాకుండా ద్రవ్యవిధాన వైఖరిని క్రమబద్ధమైన కఠినతరం వైపు మళ్లించడంతో డిసెంబర్ నాటికి రెపో రేటు 6శాతానికి చేరవచ్చనే ఆందోళనలు పెరిగాయి. అదానీ గ్రూప్ స్టాక్స్ పదునైన క్షీణతను నమోదు చేయడం మార్కెట్‌ను మరింత కుంగదీసింది. నిఫ్టీ 50లో అదానీ ఎంటర్‌ప్రైజెస్ అత్యధికంగా 8 శాతం పడిపోగా, అదానీ గ్రీన్ ఎనర్జీ 9 శాతం, అదానీ పవర్ 6 శాతం, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 5 శాతం మరియు అదానీ పోర్ట్స్ 4 శాతానికి పైగా పతనమయ్యాయి. రంగాల వారీగా పరిశీలిస్తే ఒక్క నిఫ్టీ ఐటీ 0.76 పెరుగుదల మినహా మిగిలిన అన్ని రంగాలు తీవ్ర నష్టాలను మూటగట్టుకున్నాయి. నిఫ్టీ మెటల్ అత్యధికంగా 3.27 శాతం, నిఫ్టీ ఆయిల్ గ్యాస్ 2.52 శాతం, నిఫ్టీ ఫార్మా 2.22 శాతం, నిఫ్టీ ఎఫ్ఎమ్‌సిజి 1.89 శాతం మరియు నిఫ్టీ ఆటో 1.85 శాతం చొప్పున పడిపోయాయి. డిజిటల్ చెల్లింపులపై మర్చంట్ ఫీజుల అమలు వాయిదా పడుతుందనే వార్తలతో పేటీఎం, మొబిక్విక్ షేర్లు 7.7 శాతం నష్టపోగా, ఐటీసీ షేరు 3 శాతం క్షీణించింది. కమోడిటీ మార్కెట్‌లో బ్రెంట్ ముడిచమురు డిసెంబరు సెటిల్‌మెంట్‌ధర 4.29 డాలర్లు పెరిగి బ్యారెల్‌కు 104.49 డాలర్లు కొనసాగింది. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో భారత రూపాయి 96.85గా నమోదయింది. ముందురోజు 96.75తో పోలిస్తే మరింత క్షీణించింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు డిసెంబరు 4వ తేదీ సెటిల్‌మెంట్‌దరలు 0.14శాతంపెరిగి రూ.1,49, 319కి చేరాయి.

# రైట్స్ ఇష్యూద్వారా ఓలా ఎలక్ట్రిక్ రూ.1000 కోట్ల సమీకరణ




**ముంబయి, అక్టోబరు 8:** రైట్స్ ఇష్యూ ద్వారా రూ.1,000 కోట్ల నిధుల సమీకరణకు ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు ఆమోదం తెలిపింది. కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో, గరిష్టంగా రూ.1,000 కోట్ల విలువైన పాక్షికంగా చెల్లించిన ఈక్విటీ షేర్లను రైట్స్ ఇష్యూ ద్వారా జారీ చేయడానికి ఆమోదం లభించింది. ఇందులో భాగంగా సెబీకి నివేదిక సమర్పించింది. మొత్తం రూ.999.74 కోట్ల విలువైన 37.03 కోట్ల పాక్షికంగా చెల్లించిన ఈక్విటీ షేర్ల రైట్స్ ఇష్యూ నిబంధనలకు బోర్డు ఆమోదం తెలిపింది. ఒక్కో షేరుకు రూ.27 ధర (ఇందులో రూ.17 ప్రీమియం కలిసి ఉంది) నిర్ణయించారు. భవిష్ అగర్వాల్ నేతృత్వంలోని ఈ సంస్థ, రైట్స్ ఎంటైటిల్‌మెంట్ పొందడానికి అర్హులైన వాటాదారులను నిర్ణయించడానికి ఈనెల 13ను రికార్డ్ తేదీగా నిర్ణయించింది. ఈ ఇష్యూ ఈనెల 22న ప్రారంభమై 30న ముగుస్తుంది. రైట్స్ ఎంటైటిల్‌మెంట్లను మార్కెట్ ద్వారా బదిలీ చేయడానికి అక్టోబరు 26, 2026, సోమవారం వరకు అవకాశం ఉంటుందని సంస్థ తెలిపింది. రికార్డ్ తేదీ నాటికి పూర్తి చెల్లింపు జరిగిన ఈక్విటీ షేర్లను కలిగి ఉన్న అర్హులైన వాటాదారులకు, ప్రతి 25 షేర్లకు 2 రైట్స్ ఈక్విటీ షేర్ల చొప్పున కేటాయింపు నిష్పత్తిని బోర్డు నిర్ణయించింది. ఆర్థిక సంవత్సరం ఈ ఏడాది తమొదటి త్రైమాసికంలో ఈ ఈవీ తయారీ సంస్థ ఏకీకృత నికర నష్టం రూ.336 కోట్లకు తగ్గింది.




## షెడ్యూల్డు బ్యాంకుల జాబితానుంచి పేటిఎం తొలగింపు

**ముంబయి, అక్టోబరు 8:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం1934లోని రెండో షెడ్యూల్ నుంచి పేటిఎం పేమెంట్స్ బ్యాంక్‌ను మినహాయించినట్లు ఆర్బీఐ ఒక నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. సాధారణంగా షెడ్యూల్డ్ బ్యాంకులుగా గుర్తింపు పొందిన బ్యాంకుల వివరాలు ఈ జాబితాలో ఉంటాయి. జూలై 31న జారీ చేసిన ఈ నోటిఫికేషన్‌ను సెప్టెంబర్ 7న గెజిట్ ఆఫ్ ఇండియాలో ప్రచురించారు. నియంత్రణ నిబంధనలను పదేపదే ఉల్లంఘిస్తుండటంతో, ఈ యేడాది ఏప్రిల్‌లోనే పేటిఎం పేమెంట్స్ బ్యాంక్ లైసెన్స్‌ను ఆర్బీఐ రద్దు చేసింది. సంస్థ కార్యకలాపాలు డిపాజిటర్ల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా ఉన్నాయని ఆ సమయంలో కేంద్ర బ్యాంకు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. కొన్నేళ్లుగా పేటిఎం పేమెంట్స్ బ్యాంక్ ఆర్బీఐ నిశిత పర్యవేక్షణలో కొనసాగుతోంది. 2022 మార్చిలో పలు లోపాలను గుర్తించిన ఆర్బీఐ, కొత్త కస్టమర్లను చేర్చుకోకుండా బ్యాంకుపై నిషేధం విధించింది. సమగ్ర ఐటీ ఆడిట్ కోసం స్వతంత్ర సంస్థను నియమించాలని ఆదేశించింది.

# టిసిఎస్ నికరలాభం రూ.13,884 కోట్లు




**ముంబయి, అక్టోబరు 8:** దేశంలోని అతిపెద్ద ఐటీ కంపెనీ, టాటా గ్రూప్ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఆర్థిక ఫలితాల్లో అదరగొట్టింది. ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ఏకీకృత నికర లాభం రూ.13,884 కోట్లుగా చూపించింది. గత యేడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.12,075 కోట్లతో పోలిస్తే ఈసారి కంపెనీ నికర లాభం 15 శాతం మేర పెరిగినట్లు తెలిపింది. ఈ క్రమంలో తమ షేర్ హోల్డర్లకు శుభవార్త చెప్పింది. ఈ ఆర్థిక సంవత్సరంకుగానూ రెండో మధ్యంతర డివిడెండ్ చెల్లిస్తామని, ఒక్కో షేరుకు రూ.12 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. ఈ మేరకు గురువారం రోజున త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. ఈ ఆర్థిక యేడాది రెండో త్రైమాసికంలో టిసిఎస్ ఆపరేషన్స్ రెవెన్యూ ఇయర్ ఆన్ ఇయర్ ప్రాతిపదికన చూసుకుంటే 11 శాతం వృద్ధితో రూ.73,188 కోట్లుగా చూపించింది.

గతేడాది ఇదే సమయంలో కంపెనీ ఆదాయం రూ.65,799 కోట్లుగా ఉంది. కాన్స్టంట్ కరెన్సీ టర్మ్స్‌లో రెవెన్యూ క్వార్టర్ టూ క్వార్టర్ ప్రాతిపదికన 0.5 శాతం పెరగింది. ఆపరేటింగ్ మార్జిన్ 24 శాతంగా ఉండగా, నెట్ మార్జిన్ 19 శాతంగా ఉందని టిసిఎస్ తెలిపింది. అంతర్జాతీయ మార్కెట్లలో, చాలా పరిశ్రమ విభాగాలలో కంపెనీ విస్తృత వృద్ధిని సాధించిందని సిఇఒ, ఎండి కె. కృతివాసన్ అన్నారు. పోర్షే, బెస్ట్ బై ఒప్పందాలు ఒక కొత్త తరహా పరివర్తన భాగస్వామ్యాలను సూచిస్తున్నాయన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని పెద్ద ఎత్తున పారిశ్రామికీకరించడానికి టిసిఎస్ తన క్లయింట్లతో కలిసి పునరావృతమయ్యే ప్లాట్‌ఫారమ్‌లను నిర్మిస్తోందని ఆయన అన్నారు. రెండవ త్రైమాసికంలో వార్షిక ఎఐ ఆదాయం 3.1 బిలియన్ డాలర్లకు చేరుకుని, మొత్తం ఆదాయంలో 10 శాతం దాటిందని తెలిపారు. ఎఐ నేటివ్ సొల్యూషన్స్, ఎఐ ఆధారిత ఎంటర్‌ప్రైజ్ ట్రాన్స్‌ఫర్మేషన్, అటానమస్ గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్, సైబర్‌సెక్యూరిటీ రంగాల నుంచి డిమాండ్ రావడంతో, ఎఐ రంగంలో ఊపు బలంగా కొనసాగుతోందని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ప్రెసిడెంట్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఆర్తి సుబ్రమణియన్ అన్నారు. సెప్టెంబర్ త్రైమాసికంలో కంపెనీ మొత్తం కాంట్రాక్టుల విలువ 9.6 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు టిసిఎస్ తెలిపింది. బలహీన ఐటి డిమాండ్ వాతావరణాన్ని ఇది సూచిస్తోందని పేర్కొంది. వ్యూహాత్మక భాగస్వామ్యాల్లో పోర్షే ఏజీతో 5 యేళ్ల భాగస్వామ్యం, ఎంహెచ్‌పీ, పోర్షే జర్మనీ మేనేజ్మెంట్ అండ్ ఐటి కన్సల్టింగ్ సబ్సిడరీ కొనుగోలు ప్రతిపాదన ఉన్నట్లు పేర్కొంది. భారతదేశంలోని బెస్ట్ బై గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్‌ను టిసిఎస్‌కు బదిలీ చేసి, దానిని ఎఐ కెపాబిలిటీ సెంటర్‌గా మార్చేందుకు ఒక ఒప్పందాన్ని కూడా టిసిఎస్ ప్రకటించింది. ఫలితాల ప్రకటన నేపథ్యంలో టిసిఎస్ షేరు ఒడుదొడుకులకులోనై చివరకు ఫ్లాట్‌గా ముగిసింది. 0.16 శాతం నష్టంతో రూ.2077 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో రూ.2104 వద్ద లాభాల్లో ప్రారంభమై ఒక దశలో రూ.2141.50 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని తాకింది. ఆ తర్వాత పడిపోయింది. రూ.2060 వద్ద కనిష్ఠాన్ని తాకి చివరకు రూ.2077 వద్ద స్థిరపడింది. ఈ స్టాక్ 52 వారాల గరిష్ఠ ధర రూ.3350 వద్ద ఉండగా కనిష్ఠ ధర రూ.1976 వద్ద ఉంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.